ఆదివారం
28•7•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 9 • సంచిక 33
• పేజీలు: 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## పురపోరుకు ప్రచార వ్యయం ఖరారు

జీహెచ్ఎంసీలో వార్డుకు 5 లక్షల వరకు అనుమతి
కార్పొరేషన్లలో 1.5 లక్షలు, మున్సిపాలిటీల్లో లక్ష
ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

2

## విద్యుత్ వాహనాలకు ఊతం

9

తగ్గిన జీఎస్టీ
గతంలో 12%
ఇప్పుడు 5%

- చార్జింగ్ స్టేషన్లపైనా 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు
- కొత్త రేట్లు వచ్చే నెల 1 నుంచి అమలు
- జీఎస్టీ మండలి నిర్ణయాన్ని స్వాగతించిన పరిశ్రమ వర్గాలు



## సిల్వర్ పంచ్

నిఖత్, హుస్సాముద్దీన్‌కు రజత పతకాలు
పోరాడి ఓడిన రాష్ట్ర యువ బాక్సర్లు
థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీ

వివరాలు ఆటలో



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



హెచ్‌టీ, మింట్‌ఆసియా నాయకత్వ సదస్సుకు రండి
భారత్, ప్రపంచ సమస్యలపై చర్చలో పాల్గొనండి
హిందుస్థాన్ టైమ్స్ ఈడీ శోభన భారతీయ లేఖ
సింగపూర్‌లో సెప్టెంబర్ ఆరో తేదీన సదస్సు
గత సదస్సులకు వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానులు హాజరు

# సీఎం కేసీఆర్‌కు విశిష్ట ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హిందుస్థాన్ టైమ్స్ (హెచ్‌టీ)- మింట్ ఆసియా నాయకత్వ సదస్సు రెండో ఎడిషన్‌లో పాల్గొనాలని సీఎం కేసీఆర్‌ను హిందుస్థాన్ టైమ్స్ మీడియా లిమిటెడ్ చైర్‌పర్సన్, ఎడిటోరియల్ డైరెక్టర్ శోభన భారతీయ ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు ఆహ్వానలేఖ పంపారు. సింగపూర్‌లో సెప్టెంబర్ 6న హిందుస్థాన్ టైమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో విశిష్టవక్తగా పాల్గొనాలని లేఖలో ఆమె కోరారు. భారత్, ఇరుగు పొరుగుదేశాలు, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించేందుకు హెచ్‌టీ మిషన్‌లో భాగంగా 2003లో హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్ ఇండియన్ చాప్టర్‌ను ప్రారంభించినట్టు లేఖలో పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన 16 సదస్సులు పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాయని, ఆయా సదస్సులకు అప్పటి భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, అమెరికా అధ్యక్షులు జార్జిబుష్, బరాక్ ఒబామా, బ్రిటన్ ప్రధానమంత్రులు డేవిడ్‌కామెరాన్, గార్డన్ బ్రౌన్, బౌద్ధ మతగురువు దలైలామా, భారత ప్రధాని నరేంద్రమోదీ వక్తలుగా హాజరైనట్టు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే సదస్సులో ఆసియాదేశాల్లోని నాయకులందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి సింగపూర్ చాప్టర్‌పై చర్చించి ఒక రోడ్‌మ్యాప్ రూపొందించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. 'ఆసియా ఇన్ ది న్యూ గ్లోబల్ కాంటెక్స్ట్' అనే ఇతివృత్తంతో సదస్సు నిర్వహిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

# బాహుబలి రెడీ

ఆగస్టులో వెట్‌రన్‌కు సర్వం సిద్ధం

- రామడుగులో భారీ మోటర్ డ్రైరన్ సక్సెస్
- పర్యవేక్షించిన విద్యుత్ సీఎండీ ప్రభాకర్‌రావు
- కాళేశ్వరంలో కీలక ఘట్టానికి పూర్తయిన కసరత్తు

## గోలివాడను ముద్దాడిన ప్రాణహిత జలాలు

హెడ్ రెగ్యులేటరీ గేట్లను తాకిన గంగమ్మ • ఫోర్‌బేలోకి వదిలి పంపులకు పరీక్షలు
నేడు 1వ మోటర్ వెట్‌రన్ ప్రక్రియ ప్రారంభం • రేపట్నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోత
నెరవేరనున్న ప్యాకేజీ 1 లక్ష్యం • కన్నెపల్లిలో నేడు ఏడో మోటర్ వెట్‌రన్
మేడిగడ్డ దగ్గర తగ్గుతున్న నీటిమట్టం

**హైదరాబాద్/ మంథని/ కాళేశ్వరం/ మహదేవ్‌పూర్/ జయశంకర్ భూపాల్‌పల్లి, నమస్తే తెలంగాణ:**

ప్రాణహిత జలాలు కాళేశ్వరం ప్రాజెక్టులో ఎదురెక్కి పరవళ్లు తొక్కుతూ.. అన్నారం పంప్‌హౌస్ ద్వారా సుందిల్ల బరాజ్‌ను నింపి.. సుందిల్ల పంపుహౌస్‌కు చేరుకున్నాయి. దిగువన కన్నెపల్లి, కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్‌లో మోటర్లు నిరంతరం నడుస్తుండటంతో కాళేశ్వరం జలాలు శనివారం అంతర్గాం మండలం గోలివాడ సమీపంలోని సుందిల్ల పంప్‌హౌస్ హెడ్ రెగ్యులేటరీ గేట్లను తాకాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు పంప్‌హౌస్ ఫోర్‌బేలోకి నీటిని వదిలి పంపులకు పరీక్షలు మొదలుపెట్టారు. ఆదివారం ఒకటవ మోటర్‌కు వెట్‌రన్ ప్రక్రియ ప్రారంభించి, సోమవారం ఎల్లంపల్లిలోకి జలాలను ఎత్తిపోసేందుకు కాళేశ్వరం ఈఎన్సీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్నద్ధమవుతున్నారు. మరోవైపు యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలక ఘట్టమైన బాహుబలి మోటర్ ప్రారంభానికి కసరత్తు పూర్తయింది. ఆసియాఖండంలోనే ఇప్పటివరకు ఉపయోగించని విధంగా రామడుగులో ఏర్పాటుచేసిన 139 మెగావాట్ల మోటర్లు.. నీటిని ఎత్తిపోసేందుకు అన్నివిధాలా సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాలతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, సాగునీటి (ఎత్తిపోతల) సలహాదారు పెంటారెడ్డి హుటాహుటిన శనివారం రామడుగు వెళ్లారు. అక్కడ విజయవంతంగా నిర్వహించిన బాహుబలి మోటర్ డ్రైరన్‌ను పర్యవేక్షించారు

**సోమవారం నుంచే ఎల్లంపల్లిలోకి ఎత్తిపోతలు**

ముఖ్యమంత్రి కేసీఆర్ నేర్పిన నడకతో తన దిశను మార్చుకొని మేడిగడ్డ నుంచి

మిగతా 3వ పేజీలో



అన్నారం పంప్‌హౌస్ డెలివరీ చానల్ గుండా సుందిళ్ల బరాజ్‌లోకి చేరుతున్న నీరు.

| బరాజ్‌లలో నీటినిల్వ | |
|---|---|
| మేడిగడ్డ: | 4.7 టీఎంసీలు |
| అన్నారం: | 7.87 టీఎంసీలు |
| సుందిల్ల: | 3.6 టీఎంసీలు |

### జర్నలిస్టులతో 'జల'భోజనాలు

కాళేశ్వరం సందర్శనకు మీడియా ప్రతినిధులు: సీఎం కేసీఆర్ నిర్ణయం

2



వెట్‌రన్‌కు సిద్ధమైన రామడుగులోని 139 మెగావాట్ల బాహుబలి మోటర్



థానె సమీపంలోని బద్లాపూర్ వద్ద వర్షపు నీటిలో చిక్కుకుపోయిన మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రయాణికులను రక్షిస్తున్న సహాయ సిబ్బంది

## నడిసంద్రంలో రైలు

థానెలో వరదనీటిలో చిక్కుకున్న మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్
ఇరువైపులా ఆరడుగుల మేర వరదనీరు
రైలులో 1,050 మంది ప్రయాణికులు
తిండి, నీరు లేక 17 గంటలు నరకయాతన
చివరకు రక్షించిన సహాయ సిబ్బంది
మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

5

## పొంగిన వాగులు, వంకలు

చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు
రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు.. పలుచోట్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
వచ్చే మూడ్రోజులు వర్షాలు.. 31న మరో అల్పపీడనం

7



శనివారం సాయంత్రం నిజామాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 305.00 | రంగారెడ్డి | 305.00 |
| మెదక్ | 305.00 | కరీంనగర్ | 308.00 |
| వరంగల్ | 308.00 | చిల్లర ధర | 3.65 |

## రెవెన్యూ అవినీతిపై బదిలీ అస్త్రం

- 183 మంది వీఆర్వోలకు మూకుమ్మడి స్థానచలనం
- సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్ సంచలనం
- వెంటనే కొత్తస్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు
- ఇప్పటికే 14 మంది వీఆర్వోలపై సస్పెన్షన్ వేటు

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ:**

సూర్యాపేట జిల్లాలో ఒకేరోజు 183 మంది వీఆర్వోలను మూకుమ్మడిగా బదిలీ చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. సుదీర్ఘకాలం ఒకేచోట పనిచేయడంతోపాటు భూరికార్డుల ప్రక్షాళనలో అలసత్వం, భారీ అవినీతి ఆరోపణల కారణాలతో వారిని బదిలీచేశారు. బదిలీ అయిన వీఆర్వోలు వెంటనే నూతన స్థానాల్లో రిపోర్టు చేసి విధులు నిర్వర్తించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అవినీతి కారణాలతోనే గత రెండు నెలల్లో 14 మంది వీఆర్వోలను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు తాసిల్దార్లపైనా వేటువేశారు. మరో 15 మంది తాసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ వీఆర్వోలపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వస్తుండటంతో జిల్లాలో పనిచేస్తున్న 210 మంది వీఆర్వోలలో 183 మందిని ఒక్క సంతకంతో బదిలీచేశారు. కలెక్టర్ నిర్ణయం రెవెన్యూతోపాటు ఇతరశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కలవరం కలిగించింది. జిల్లాలోని 23 మండలాల్లోనూ బదిలీలు జరిగాయి. బదిలీ అయిన వీఆర్వోల వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. అనంతగిరిలో- 6, ఆత్మకూర్(ఎస్)- 9,

మిగతా 11వ పేజీలో

సండే స్పెషల్

## మన అవసరం.. జలచైతన్యం

- ఊరికి చెరువే ఊపిరి
- పట్నానికి ఇంకుడుగుంతే ప్రాణం
- వాటితోనే భూగర్భజలాల రీచార్జ్
- ఆదర్శనీయంగా తుర్క్‌మెనిస్థాన్

**ఒక్కో** నీటిచుక్క విలువెంత? లీటరు వాటర్‌బాటిల్ వందరూపాయలు పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి ఎదుర్కొన్న చెన్నైవాసులు చెప్తారు! లేదంటే.. నీళ్లకోసం మైళ్లకొద్దీ దూరం నడిచే లాతూర్ వాసులు చెప్తారు. వారికి ఎందుకంత దుస్థితి? చెన్నపట్నంలోని ప్రధాన జలాశయాల్లో నీటినిల్వ ఒక్కశాతానికి పడిపోయింది! దాదాపు 33% భూమి కాంక్రీట్‌మయం అయిపోయింది! కురిసేవాన ఇంకే చోటు లేదు! వీటికితోడు లోటు వర్షపాతం! ఫలితం.. కనీవినీ ఎరుగని నీటిఎద్దడి! నీటి సంరక్షణ విషయంలో ప్రజలు ఇప్పటికైనా చైతన్యవంతులుకాకపోతే.. చెన్నై మాత్రమేకాదు.. సమీప భవిష్యత్తులో మరెన్నో నగరాలు, పట్టణాలు ఈ దుస్థితిని ఎదుర్కొనబోతున్నాయి! మరి పరిష్కారం లేదా? ఉన్నది. అది కొత్తదేమీ కాదు. కాకపోతే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నది. అవే ఇంకుడు గుంతలు.. చెరువులు!

12

## పొలం ఉన్నా లేనట్టే..

ధర్మగంట

రెవెన్యూ అధికారులు సర్వే చేయరు.. హద్దులు చూపరు
ఎన్ని అర్జీలు పెట్టుకొన్నా పట్టించుకోరు
నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ రైతు ఆబ్దిన్ ఆవేదన

4

**తన** పేరిట భూమి ఉన్నది. కానీ ఎక్కడుందో తెలియదు. సర్వే నంబర్ ఉన్నది. పట్టా కూడా ఉన్నది. కానీ మోఖా మీద పొలం లేదు. కాగితాల్లో ఉన్న సర్వే నంబర్ మీదకు పోతే.. అక్కడ అప్పటికే వేరేవాళ్లు సాగుచేసుకొంటున్నారు. ఈ భూమి తమదేనంటున్నారు. రెవెన్యూ అధికారుల దగ్గరకు వెళ్లి అయ్యా నా భూమి నాకు చూపించండని మొరపెట్టుకొంటే.. పట్టించుకొనేవారే లేరు. సర్వే చేయాలని కోరితే చేయరు. చేసినా రిపోర్టు ఇవ్వరు. హద్దులు చూపించరు. భూమి జాడ తెలియక.. వెతికిపెట్టేవారు లేక నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామానికి చెందిన ఎండీ ఆబ్దిన్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



తన పట్టాదార్ పాస్‌పుస్తకం చూపుతున్న రైతు ఆబ్దిన్

### బాధితులకు పాస్‌పుస్తకాలు ఇస్తాం

ఆర్డీవో ఆదేశాలతో ప్రకటించిన మోటకొండూర్ తాసిల్దార్
'సాదా వ్యథ @ 26 ఏండ్లు!' కథనానికి స్పందన

4

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE




# ఏడాదైనా అందని పాస్‌పుస్తకాలు

- వీఆర్వో కక్షసాధింపు ధోరణే కారణం
- నిజామాబాద్ జిల్లా ఎరాజ్‌పల్లి రైతుల ఆవేదన

**ఎడపల్లి:** కొత్త పాస్‌పుస్తకాల కోసం ఏడాది నుంచి తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనికరించడంలేదని నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన రైతులు గైని భూమయ్య, కట్టమీది మల్లయ్య, బేగరి చిన్న పోశెట్టి, పోతురాజు అవునాబాయి ఆవేదన వ్యక్తంచేశారు. 2002లో ప్రభుత్వం ఈ నలుగురు రైతులకు ఎడపల్లి మండలం మల్లెపాడ్ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్లు 96/2, 96/3, 96/4, 97/1లలో ఎకరం చొప్పున కేటాయించింది. పాస్‌పుస్తకాలతోపాటు 1-బీ, ఆన్‌లైన్ పహాణీలు, పట్టామార్పిడి సర్టిఫికెట్లను కలిగివున్న ఆ రైతులు.. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా కొత్త పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకొన్నారు. ఏడాది నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వారికి కొత్త పుస్తకాలను జారీచేయలేదని బాధితులు వాపోయారు. వీఆర్వో సంజీవ్ బంధువుల నుంచి తాము కొంత భూమిని కొనడమే ఇందుకు కారణమని, ఆ భూములు ఆయనకు దక్కలేదన్న అక్కసుతోనే సంజీవ్ తమకు కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వడంలేదని బాధితులు ఆరోపిస్తూ ఎడపల్లి తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశారు.



### రైతుబంధు కోల్పోయాం

కొత్త పాస్‌పుస్తకం కోసం ఏడాది నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదు. ఈ విషయమై తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందించలేదు. కొన్నేండ్ల నుంచి మేము ఆ భూములను సాగుచేసుకొంటున్నాం. వాటికి సంబంధించి గతంలో అధికారులు జారీచేసిన పాత పాస్‌పుస్తకాలతోపాటు పట్టామార్పిడి సర్టిఫికెట్లు, 1-బీ రికార్డులు మా వద్ద ఉన్నాయి. ఆన్‌లైన్‌లోనూ పట్టాలున్నాయి. అయినా ఆ భూములు మావి కావని వీఆర్వో అంటున్నారు. దీంతో మేము 'రైతుబంధు' సాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

- గైని భూమయ్య, రైతు, ఎరాజ్‌పల్లి

### డబ్బుల కోసం రాయబారాలు

మల్లెపాడ్‌లో నాకు ఎకరం భూమి ఉన్నది. అన్ని పత్రాలున్న ఈ భూమికి కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరుతుంటే.. వీఆర్వో సంజీవ్ ఏడాది నుంచి తాత్సారం చేస్తున్నాడు. డబ్బులిస్తేనే పాస్‌పుస్తకం ఇస్తానంటూ మధ్యవర్తుల ద్వారా సంజీవ్ రాయబారాలు నడుపుతున్నాడు. ఆయన వైఖరిపై తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశాం.

- పోశెట్టి, రైతు, ఎరాజ్‌పల్లి



### విచారణ జరిపి చర్యలు చేపడుతాం

ఎరాజ్‌పల్లి రైతులు భూమయ్య, మల్లయ్య, పోశెట్టి, పోతురాజుకు మల్లెపాడ్ శివారులో ఉన్న భూములపై పూర్తి విచారణ జరిపి వారికి కొత్త పాస్‌పుస్తకాలు అందేలా చూస్తా. వీఆర్వో సంజీవ్‌పై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరిపి చర్యలు చేపడుతాం.

- అశోక్‌కుమార్, ఎడపల్లి తాసిల్దార్



### వీఆర్వో కక్షసాధిస్తున్నారు


వీఆర్వో సంజీవ్ మా ఊరివాడే. ఆయన బంధువుల భూములను కొన్నామన్న కోపంతోనే మాకు కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా కక్షసాధిస్తున్నాడు. ఇదేమని అడిగితే ఆ భూములే మావి కాదంటున్నాడు. భూముల పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా, వాటిని ఆధారాలతో సహా అందజేసినా పాస్‌పుస్తకాలు ఇవ్వడంలేదు. ఫలితంగా మేము రైతుబంధు సాయం కోల్పోయాం.

- మల్లయ్య, రైతు, ఎరాజ్‌పల్లి

## బాధితులకు పాస్‌పుస్తకాలు ఇస్తాం

- ఆర్డీవో ఆదేశాలతో ప్రకటించిన మోటకొండూర్ తాసిల్దార్
- 'సాదా వ్యథ @ 26 ఏండ్లు!' కథనానికి స్పందన

**యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ:** 'సాదా వ్యథ @ 26 ఏండ్లు!' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో మే 6న ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం చందేపల్లి గ్రామానికి చెందిన ఎన్నె సత్తిరెడ్డి అదే గ్రామానికి చెందిన తన సమీప బంధువైన ఎన్నె మల్లారెడ్డి వద్ద 8.19 ఎకరాల భూమిని 12 జనవరి, 1993లో సాదాబైనామా ద్వారా కొన్నారు. వీటికి సంబంధించిన పాస్‌పుస్తకాలు సైతం ఎన్నె సత్తిరెడ్డి కుమారులైన ఎన్నె రామిరెడ్డి, కృష్ణారెడ్డి, సిద్ధారెడ్డికి అందించి.. అనంతరం ఆకారణంగా రెవెన్యూ అధికారులు వాటిని జప్తు చేసుకొన్నారు. ఇచ్చిన పట్టాను ఎందుకు జప్తుచేశారో తెలియజేయాలని, వెంటనే విచారణచేపట్టి తమకు రావాల్సిన 8.18 ఎకరాల భూమిని ఇవ్వాలని 26 ఏండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో తాసిల్దార్ ఎస్ గీత, డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ ఆరిగె యాదగిరి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆర్డీవోకు నివేదించారు. నివేదిక పరిశీలించిన భువనగిరి ఆర్డీవో వెంకటేశ్వర్లు, 8.18 ఎకరాల భూమికి ఎన్నె రామిరెడ్డి, కృష్ణారెడ్డి, సిద్ధారెడ్డిలే హక్కుదారులని, వెంటనే వారి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు రికార్డుల్లో పేరు మార్చి, ఎన్నె రామిరెడ్డి, కృష్ణారెడ్డి, సిద్ధారెడ్డికి పాస్‌పుస్తకాలు ఇస్తామని తాసిల్దార్ గీతా చెప్పారు. ఈ సందర్భంగా బాధిత రైతులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.




ఆర్డీవో నుంచి రైతుకు అందిన ఉత్తర్వులు



సూర్యాపేట జిల్లా మఠంపల్లి తాసిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

## పట్టాల కోసం తాసిల్ ఎదుట రైతుల ధర్నా

- మఠంపల్లి తాసిల్దార్ హామీతో శాంతించిన గిరిజనులు

**మఠంపల్లి:** ఏండ్లనుంచి సాగుచేసుకొంటున్నా తమ భూములకు పట్టాలుచేయడం లేదని సూర్యాపేట జిల్లా మఠంపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల రైతులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీనాయక్ మాట్లాడుతూ.. మండలంలోని గుర్రంబోడుతండా, మీగడంపహాడ్‌తండా, రామచంద్రాపురం తండా, మంచ్యాతండాకు చెందిన గిరిజనులకు పెదవీడు పునరావాసం కింద ప్రభుత్వం భూములు కేటాయించగా, సుమారు 50 ఏండ్లనుంచి సాగుచేసుకొంటున్నారన్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో దరఖాస్తు చేసుకొన్నా కొందరికి పట్టాలుచేసి మరికొందరికి చేయలేదని, దీంతో రైతులు రైతుబంధు సాయం కోల్పోతున్నారని తెలిపారు. తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టాలుచేయడం లేదని, పేద గిరిజనులకు అన్యాయంచేసి, దొంగ పట్టాలు సృష్టించి బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నారని, గిరిజనులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన పట్టాలివ్వాలని కోరారు. ధర్నాలో రైతులు రాముడు, భీము, యంగర, నాగేశ్వరరావు, చిన్న, శంకర్, భూక్య నాగులు, ఏసు, కోటేశ్, మారుతి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై స్పందించిన తాసిల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వారంరోజుల్లో సర్వేచేసి రైతులకు న్యాయంచేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# పొలం ఉన్నా లేనట్టే..

రెవెన్యూ అధికారులు సర్వేచేయరు.. హద్దులు చూపరు

ఎన్ని అర్జీలు పెట్టుకొన్నా పట్టించుకోరు • నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ రైతు ఆబ్దిన్ ఆవేదన

**వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు చెందిన ఎండీ ఆబ్దిన్ పేరిట, ఆయన అన్న పేరిట గ్రామ శివారులోని సర్వే నంబర్లు 144, 145లలో 2.10 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలు వారి వద్ద ఉన్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం భూమి జాడ తెలియడంలేదు. తన భూమి హద్దులు తెలియకపోవడంతో ఆబ్దిన్ రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకొన్నారు. సర్వేచేసి తన భూమి హద్దులు చూపించాలని వేడుకొన్నారు. సర్వే కోసం అర్జీ పెట్టుకొన్నారు. ఏండ్లు గడుస్తున్నాయి. సర్వేయర్లు మారిపోయారు. వీఆర్వోలు, తాసిల్దార్లు సైతం మారిపోయారు. అయినా ఆబ్దిన్‌కు అధికారులు భూమిని చూపించలేదు. భూమి హద్దులు తేలకపోవడంతో.. ఆయనకు తెలిసిన వ్యవసాయం చేయడానికి భూమి లేక.. తెలియని పనులు చేయలేక పొట్టకూటి కోసం కనాకష్టం పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ముప్పై ఏండ్ల కింద తాత మొహినుద్దీన్, పెద్దమ్మ మాదర్‌బీ పేరిట ఉన్న పొలం.. వారి తదనంతరం ఆబ్దిన్, జాఫర్ సోదరులకు విరాసత్ అయింది. విరాసత్ అయినప్పుడు వీళ్లు మోఖాపై లేరు. తర్వాత కొన్నేండ్లకు వీరు పొలం మీదకు వెళ్తే ఆ భూమిని వేరేవాళ్లు దున్నుకొంటున్నారు. ఏం చేయాలో అర్థంకాక పట్టాదారులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. సర్వే చేసి భూమికి హద్దులు చూపించాలని చాలాసార్లు దరఖాస్తు చేసుకొన్నారు. కానీ ఏ సర్వేయర్ కూడా స్పందించలేదు. తాజాగా ప్రస్తుత సర్వేయర్ నీలిమ దృష్టికి సమస్యను తీసుకెళ్తే టిప్పన్ కోసం చలాన్ కట్టాలని సూచించడంతో 2018 ఆగస్టులో చలాన్ కట్టారు. సర్వేయర్ తూతూ మంత్రంగా సర్వేచేసి.. ఇప్పటి వరకు రిపోర్టు ఇవ్వలేదని ఆబ్దిన్ ఆవేదన వ్యక్తంచేశారు.

### ఇబ్బందులు పెడుతున్నారు

భూమికి హద్దులు చూపించడానికి అధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఏండ్ల తరబడి కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. సర్వేయర్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకొన్నా ఫలితంలేదు. సర్వేయర్లు మారిపోతున్నారు తప్ప నా తలరాత మారడంలేదు.. ఉన్నతాధికారులు పట్టించుకొని నా సమస్యను పరిష్కరించాలి.

- ఎండీ ఆబ్దిన్, బాధితుడు



### సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం

ఈ భూసమస్య ఇంతవరకు నా దృష్టికి రాలేదు. టిప్పన్ లేకపోవడంతో ప్రస్తుత మండల సర్వేయర్ కొలతలు చేయలేకపోయారు. డివిజన్ ల్యాండ్స్ అండ్ రికార్డ్సు సర్వే ఇన్‌స్పెక్టర్‌తో వెంటనే భూమి కొలతలు చేయించి హద్దులు చూపిస్తాం. అందుకు సంబంధించి చలాన్ కట్టుకోవాలని రైతులకు చెప్తాం. సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

- వెంకట్‌రమణ, వెల్దండ డిప్యూటీ తాసిల్దార్

## వీఆర్వో, వీఆర్‌ఏ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీచేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్
- బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో సర్కారు భూమి 3.6 ఎకరాలకు ఎసరు
- బంధువుల పేర పట్టాకు యత్నం



వీఆర్వో రాజేశ్వర్‌రావు, వీఆర్‌ఏ శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** భూరికార్డుల ప్రక్షాళనలో నిర్లక్ష్యం వహించడంతోపాటు సర్కారు భూమికే ఎసరు పెట్టడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల వీఆర్వో సీహెచ్ రాజేశ్వర్‌రావు, బోయినపల్లి మండలం స్తంభంపల్లి వీఆర్‌ఏ అమ్ముల శ్రీనివాస్‌ను సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ కృష్ణకుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. నాటి స్తంభంపల్లి వీఆర్వో సీహెచ్ రాజేశ్వర్‌రావు (ప్రస్థుతం కోనరావుపేట మండలం సుద్దాలలో పనిచేస్తున్నారు.), వీఆర్‌ఏ అమ్ముల శ్రీనివాస్‌తో కలిసి గ్రామంలోని సర్వే నంబర్ 161లో గల 3.06 ఎకరాల భూమిని బంధువులైన ఆరుగురి పేరిట పహాణీల్లోకి ఎక్కించారు. పట్టాచేసేందుకు ప్రయత్నించడం, అది కలెక్టర్ దృష్టికి రావడంతో విచారణకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆరుగురి పేర్లను పహాణీల్లో ఎక్కించినట్టు బోయినపల్లి తాసిల్దార్ ప్రసాద్ విచారణలో తేలింది. దీంతో కలెక్టర్ వీఆర్వో రాజేశ్వర్‌రావు, వీఆర్‌ఏ అమ్ముల శ్రీనివాస్‌ను సస్పెండ్‌చేశారు. అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కలెక్టర్ కృష్ణభాస్కర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. భూరికార్డుల ప్రక్షాళన, పహాణీలో పేర్లు నమోదు చేయడంలో ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తే.. వారిని ఉపేక్షించేది లేదన్నారు. సమస్యలుంటే తన దృష్టికితీసుకురావాలని, రైతులను, ప్రజలు ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు.

## రికార్డుల్లో విరాసత్ భూమి మాయం

మంచిర్యాల జిల్లా నెన్నెల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం



పత్రాలు చూపుతున్న నర్సయ్య

**నెన్నెల:** రైతుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని రెవెన్యూ అధికారులు చెలగాటం ఆడుతున్నారు. ఏండ్లుగా సాగుచేసుకొంటున్న పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా దగాచేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన బాధితులను రెవెన్యూ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం ఘన్‌పూర్ శివారులోని సర్వే నంబర్ 89/18/2లో మెండె నర్సయ్య తండ్రి రామయ్యకు 1.35 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. 2015 వరకు రామయ్యపేరిట ఉన్న భూమిని అతడి కుమారుడు నర్సయ్య తన పేరిట విరాసత్ చేయించుకొన్నారు. 2016లో ఆన్‌లైన్‌లో నర్సయ్య పేరు నమోదైంది. 2017 నుంచి ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. ఆన్‌లైన్‌లో తన భూమి రావడం లేదని నర్సయ్య ఎన్నోసార్లు తాసిల్దార్ కార్యాలయంలో, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులకు రూ.లక్ష వరకు లంచం కూడా చెల్లించినట్టు బాధితుడు వాపోయారు. దీంతోపాటు తనకు చెందిన 10 ఎకరాల ఇనాం భూమిని కూడా ఇతరులు పట్టాచేసుకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

# కోర్టులో కేసు ఉన్నా.. మరొకరికి పట్టా

**ఉప్పునుంతల:** మాది నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూర్ గ్రామం. మా తండ్రి పసుల జగ్గారెడ్డి గ్రామశివారులోని సర్వే నంబర్ 356లో ఉన్న ఏడెకరాల భూమిని.. మా సోదరి పసుల పద్మమ్మకు పసుపుకుంకుమ కింద 1980లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆమెకు సంతానం లేకపోగా, కొన్ని కారణాలతో చనిపోయారు. దీంతో ఆ భూమిని ఆమె భర్త ముస్కల లక్ష్మారెడ్డి తన పేరిట విరాసత్ చేసుకొన్నారు. ఆ భూమిని మేం ముగ్గురు అన్నదమ్ములం కలిసి సాగుచేసుకొంటున్నాం. మా బావ ముస్కల లక్ష్మారెడ్డి ఈ భూమిపైకి వచ్చారు. దానిని మేము తిరస్కరించడంతో ఆయన 2014లో మా ముగ్గురిపై నాగర్‌కర్నూల్ కోర్టులో కేసుపెట్టారు. మేము కూడా కౌంటర్‌ఫైల్ దాఖలు చేశాం. భూరికార్డుల ప్రక్షాళనలో ఈ భూమిని తాసిల్దార్ క్యాటగిరి బీలో చేర్చారు. ఓ వైపు కోర్టులో కేసు నడుస్తుండగానే.. బీ క్యాటగిరిలో ఉన్న ఈ భూమిని లక్ష్మారెడ్డితో కుమ్మక్కైన తాసిల్దార్, వీఆర్వో.. రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్ 4888/2017 ద్వారా కాశిరెడ్డి కళావతమ్మ భర్త జంగారెడ్డి పేరిట పట్టాచేసి.. పాస్‌బుక్ జారీచేశారు. ఈ నేపథ్యంలో కాశిరెడ్డి కళావతమ్మను కూడా కౌంటర్‌ఫైల్‌లో ఇంప్లిమెంట్‌చేసి.. నోటీసులు పంపించాం. కళావతమ్మ పేరిట ఇచ్చిన పట్టాను రద్దుచేసి మాకు నాయ్యంచేయాలని కోరుతున్నాం.

- పసుల సురేందర్‌రెడ్డి, వెల్టూరు గ్రామం



### చట్ట ప్రకారమే పట్టా

లక్ష్మారెడ్డి పేరిట ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నది. ఆ భూమిని లక్ష్మారెడ్డి ఇతరులకు విక్రయించుకోవడానికి హక్కు కలిగి ఉన్నందున కళావతమ్మ పేరిట చట్ట ప్రకారం పట్టాచేశాం.

- శ్రీనివాస్‌కుమార్, తాసిల్దార్

## పాస్‌బుక్‌లో ఎక్కించండి సారూ..

- వారసత్వ భూమిపై హక్కు కల్పించండి
- నాగర్‌కర్నూల్ జిల్లా బొమ్మరాజుపల్లి రైతు వేడుకోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు శ్రీశైలం. మాది నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామం. మా తండ్రి వెంకటయ్య నుంచి నాకు వారసత్వంగా 16 ఎకరాల భూమి సంక్రమించింది. ఈ భూమిని పట్టాదారు పాస్‌పుస్తకంలో నమోదు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్వే నంబర్లు 73, 74లలో ఉన్న రెండున్నర ఎకరాలు మాత్రమే పాస్‌పుస్తకంలో చేర్చారు. సర్వే నంబర్లు 75లో ఉన్న 8.14 ఎకరాలు, 76లో ఉన్న 4.03 ఎకరాలు, 77లో ఉన్న 1.10 ఎకరాలు.. మొత్తం 13.27 ఎకరాలు నమోదు చేయలేదు. దీంతో నాకు రైతుబంధు సాయం అందలేదు. ఉన్నతాధికారులు స్పందించి నా భూమిని పాస్‌పుస్తకంలో చేర్చాలని కోరుతున్నాను.

# అన్నదమ్ముల మధ్య రెవెన్యూ చిచ్చు

- ఇద్దరికి చెందాల్సిన వారసత్వ భూమి ఒకరికే పట్టా
- వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి అధికారుల లీల

**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ:** వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారంలో రెవెన్యూ అధికారుల పుణ్యమా అని ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాలు బద్ధ శత్రువులుగా మారాయి. మొట్టు రత్నయ్య, బుచ్చమ్మ దంపతులకు ధర్మారంలో సర్వే నంబర్లు 537ఈలో 1.25 ఎకరాలు, 536లో 26 గుంటలు, 466 ఏలో 27 గుంటలు మొత్తంగా 2.38 ఎకరాల భూమి ఉన్నది. కొంతకాలం కింద వీరు మరణించడంతో కొడుకులు మొట్టు వెంకటయ్య, మొట్టు రాజయ్య భూమిని పంచుకొని సాగుచేసుకొంటున్నారు. ఈ క్రమంలో నలుగురు ఆడపిల్లలు ఉన్న వెంకటయ్య బతుకుదెరువు కోసం కొంతకాలం కింద కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామానికి వెళ్లారు. తన వాటా భూమిని తమ్ముడైన రాజయ్యకు కౌలుకు ఇచ్చారు. కొన్నాళ్లు సక్రమంగానే కౌలు డబ్బులు ఇచ్చిన రాజయ్య.. రెవెన్యూ అధికారుల సహకారంతో మొత్తం 2.38 ఎకరాల భూమిని తన పేరిట పట్టాచేయించుకొన్నారు. విషయం తెలిసిన వెంకటయ్య సొంతూరు వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని గ్రామ పెద్దలకు చెప్పారు. గ్రామస్థులు రాజయ్యను పిలిచి తప్పనిచెప్పినా అతడు వినలేదు. దీనిపై బాధితుడు వెంకటయ్య కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదుచేశారు. అయినా, నేటికీ రెవెన్యూ అధికారులు బాధితుడి గోడును పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తన భూమి ఇప్పించాలని వెంకటయ్య దంపతులు వేడుకొంటున్నారు.



వెంకటయ్య దంపతులు

# భూపరిష్కార వేదిక విజయవంతం

- ఆరు రోజులు.. 64 గ్రామాలు.. 1,926 సమస్యలు పరిష్కారం
- కొత్త పాస్‌పుస్తకాలు, 1-బీలు అందుకున్న బాధిత రైతులు
- సదస్సుల్లో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర




భూపాలపల్లి మండలం కొంపల్లిలో రైతుకు పాస్‌బుక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రైతుల భూసమస్యల పరిష్కారం కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు చేపట్టిన 'భూపరిష్కార వేదిక-రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం మొదటి విడుత విజయవంతమైంది. పల్లెబాట పట్టిన రెవెన్యూ అధికారులు స్వయంగా రైతులను కలిసి భూసమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించారు. సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల్లో జిల్లాలో 64 గ్రామాల్లో 1,926 భూసమస్యలను పరిష్కరించి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. ఆరు రోజుల్లో పలిమెల మినహా మిగిలి పది మండలాల్లో ఆరేసి గ్రామాల్లో మొత్తం 64 ఊర్లల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఎడతెరపి లేని వర్షం వల్ల వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పలిమెల మండలంలో శుక్ర, శనివారం సదస్సులు వాయిదా పడ్డాయి. దీంతో ఈ మండలంలో నాలుగు గ్రామాల్లో మాత్రమే సదస్సులు నిర్వహించారు. ప్రతిరోజు ఆయా మండలంలోని ఒక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగేలా కలెక్టర్ షెడ్యూల్ ఖరారుచేశారు. ఆయా మండలాల తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు ఇతర సిబ్బంది సాంకేతిక పరికరాలతో ప్రతిరోజు ఉదయమే గ్రామాలకు చేరుకొని సదస్సులు ఏర్పాటుచేశారు. రైతులు పెద్ద సంఖ్యలో రెవెన్యూ సదస్సులకు హాజరై తమ భూసమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయిలో భూసమస్యలను పరిశీలించిన అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1 బీ ప్రతులను అందజేసి రికార్డు సృష్టించారు. శనివారం భూపాలపల్లి, చిట్యాల, గణపురం, కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, మల్హర్‌రావు, మొగుళ్లపల్లి, రేగొండ, టేకుమట్ల మండలాల్లోని కొంపల్లి, చిట్యాల, మైలారం, దేవరాంపల్లి, మహాదేవపూర్, రేగులగూడెం, తాడిచర్ల, ఆకినపల్లి, భాగిర్తిపేట, రాఘవరెడ్డిపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. కొంపల్లి, మైలారం, భాగిర్తిపేటల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు, 1-బీ ప్రతులను అందజేశారు. కాటారం మండలం దేవరాంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్ హాజరయ్యారు.

## చెల్లికి ఆయుష్షు పోసి..



వీపుపై క్వింటాళ్ల బరువైన శిథిలాలు ప్రాణాలను హరిస్తున్నాయి.. శరీరమంతా రక్తమోడుతున్నది. అయినా.. ఆ ఐదేండ్ల చిన్నారి బాధను పంటిబిగువున అదిమిపట్టి చెల్లిని కిందపడకుండా కాపాడింది. ఏడు నెలల వయసున్న సోదరికి తన ఆయుష్షును జతచేసి.. తుదిశ్వాస విడిచింది.

సిరియాలోని ఇడ్లిబ్ రాష్ట్రం అరిహా పట్టణంలో కనిపించిన దృశ్యమిది. జీహాదీల ఆధీనంలోని ఈ పట్టణంపై బుధవారం సిరియా ప్రభుత్వం రష్యా సహకారంతో వైమానిక దాడులు చేసింది. అనేక ఇండ్లు నేలమట్టమయ్యాయి. పక్క చిత్రంలోని ఇల్లు వాటిలో ఒకటి. అందులో నివసిస్తున్న దంపతులు, వారి ఆరుగురు పిల్లలు శిథిలాల్లో చిక్కుకున్నారు. ఐదేండ్ల చిన్నారి రిహామ్ అల్ అబ్దుల్లా తన ప్రాణాలు లెక్కచేయకుండా చెల్లెలు 'టౌకా' కింద పడిపోకుండా షర్ట్‌ను పట్టుకొని కాపాడి.. తాను ప్రాణాలు విడిచింది. ఈ హృదయవిదారక దృశ్యాన్ని బషర్ అల్ షేక్ అనే స్థానిక పత్రిక ఫొటోగ్రాఫర్ తీశారు. శనివారం జరిపిన మరో వైమానిక దాడిలో 15 మంది పౌరులు మరణించారు.

## ఉత్తరాదిన భారీ వర్షాలు

**న్యూఢిల్లీ:** ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజస్థాన్‌లో గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వానలకు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఇంటి పైకప్పు కూలి ఓ బాలిక మృతిచెందింది. జమ్ముకశ్మీర్‌లో వర్షాల కారణంగా ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. అమర్‌నాథ్ యాత్రపైనా వర్షాల ప్రభావం పడింది. శనివారం కేవలం 3,124 మంది మాత్రమే అమరనాథుడిని దర్శించుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 5.25 మి.మీ వర్షపాతం నమోదైంది. అసోంలో వరదల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య శనివారం 81కి పెరిగింది. వరదల కారణంగా బీహార్‌లో 85 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 127 మంది మృతిచెందినట్లు పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో వరుసగా మూడోరోజు కూడా కుండపోత వర్షాలు కురిశాయి. హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి.

# నడిసంద్రంలో రైలు

### థానెలో వరద నీటిలో చిక్కుకుపోయిన మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్

ఇరువైపులా ఆరు అడుగుల మేర నిలిచిన నీరు

రైలులో 1,050 మంది ప్రయాణికులు

తిండి, నీరు లేక 17 గంటలు నరకయాతన

చివరకు రక్షించిన సహాయక సిబ్బంది

మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు.. ముంబైలో 11 విమానాలు రద్దు

**చిమ్మచీకటి..** వరదలో చిక్కుకున్న రైలు.. చుట్టూ సంద్రాన్ని తలపించేలా నీరు.. బయటకు కదల్లేని దుస్థితి.. క్షణక్షణానికీ పెరుగుతున్న వరద ఉధృతి.. ఏ క్షణాన నీళ్లు బోగీలోకి వస్తాయో తెలియని పరిస్థితి.. విద్యుత్ సరఫరా లేదు.. ఆర్తనాదాలు వినేవారు లేరు.. సాయం ఎప్పుడందుతుందో తెలియదు.. తినడానికి తిండిలేదు... తాగడానికి నీరు లేదు.. శనివారం వేకువజామున థానే సమీపంలోని వాంగని వద్ద వరదనీటిలో చిక్కుకుపోయిన 'మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్'లోని 1,050 మంది ప్రయాణికులు 17 గంటల పాటు అనుభవించిన ప్రత్యక్ష నరకమిది. చిట్టచివరకి సహాయక సిబ్బంది ప్రయాణికులందరినీ రక్షించారు. మహారాష్ట్రలో కురిసిన కుంభవృష్టికి ఈ ఘటన ఒక నిదర్శనం.



థానె సమీపంలోని వాంగని వద్ద వరద నీటిలో చిక్కుకుపోయిన మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్ రైలు

**ముంబై/థానె, జూలై 27:** శుక్రవారం రాత్రి ముంబై నుంచి కొల్హాపూర్‌కు బయలుదేరిన మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్ శనివారం వేకువజామున వాంగనీకి చేరుకుంది. భారీ వర్షాలకు ఉల్హాస్ నది ఉప్పొంగి ప్రవహించడంతో పట్టాలపైకి నీరు చేరింది. దీంతో రైలు వరద నీటిలో చిక్కుకుపోయింది. ట్రాక్‌కు ఇరువైపులా ఆరడుగుల మేర నీరు నిలిచిందని, రైలు చక్రాలు సైతం నీట మునగడంతో తాము కిందకు దిగే పరిస్థితి లేకపోయిందని ప్రయాణికులు తెలిపారు. 17 గంటలుగా తమకు నీరు, ఆహారం లేదని వాపోయారు. రైలులో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, రైల్వే శాఖ నుంచి సమాచారం లేకపోవడం, మొబైల్ నెట్ వర్క్ సరిగా లేకపోవడం, మొబైళ్లలో చార్జింగ్ అయిపోవడం, వరద ఉధృతి పెరుగుతుండడంతో బిక్కుబిక్కుమంటూ గడిపినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులను రక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం రక్షణ శాఖను అభ్యర్థించింది. ఉదయం 9.30 గంటలకు తొమ్మిది పడవలతో కూడిన రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. వాయుసేనకు చెందిన రెండు ఎంఐ-17 విమానాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. మధ్యాహ్నం 3 గంటల సమయానికి ప్రయాణికులందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రయాణికుల్లో తొమ్మిది మంది గర్భిణిలు, నెల వయసున్న పసికందు కూడా ఉన్నట్లు సెంట్రల్ రైల్వే వెల్లడించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెస్క్యూ బృందాలను అభినందించారు. పరిస్థితిని కేంద్రం నిశితంగా పరిశీలిస్తున్నదని చెప్పారు. బాధిత ప్రయాణికులందరినీ ప్రత్యేక రైలు ద్వారా కల్యాణ్ నుంచి కోల్హాపూర్‌కు తరలించనున్నట్లు సెంట్రల్ రైల్వే అధికార ప్రతినిధి సీఆర్ సునీల్ ఉడాసీ తెలిపారు.

**కుండపోతతో మహానగరం విలవిల**

దేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరం మరోసారి కుండపోత వానలతో విలవిల్లాడుతున్నది. భారీ వర్షాలు ముంచెత్తడంతో నగరంలోని పలు ప్రాంతాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. రహదారులన్నీ సంద్రాన్ని తలపిస్తున్నాయి. దీంతో రోడ్డు, రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం 8 గంటల సమయానికి ముంబైలో 97.3 మి.మీ. వర్షపాతం నమోదైందని బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) వెల్లడించింది. తూర్పు సబర్బన్‌లో 163 మి.మీ, పశ్చిమ సబర్బన్‌లో 132 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసిందని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన 8 బృందాలను మోహరించినట్లు వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా కుంభవృష్టి**

రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటల సమయానికి థానెలో 160 మి.మీ వర్షపాతం నమోదైందని, ముర్బాద్‌లో 332 మి.మీ., కల్యాణ్, ఉల్హాస్ నగర్, అంబరంత్‌లలో 200 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఓ అధికారి తెలిపారు. ముంబై సబ్ అర్బన్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. ముంబై, థానే, పాల్ఘర్, రాయ్‌గఢ్‌కు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

**విమాన రాకపోకలపై ప్రభావం**


ముంబైలో భారీ వర్షాల నేపథ్యంలో శనివారం 11 విమానాలను రద్దు చేసినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. మరో తొమ్మిది విమానాలను దారి మళ్లించినట్లు చెప్పారు. మరోవైపు రత్నగిరి జిల్లాలో జగ్బుడీ నది పోటెత్తడంతో మహారాష్ట్రలోని ముంబై- గోవా జాతీయ రహదారిలో శనివారం ఉదయం నుంచి వాహన రాకపోకలను నిలిపివేశారు.



పడవల ద్వారా ప్రయాణికుల్ని రక్షిస్తున్న సహాయక సిబ్బంది

### 120 మందిని రక్షించిన సిబ్బంది..

ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో థానె జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 120 మందికి పైగా వరద నీటిలో చిక్కుకుపోగా, వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా వారిని రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. బద్లాపూర్‌లో 70 మందిని, అలాగే షాహద్‌లోని ఓ ప్రైవేట్ రిసార్టులో మరో 45 మందిని, కల్యాణ్ పట్టణంలో ఓ భవనం నుంచి మరో 9 మందిని ఐఏఎఫ్ బృందం రక్షించినట్లు తెలిపారు.



హెలికాప్టర్ నుంచి జారవిడిచిన నిచ్చెనద్వారా పైకొస్తున్న బాధితులు



మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

# 17 గంటల ప్రత్యక్ష నరకం

మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులకు కాళరాత్రి

**ముంబై, జూలై 27:** మహాలక్ష్మి ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులు శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు 17 గంటలపాటు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించారు. రైలు నుంచి బయటపడిన తర్వాత కొందరు ప్రయాణికులు తమ భయానక అనుభవాలను పంచుకున్నారు. ఇలాంటి విపత్కర సమయంలో బీ-1 కోచ్ ప్రయాణికులు అద్భుతమైన స్ఫూర్తి కనబరిచారు. రేష్మ కంబల్ అనే నిండు చూలాలు.. వరదను చూసి బెంబేలెత్తిపోతుంటే ప్రయాణికులంతా కలిసి ధైర్యం చెప్పారు. సహాయ సిబ్బంది రాగానే ముందుగా ఆమెను బయటికి పంపారు. పోలీసులు, వైద్య బృందం ఆమెను సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్నారు.

**ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు**

'చివరికి అంతా శుభమే జరుగుతుందని ప్రతి ఒక్కరం నమ్మాం. పరిస్థితి ఎంత దిగజారుతున్నా.. మా ఆత్మస్థైర్యాన్ని, దేవుడిపై నమ్మకాన్ని కోల్పోలేదు' అని మాధవి అనే రచయిత తెలిపారు. 'ముందు చూస్తే గొయ్యి, వెనుక చూస్తే నుయ్యి.. అదో భయానక పరిస్థితి' అని విశ్వజిత్ భోస్లే అనే ప్రయాణికుడు వివరించారు. 'వీళ్లంతా (సహాయక సిబ్బంది, స్థానికులు) దేవుడు పంపిన దూతలు' అంటూ మరో ప్రయాణికుడు ఆనందబాష్పాలు కార్చాడు.

**స్పందన ఇలాగేనా?**

డయల్ 100 వంటి ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేసినా స్పందన కనిపించలేదని రైలులోని పలువురు ప్రయాణికులు ఆరోపించారు. 'నేను డయల్ 100కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించాను. ఇది రైల్వేకు సంబంధించిన విషయమంటూ పోలీసులు సమాధానం ఇచ్చారు' అని ఓ విద్యార్థి వాపోయారు. 'మా రైలు శుక్రవారం రాత్రి బద్లాపూర్ స్టేషన్‌లో కాసేపు నిలిచింది. ముందుదారిలో పట్టాలు నీటమునిగాయని రైల్వే అధికారులు అప్పుడే మాకు చెప్పి ఉంటే అప్రమత్తంగా ఉండేవాళ్లం. లేదంటే ప్రయాణం రద్దుచేసుకునేవాళ్లం. ఈ బాధ తప్పేది' అని మరో ప్రయాణికుడు వాపోయారు.



ప్రయాణికులకు ఆహారం అందిస్తున్న స్థానికులు

## వరదలకు 600 మంది బలి

2.5 కోట్ల మంది ప్రభావితమయ్యారు: ఐక్యరాజ్యసమితి వెల్లడి

భారత్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌ల్లో పరిస్థితిపై నివేదిక

వాతావరణ మార్పులవల్లే ఈ విపత్తులని వ్యాఖ్య

**ఐరాస:** భారత్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌లలో ఈ ఏడాది ఇప్పటివరకు వరదల వల్ల కనీసం 600 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి(ఐరాస) తెలిపింది. 2.5 కోట్ల మందికిపైగా ప్రభావితం అయ్యారని, కనీసం 50 లక్షల మంది నిరాశ్రయులయ్యి సురక్షిత ప్రాంతాలకు వలసలు వెళ్లారని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటొనియో గుటెరస్ అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ వెల్లడించారు. రుతుపవనాల్లో భాగంగా కుండపోత వర్షాల వల్ల జరిగిన నష్టంపై ఐరాసకు చెందిన మానవతా విభాగం అధ్యయనం చేసిందన్నారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న అసోం, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో సహాయ కార్యక్రమాలకు యూనిసెఫ్ చేయూతనందిస్తున్నదని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని చిన్నారులు జబ్బుల బారిన పడకుండా వెంటనే శుద్ధ జలం, శుభ్రమైన ఆహారం అందించాల్సి ఉన్నదని చెప్పారు.

- బంగ్లాదేశ్‌లో వరదల వల్ల 40 లక్షల మందికిపైగా ప్రభావితం అయ్యారని ఐరాస పేర్కొన్నది.
- మయన్మార్‌లో వరదల వల్ల లక్షల మంది ప్రభావితం కాగా.. 40 వేల మందికిపైగా నిరాశ్రయులు అయ్యారు.

వాతావరణ మార్పుల వల్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రుతుపవనాల ఆగమనం, విస్తరణ అస్తవ్యస్తం అవుతున్నదని యునిసెఫ్ తెలిపింది. దీంతో విపరీతమైన మార్పులు కనిపిస్తున్నాయని వెల్లడించింది. మరోవైపు భారత్, బంగ్లాదేశ్, నేపాల్‌లో భారీవర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి దాదాపు 93 మంది చిన్నారులు మృతిచెందారు. మూడుదేశాల్లో కలిపి దాదాపు 1.2 కోట్ల మంది ప్రమాదం అంచున జీవిస్తున్నారు. వీరిలో 50 లక్షల మంది పిల్లలు ఉన్నారు.

### కోటి మంది విలవిల

ఐరాస నివేదిక ప్రకారం మన దేశంలో ఈ వానాకాలంలో కోటి మందికి పైగా వరదల బారిన పడ్డారు. అసోం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు వరదలకు ప్రభావితం అయ్యాయి. దాదాపు 43 లక్షల మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే భారీ వర్షాలు కురుస్తున్నాయి. మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో వరదలు ముంచెత్తుతున్నాయి. దీంతో బాధితుల సంఖ్య మరింత పెరుగుతుందని నివేదిక పేర్కొన్నది. వరదలకు ఒక్క అసోంలోనే 2వేలకు పైగా పాఠశాలలు ధ్వంసం అయ్యాయి. మరోవైపు దేశంలోని సగం భాగం ఇప్పటికీ అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నది. ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నది.

## ఆజంఖాన్‌ను క్షమించే ప్రసక్తే లేదు

భవిష్యత్ తరాలు గుర్తుంచుకొనేలా శిక్షించాలి

డిప్యూటీ స్పీకర్ రమాదేవి ధ్వజం

**న్యూఢిల్లీ, జూలై 27:** లోక్‌సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ఎంపీ ఆజంఖాన్‌ను క్షమించే ప్రసక్తే లేదని, అలాంటి వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి తీవ్రమైన శిక్ష వేయాలని.. ఆయనకు స్పీకర్ విధించే శిక్ష, భవిష్యత్తు తరాలు కూడా గుర్తుంచుకునేలా ఉండాలని డిప్యూటీ స్పీకర్, బీజేపీ ఎంపీ రమాదేవి శనివారం పేర్కొన్నారు. ఆయన్ని లోక్‌సభ నుంచి ఐదేండ్లపాటు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 'నేను కూర్చున్న కుర్చీ నా ఒక్కదాని కోసమే కాదు, ఈ దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆయన(ఆజంఖాన్) చేసిన వ్యాఖ్యలు దేశంలోని అందరు మహిళలకు వర్తిస్తాయి. నా నియోజకవర్గంలోని ప్రజలు విశ్వాసం ఉంచి, నన్ను ఎంపిక చేసుకున్నారు. నీలాంటి(ఖాన్) వ్యక్తులను ఎదుర్కొనే శక్తి నాకున్నది' అని ఆమె అన్నారు. 'ఖాన్ చేసిన వ్యాఖ్యలకు అప్పుడే గట్టి సమాధానాన్ని ఇచ్చేదాన్ని. అయితే, నేను కూర్చున్న కుర్చీకి గౌరవాన్ని ఇస్తూ నేను ఆ పని చేయలేకపోయాను' అని ఆమె అన్నారు.

# స్పీకర్ తొలగింపు తప్పదా!

రమేశ్‌కుమార్ రాజీనామాకు యెడియూరప్ప ప్రభుత్వం ఒత్తిడి

తలొగ్గకుంటే అవిశ్వాస తీర్మానం పెట్టాలనే యోచన

ప్రభుత్వంలో చేరుదామన్న జేడీఎస్ ఎమ్మెల్యేలు.. వద్దన్న దేవెగౌడ

**బెంగళూరు, జూలై 27:** కర్ణాటకలో కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వాన్ని సులభంగా పడగొట్టి గద్దెనెక్కుదామని బీజేపీ భావించింది. కానీ.. దేశం మొత్తం ఆశ్చర్యపోయేలా కాషాయ పార్టీని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారు స్పీకర్ రమేశ్‌కుమార్. ప్రభుత్వం పడిపోకుండా నెలరోజులపాటు కాపాడారు. అంతిమంగా విశ్వాస పరీక్షలో సంకీర్ణ సర్కార్ పతనమైన సంగతి తెలిసిందే. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు యెడియూరప్ప ముఖ్యమంత్రిగా శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన దృష్టి మంత్రివర్గ కూర్పు కన్నా.. స్పీకర్ రమేశ్‌కుమార్ పైనే ఎక్కువగా ఉంది. గత అనుభవాలకు ప్రతీకారం తీర్చుకోవడంతోపాటు భవిష్యత్తులో తన ప్రభుత్వానికి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే రమేశ్‌కుమార్‌ను గద్దె దింపాల్సిందేనని సీఎం భావిస్తున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. 'మా దృష్టి మొత్తం సోమవారం జరుగనున్న బలపరీక్ష మీదే ఉన్నది. ఆలోగా స్పీకర్ స్వచ్ఛందంగా తప్పుకుంటారేమో చూద్దాం. లేకుంటే మేం బలపరీక్షలో నెగ్గిన తర్వాత.. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని భావిస్తున్నాం' అని ఓ బీజేపీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయిన 24 గంటల్లోనే స్పీకర్ ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. మిగతా అసమ్మతి ఎమ్మెల్యేల పిటిషన్లపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ చెప్పారు. దీంతో బీజేపీకి భయం పట్టుకున్నది. ఒకవేళ స్పీకర్ ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే బీజేపీ, కాంగ్రెస్-జేడీఎస్ కూటములు మ్యాజిక్ ఫిగర్‌కు ఒకటి రెండు స్థానాలు అటు ఇటుగా ఉంటాయి. ఇదే జరిగితే సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అసాధ్యమని బీజేపీకి తెలుసు. ఈ నేపథ్యంలోనే స్పీకర్‌ను మార్చాలని కనిపిస్తున్నట్టు సమాచారం.



**కుటిల రాజకీయాల విజయమిది: సిద్దరామయ్య**

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం అనేది రాజ్యాంగబద్ధంగా, నైతికంగా పొందిన విజయం కాదని.. కుటిల రాజకీయాలతో సాధించుకున్నదని మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య విమర్శించారు. బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూలదోసిందని, దానిని ప్రజావిజయంగా ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీ వెంటనే 111 మంది ఎమ్మెల్యేల జాబితా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

### 'బీజేపీకి మద్దతు ఇవ్వబోం'

బీజేపీ సర్కార్‌కు మద్దతిచ్చేది లేదని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని జేడీఎస్ అధినేత దేవెగౌడ తెలిపారు. జేడీఎస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు బీజేపీ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారన్న అంశాన్ని ఆయన ఖండించారు. మద్దతిచ్చే అంశాన్ని తొలుత జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు కుమారస్వామి నేతృత్వంలో జేడీఎస్ ఎమ్మెల్యేలు శుక్రవారం రాత్రి భేటీ అయిన సందర్భంగా కొందరు ప్రతిపాదించినట్టు ఆయన చెప్పారు. నిర్ణయాధికారాన్ని కుమారస్వామికి వదిలేశామన్నారు. యెడియూరప్ప ప్రమాణస్వీకారం చేయగానే ఆయన్ను అభినందిస్తూ జీటీ దేవెగౌడ ట్వీట్ చేశారు. అప్పటి నుంచే బీజేపీతో జేడీఎస్ చేతులు కలుపుతుందనే వాదనలు మొదలయ్యాయి.

## మూత్రశాలకు వెళ్తానని ..

ఈడీ నుంచి తప్పించుకున్న కమల్‌నాథ్ మేనల్లుడు!

**న్యూఢిల్లీ:** అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరైనట్టే హాజరై.. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు, వ్యాపారి రతుల్ పురి తమ కన్నుగప్పి కార్యాలయం నుంచి వెళ్ళిపోయినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో శుక్రవారం విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ రతుల్ పురికి ఇదివరకే సమన్లు జారీచేసింది. అయితే, విచారణకు హాజరైన రతుల్ పురి బాత్‌రూమ్‌కు వెళ్లాలంటూ కొద్దిపాటి విరామం తీసుకున్నారు. అయితే, ఆయన అక్కడి నుంచి ఎటో వెళ్లిపోయారని, మొబైల్‌ను కూడా స్విచ్ఛాఫ్ చేసి పెట్టుకున్నారని ఈడీ అధికారులు తెలిపారు. కాగా ఈ కేసులో రతుల్ పురిని సోమవారం వరకూ అరెస్టు చేయకుండా ఢిల్లీ కోర్టు మధ్యంతర రక్షణ కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఫిలిప్పీన్స్‌లో భూకంపం

ఎనిమిది మంది మృతి

**మనీలా:** ఉత్తర ఫిలిప్పీన్స్‌లో శనివారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. పలుమార్లు భూమి కంపించడంతో బాటాన్స్ రాష్ట్రంలో చారిత్రక భవనాలతోపాటు పలు ఇండ్లు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకుని 8 మంది మృతి చెందగా వంద మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం తీవ్రత 5.4 – 5.9గా నమోదైంది. తెల్లవారుజామున భూకంపం సంభవించడంతో చాలా మంది నిద్రలోనే శిథిలాల కింద చిక్కుకుని మరణించారని, వీరిలో ఏడాదిలోపు వయసున్న ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు చెప్పారు.



భూకంపం ధాటికి ధ్వంసమైన చర్చి

## జైషే టాప్ కమాండర్ హతం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతున్నది. షోపియాన్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్‌కు చెందిన జైష్ మహమ్మద్ టాప్ కమాండర్ మున్నా లాహోరి హతమయ్యాడు. అతడితోపాటు హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన మరో ఉగ్రవాది మిర్ జీనత్ ఉల్ ఇస్లామ్‌నూ భద్రతా బలగాలు మట్టుబెట్టినట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలైన ఐఈడీల తయారీలో నైపుణ్యమున్న లాహోరి.. కశ్మీర్ లోయలో స్థానికులను జైషే సంస్థలో చేర్పిస్తుంటాడని చెప్పారు. జూన్ 17న పుల్వామాలో ఇద్దరు జవాన్ల మరణానికి కారణమైన కారు బాంబు పేలుడుకు మున్నానే కారణమని వివరించారు. మరోవైపు జీనత్-ఉల్-ఇస్లామ్‌కు పలు ఉగ్ర నేరాల్లో ప్రమేయముందని, అతడిపై పలు కేసులున్నాయని తెలిపారు. షోపియాన్‌లో ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందడంతో భద్రతా బలగాలు తనిఖీలు నిర్వహించగా ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.



మున్నా లాహోరి (ఫైల్)

### కశ్మీర్‌కు 10 వేల కేంద్ర బలగాలు..

ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లు, శాంతి భద్రతల నిర్వహణ కోసం కశ్మీర్ లోయకు అదనంగా 10 వేల కేంద్ర బలగాలను తరలించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌కు చెందిన 100 కంపెనీలను 'తక్షణమే' తరలించాలని ఈ నెల 25న కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందులో సీఆర్పీఎఫ్ నుంచి 50, ఎస్ఎస్‌బీ 30, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ నుంచి 10 కంపెనీల చొప్పున తరలించనున్నట్లు చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి

మృతుల్లో ముగ్గురు మహిళలు

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్‌లో శనివారం సాయంత్రం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో ముగ్గురు మహిళలు. బస్తర్ జిల్లా నగర్‌నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరియా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) భద్రతా బలగాలు శనివారం యాంటీ నక్సల్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు ఎదురుపడ్డ మావోయిస్టులు కాల్పులకు దిగారు. దీంతో జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రాజ్ తెలిపారు. ఒక ఇన్‌సాస్ రైఫిల్, నాలుగు 303 రైఫిల్స్, మరికొన్ని తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

## కార్గిల్ విజయం.. భారత శక్తికి నిదర్శనం

దేశ రక్షణలో ఆర్మీ అంకితభావం అజేయం

సైనిక దళాల్ని కొనియాడిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జూలై 27:** కార్గిల్ విజయం భారత శక్తికి నిదర్శనమని, దేశ రక్షణలో ఆర్మీ అంకితభావం అజేయమని ప్రధాని మోదీ అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి రెండు దశాబ్దాలైన సందర్భంగా శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మిలిటరీ అధికారులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'కొన్ని దేశాలు ఉగ్రవాద వ్యాప్తి కోసం పరోక్ష యుద్ధానికి పాల్పడుతున్నాయి. ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా దీనిపై పోరాడాలి. ఆ సమయం ఆసన్నమైంది' అని పరోక్షంగా పాక్‌ను మోదీ హెచ్చరించారు. 1999లో దేశ సరిహద్దులను తిరగరాసేందుకు కార్గిల్‌లో పాక్ దుస్సాహసానికి పాల్పడిందని, భారత బలగాలు ఆ కుట్రను తిప్పికొట్టాయని ఆయన అన్నారు. 'యుద్ధం తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు కార్గిల్‌ను నేను సందర్శించాను. అది నాకు తీర్థయాత్రలాగా అనిపించింది' అని మోదీ అభివర్ణించారు. కార్గిల్ విజయం.. దేశ ప్రజల విజయమని, ఇప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తున్నదని అన్నారు. దేశ రక్షణ విషయంలో ఎవరి ఒత్తిడికి తలొగ్గబోమన్న మోదీ, రక్షణ బలగాల ఆధునీకరణ తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.



## వాయుసేనకు అపాచీ హెలికాప్టర్లు

- తొలి బ్యాచ్ కింద నాలుగు అప్పగించిన బోయింగ్ సంస్థ

**న్యూఢిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) అమ్ములపొదిలోకి అత్యాధునిక అపాచీ హెలికాప్టర్లు చేరాయి. తొలి బ్యాచ్ కింద నాలుగు ఏహెచ్-64ఈ హెలికాప్టర్లను అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ శనివారం ఐఏఎఫ్‌కు అప్పగించింది. ఉత్తర్‌ప్రదేశ్ ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌కు ఇవి చేరాయి. మొత్తం 22 అపాచీ హెలీకాప్టర్లలో మరో నాలుగు హెలికాప్టర్లను వారం రోజుల్లో అందించనున్నట్లు బోయింగ్ తెలిపింది.అమెరికా ఆర్మీ వినియోగిస్తున్న అధునాతన మల్టీ రోల్ కంబాట్ అపాచీ హెలికాప్టర్ల కోసం భారత వాయుసేన 2015లో అమెరికాతోపాటు బోయింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు, పాకిస్థాన్‌కు 125 మిలియన్ డాలర్ల (రూ.860 కోట్ల ) మిలిటరీ అమ్మకాలకు అమెరికా ఆమోదం తెలిపింది. దీంట్లో భాగంగా పాక్‌లోని ఎఫ్ -16 సాంకేతికను అమెరికా పర్యవేక్షించనున్నది.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 28 జూలై 2019
WWW.NTNEWS.COM

# ఆరోగ్యంతో ఔషధ కంపెనీల ఆట

సామవేదం



సామ మల్లారెడ్డి

మానవవికాస క్రమాన్నంతా మనిషి జీవన ప్రమాణాలు ఉన్నతీకరించబడటం, జీవనకాలం పెరుగటం కోసం చేసిన ఆరాటపోరాటాలుగా చెప్పుకోవచ్చు. తరతరాల మానవ వికాస చరిత్రలో ప్రకృతితో వివేచనాత్మకంగా, విమర్శనాత్మకంగా మనిషి కలుగజేసుకున్న జోక్యంలోంచి ఆవిష్కరించి అభివృద్ధి చేసుకున్నదే వైద్యశాస్త్రం. పరిసరాలు, ప్రకృతిలో మనిషి మనుగడకు ప్రతిబంధకంగా తయారైన స్థితిని అధిగమించటం కోసం, ఎదుర్కోవటం కోసం అవసరమైనదాన్ని సమకూర్చుకోవటంలో ఔషధం ఆవిష్కృతమైంది. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే ఆకులు, అలముల నుంచీ, మూలకాల నుంచీ తగు మోతాదులో అవసరానికి అనుగుణంగా మనిషి వినియోగించుకునే, తన శరీరంలోకి తీసుకునేదాన్నే ఔషధం (మందు) అంటున్నాం. జీవన ప్రమాణాలు అనేదాన్ని అటుంచితే, జీవనకాలం పెరుగటం కోసం మనిషి చేసే యత్నాల్లోంచి వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. శస్త్ర చికిత్సలో జరిగిన అభివృద్ధికి తోడు, శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధితో మనిషి మనుగడకు అత్యవసరమైన గుండె, ఊపిరితిత్తులు, కాలేయం మొదలు మూత్రపిండాల దాకా అతి ముఖ్యమైన అవయవాలను సైతం మార్పిడి చేసుకొని జీవితకాలాన్ని పెంచుకుంటున్నాం. అకాల మరణం నుంచి బయటపడుతున్నాం. తెగిపడిన కాళ్లు, చేతులను తిరిగి అతికించుకొని జీవన సమరంలో పరుగులు తీస్తున్నాం. కానీ అల్పమైన జలుబు, జ్వరం మొదలు సూక్ష్మక్రిముల బారిన పడినప్పుడు వాటి నిర్మూలనకు అవసరమైన ఔషధాలను సమకూర్చుకోవటం అనేది ఇవ్వాళ పెనుభారంగా మారిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మనిషి సంపాదనలో ఎక్కువ భాగం ఆరోగ్య సమస్యలకు అవసరమైన మందుల కోసం ఖర్చు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఒక రోగి చికిత్స కోసం చేసే వ్యయంలో 79 శాతం మందుల కొనుగోలు మీదనే వెచ్చించవలసి వస్తున్నదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే వైద్యుడు, వైద్య పరీక్షల కోసం వెచ్చించే దానికన్నా మందుల కోసం ఎక్కువ ఖర్చవుతున్నది.

'వ్యాధి రాకుండా నిరోధించటం ద్వారా వ్యక్తి జీవితకాలాన్ని పొడిగించటమే ఔషధ లక్ష్యం. ఎటువంటి పరిస్థితిలోనూ వైద్యుడి అవసరం లేకుండా చేయటమే దానివెనుక ఉన్న ఆదర్శం..' అని ప్రపంచ ప్రఖ్యాత వైద్యుడు విలియం జేమ్స్ మేయో అన్నారు. సరిగ్గా ఎనభై ఏండ్ల కిందట 1939 జూలై 28న మరణించిన ఆయన ఆధునిక వైద్యశాస్త్రానికి పునాదులు వేసి అనారోగ్యం, అంటురోగాలు లేని ప్రపంచాన్ని కలగన్నారు. దానికోసం జీవితాంతం తపనపడ్డారు. కానీ ఆధునిక శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధిని మానవ కళ్యాణానికి కాకుండా కాసుల కోసం కుదించిన కారణంగా ఎన్నో విపరీతాలు చోటుచేసుకుంటున్నాయి. అందులో వైద్యం, ఔషధాల ఆవిష్కరణలు, అమ్మకాలు కూడా మనుషులకు గుదిబండగా, మోయలేని భారంగా తయారయ్యాయి.

ఆధునిక సంక్షేమరాజ్యంలో ప్రజలకు ఆరోగ్యం అనేది రాజ్యాంగపరంగా సంక్రమించిన ప్రాథమిక హక్కు. కాబట్టి ప్రజలందరికీ కూడు, గుడ్డ, విద్య తర్వాత ప్రజలందరికీ ఉచిత, నాణ్యమైన వైద్యం అందించటం కూడా ప్రభుత్వాల బాధ్యత. ఈ క్రమంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఔషధాలను ఉంచటమే కాదు, ఉచితంగానూ సరఫరా చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఈ క్రమంలో దేశంలో ఔషధరంగం ఎంతో ప్రగతి సాధించింది. అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాలను సైతం తలదన్ని ముందుకుపోయింది. ప్రపంచంలో జనరిక్ మందుల ఎగుమతిలో అగ్రస్థానం మన దేశానిదే కావటం గమనార్హం. మొత్తం ఎగుమతుల్లో 20 శాతానికి పైగా భారతదేశం నుంచే ఉంటున్నాయి. భారతీయ ఫార్మా పరిశ్రమ అమెరికా, ఐరోపా, మార్కెట్లకు హృద్రోగ, రక్తపోటు మందులను, ఆఫ్రికాలోని పేదరోగులకు

> ఆధునిక జీవనంలో గ్రామం మొదలు నగరం దాకా అన్నివర్గాల ప్రజలకు పెను భారంగా మారిన వైద్య, ఔషధ భారాన్నీ తగ్గించాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఈ నేపథ్యంలో అందరికీ పెనుభారంగా మారిన ఔషధాల విషయంలో జనరిక్ మందులను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించినా ఆశించినవిధంగా దేశవ్యాప్తంగా జనరిక్ మందులను అందుబాటులోకి తేవటంలో జాప్యం జరుగుతున్నది. ఈ విషయంలో రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. రాజస్థాన్‌లో ప్రభుత్వమే జనరిక్ మందుల షాపులను నిర్వహిస్తున్నది.

ఎయిడ్స్, క్షయ రోగ మందులను జనరిక్ రూపంలో చౌకగా సరఫరా చేస్తున్నది. మరో మాటలో చెప్పాలంటే.. ప్రజారోగ్యంపై ఖర్చులు తగ్గించుకోవటానికి ఆధునిక సంపన్న దేశాలు భారతీయ జనరిక్ మందులపైనే ఆధారపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అమెరికా మొదలు చైనా దాకా అభివృద్ధి చెందిన దేశాలన్నింటికీ చౌక ధరలకు జనరిక్ మందులను ఎగుమతి చేస్తున్న మనం, మన దేశ ప్రజలకు అందుబాటులోకి తేవటానికి ఏమి అడ్డువస్తున్నదో ఆలోచించాలె.

మనిషి ఏం చేసినా, ఏం సాధించినా ఆరోగ్యం అనేది మనిషి మనుగడకు అత్యవసరమైనది కాబట్టి ఆరోగ్యం, ఔషధం చుట్టూ అనేక రాబందులు చేరాయి. ప్రకృతిలో సహజంగా లభించే ఆకులు, అలములు, మూలకాలను ఏయే రోగాలకు వినియోగించాలనే దాన్ని గోప్యం చేసి సామాజిక ఆధిపత్యాన్ని నిలుపుకోవటం జాడ్యం ఒకటైతే, ఆధునికకాలంలో ఔషధం చుట్టూ లాభాపేక్ష తప్ప సామాజిక బాధ్యత ఎరుగని బడా కంపెనీల దోపిడీనీతి అతి ప్రమాదకరమైనదిగా ఉన్నది. ఒక ఔషధాన్ని కనుగొన్న కంపెనీ లేదా వ్యక్తి దానిపై పేటెంట్ హక్కును పొంది దాని తయారీపై ఇరువై ఏండ్లు ఉత్పత్తిని, అమ్మకాలను సొంతం చేసుకుంటారు. ఆ ఇరువై ఏండ్ల గడువు ముగిసిన తర్వాత ఆ మందును ఎవరైనా ఏ పేరుతోనైనా ఆ తయారుచేసి మార్కెట్లోకి విడుదల చేయవచ్చు. అలాగే.. ఒక మందును తయారుచేయటానికి అయ్యే వాస్తవ వ్యయానికి కొద్దిపాటి నిర్వహణ ఖర్చును కలిపితే జనరిక్ మందుకు ఎంఆర్‌పీ వెల నిర్ణయమవుతుంది. ఈ విధంగా మార్కెట్లోకి చౌక ధరలకు లభ్యమయ్యే జనరిక్ మందులు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ లాభాలు తప్ప సామాజిక బాధ్యత లేని కార్పొరేట్ బహుళజాతి కంపెనీలు తయారైన మందులకు తమ ఇష్టారీతిని ధరలు నిర్ణయించి రోగుల నిస్సహాయ స్థితిని ఆసారా చేసుకొని దోపిడీ చేస్తున్నాయి. బ్రాండింగ్, ప్రచార ఆర్భాటాలు, డాక్టర్లకు ఆఫర్లు, డిస్కౌంట్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ల వేతనాలు, లాభం అన్నీ కలిపి బ్రాండెడ్ కంపెనీలు మందుల ధరలను చుక్కల్లో కూచోబెడుతున్నాయి. ఉదాహరణకు యాంటీ బయాటిక్ ఔషధం తయారీకి గరిష్ఠంగా 90 రూపాయలు ఖర్చు అయితే.., బ్రాండెడ్ కంపెనీ 360 రూపాయలకు అమ్ముతున్నది. అలాగే.. బీపీకి వెసుకునే అంలోడిఫిన్ 14 మాత్రలకు రూ.67 అయితే, జనరిక్ మందు 11 రూపాలకే దొరుకుతుంది. గుండెజబ్బుకు వాడే అటోర్వస్టాటిన్ 10 మాత్రలకు 135 రూపాయలైతే, అవికూడా 11 రూపాయలకే అందుబాటులో ఉంటాయి. నొప్పి నివారణకు వాడే పది మాత్రలకు బ్రాండెడ్ కంపెనీ 55 రూపాయల వెల నిర్ణయించింది. కానీ అది జనరిక్ స్టోర్‌లో 5 రూపాయలకే లభ్యమవుతుంది. 100 మిల్లీ లీటర్ల దగ్గు సిరప్ బ్రాండెడ్‌ది 40 రూపాయలైతే, జెనరిక్‌లో 15 రూపాయలే. ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు.

మందుల కంపెనీల దుర్మార్గం ఇలా ఉంటే.. మరోవైపు జనరిక్ మందులకు అసలు ప్రామాణికతే లేదని, వాటితో జబ్బులు నయం అవటం అటుంచి లేని రోగాలు వస్తున్నాయని చెబుతూ కార్పొరేట్ ఔషధ కంపెనీలు పెద్ద కుట్రపూరిత ప్రచారానికి తెరతీశాయి. 'బాటిల్ ఆఫ్ లైస్' ( రాన్‌బాక్సీ అండ్ ది డార్క్ సైడ్ ఆఫ్ ఇండియన్ ఫార్మా) పేరుతో కేథరిన్ ఎబాన్ అనే వ్యక్తి జెనరిక్ మందులకు వ్యతిరేకంగా ఓ పుస్తకాన్నే రాసి ప్రపంచవ్యాప్తంగా దుష్ప్రచారానికి దిగాడు. ఔషధాల అమ్మకాల్లో లాభాలు తగ్గిపోతాయన్న భయంతో జనరిక్ మందుల పైనే అబద్ధపు ప్రచారానికి దిగటం ఔషధ కంపెనీల అమానవీయతకు, దుర్మార్గానికి పరాకాష్ఠ.

జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా ఆధునిక ప్రపంచంలో మనిషి రోగాల పుట్టగా మారిపోతున్నాడు. క్యాన్సర్, గుండెజబ్బు, రక్తపోటు, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, పక్షవాతం, మధుమేహం, సోరియాసిస్ ఎలర్జీ లాంటి చర్మవ్యాధులు, మతిమరుపు, మానసిక వైకల్యాల లాంటివి సర్వసాధారణమైపోయాయి. సాంక్రామికేతర వ్యాధుల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో దేశంలో రోజుకు 200 మందికి పైగా మహిళలు చనిపోతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇప్పటికే 40 కోట్లకు చేరుకున్నారు. 2035 నాటికి అది 60 కోట్లకు చేరుతుందని అంచనా. అంటే జనాభాలో అత్యధిక శాతం మంది మందుబిళ్లలు మింగక తప్పని దుస్థితి ఉండబోతున్నది. కాబట్టి అందరికీ అత్యవసరమైన ఔషధాలను వీలైనంత చౌకగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది.

ఆధునిక జీవనంలో గ్రామం మొదలు నగరం దాకా అన్నివర్గాల ప్రజలకు పెను భారంగా మారిన వైద్య, ఔషధ భారాన్నీ తగ్గించాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఈ నేపథ్యంలో అందరికీ పెనుభారంగా మారిన ఔషధాల విషయంలో జనరిక్ మందులను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించినా ఆశించినవిధంగా దేశవ్యాప్తంగా జనరిక్ మందులను అందుబాటులోకి తేవటంలో జాప్యం జరుగుతున్నది. ఈ విషయంలో రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. రాజస్థాన్‌లో ప్రభుత్వమే జనరిక్ మందుల షాపులను నిర్వహిస్తున్నది. ప్రతి 200 మంది పేషంట్లకు ఒక మెడికల్ స్టోర్ ఏర్పాటుచేసి 191 రకాల అత్యవసర మందులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తూ ప్రజలకు ఔషధ భారాన్ని తగ్గిస్తున్నది.

ఇప్పుడున్న అనేక అనారోగ్య సమస్యలకు కారణం మన జీవనవిధానంలో ఉన్న లోపాలు. మన జీవన జీవనసరళిని చక్కదిద్దుకుంటే ఇంతగా మందుల బారిన పడటం ఉండదు. అనారోగ్యం కలిగినా అన్ని వ్యాధులకు ఇంతగా మందుల అవసరం ఉండదు. ఉత్తమమైన వైద్యులు ఈ విషయంలో రోగులకు తగు సూచనలు ఇవ్వాలె. ఇక మందులు తప్పనిసరి అవసరమైనప్పుడు చౌకగా లభించే జనరిక్ మందులు సూచించాలె. ఈ విషయంలో ప్రజలు కూడా తమ అవగాహనను పెంచుకోవాలె. ఎక్కువ ధర ఉన్న, పెద్ద కంపెనీ మందుల మాదిరిగానే జనరిక్ మందులు కూడా పనిచేస్తాయని గ్రహించాలె.

# బడుగు జీవితాల్లో వెలుగు

సంక్షేమం



డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలకు అనుగుణంగా ఈ వర్గాల జీవితాల్లో వెలుగులను నింపుతూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నది. ఈ నేపథ్యంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ హోదాలో నేను కొద్దికాలం కిందట జనగాం డీవీఎంసీ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం అనంతరం జరిగిన ఆత్మీయ అభినందన సభలో పెద్దఎత్తున నక్కల జన జాతి సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలపై, తమ జీవన విధానాలపై మాకొక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వినతిపత్రాన్ని అందుకున్న నేను ఎందుకో వారి సమస్యలను దగ్గరుండి చూడాలనిపించింది.

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ హోదాలో నేను, కమిషన్ సభ్యులు రంబాల్ నాయక్‌తో కలిసి లింగాల ఘనపూర్ మండలం ఎనబావి గ్రామపంచాయతీ శివారులో గల పిట్టలోని గూడెం చేరుకున్నాం. స్థానిక శాసనసభ్యులు, నాయకులు, స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రామ సభలో పాల్గొన్నాం. సభకు అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గూడెం వాసులను తమ సమస్యలు కమిషన్ ముందు ఉంచవలసిందిగా కోరారు. గూడెం వాసులు ఒక్కొక్కరుగా తమ సమస్యలను కమిషన్‌కు వివరించారు.

సమావేశ అనంతరం ఆ రోజు అక్కడే బస చేయాలని నిర్ణయించుకున్నాం. దాదాపు ఇరువై కుటుంబాలున్న ఆ గ్రామంలో తాటాకులతో వేసుకున్న వారి గుడిసెలు చాలా ఇరుకుగా ఉన్నాయి. అందులో కనీసం నిలబడలేం. ఆ గుడిసెలల్లోనే భోజనం చేయడం జరిగింది. ఈ సమయంలోనే జోరుగా వర్షం కురిసింది. నీళ్లు గుడారాల్లోకి వచ్చాయి. దగ్గరలోనే ఉన్న పాఠశాలకు మకాం మార్చించారు. పాఠశాలలో కూడా సరైన మౌలిక వసతులు లేవు. వర్షం రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత డీఈతో మాట్లాడి కరెంటు సరఫరాను పునరుద్ధరించేలా చేయడం జరిగింది. పాఠశాల మొత్తంలో ఉన్న ఒక్క లైట్‌తో ఆ రాత్రి అలా గడిచిపోయింది.

ఆ తర్వాత రోజు ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో గ్రామస్తులు వరసగా తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఇండ్ల నిర్మాణం, తాగునీరు, పారిశుద్ధ్యం, కరెంటు, రోడ్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, ఓటర్ గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డులు, తదితరమైనవి ప్రస్తావించారు. సత్వరమే సమస్యలన్నిటినీ పరిష్కరించడం కోసం సంబంధిత అధికారులకు వారిముందే ఆదేశాలను జారీ చేశాం. అంతేకాకుండా నక్కలజాతి ప్రజల వాస్తవిక పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నాను.

ఉపాధిహామీ పథకం కింద గూడెం వాసులకు ఉపాధి ఇప్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు, ముఖ్యంగా కల్యాణ లక్ష్మీ లాంటి పథకాల ఫలాలు అందాలంటే, తప్పనిసరిగా స్త్రీలకు 18 ఏండ్లు, పురుషులకు 21 ఏండ్లు నిండిన తర్వాతే వివాహం జరిపించాలి. బాల్య వివాహాల నివారణకు సహకరించాలి. బాలబాలికలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని వారికి తెలియజేసి ఒక ఆలోచనాత్మక సందేశం అందించగలిగాను. తదనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా యంత్రాంగమంతా పాల్గొన్నారు. వారి జీవన ప్రమాణాలు మారాలంటే ఏం చేయాలి, పేరుకుపోయిన సమస్యలను ఎలా తీర్చగలం అనేదానిపై సుదీర్ఘ చర్చ నిర్వహించాం. గూడెం వాసులకు నా తరపున సందేశం అందించా. మూఢనమ్మకాలను వీడాలి. జంతుబలులు, బహు వివాహ సంస్కృతిని వీడి బాలబాలికలను పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని, పెద్దలు సైతం రాత్రి బడిలో చేరి విద్యనభ్యసించాలని, కుటుంబ నియంత్రణ పాటించాలని వారికి సూచించాం.

గూడెంలో నివసిస్తున్న దాదాపు 78 కుటుంబాలకు కావాల్సిన కనీస మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నది. పాడి గేదెలను అర్హులకు అందజేసి ఆర్థికంగా అండగా ఉండాలి. ఆధార్, రేషన్‌కార్డులు, పద్దెనిమిదేండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటర్లు గుర్తింపు కార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం తదితర సంక్షేమ పథకాలను అందజేయాలని కలెక్టర్‌కు సూచించాం.

నక్కలజాతి ప్రజలను దగ్గరనుంచి చూశాను. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో వారి బతుకుల్లో మార్పు తీసుకురావాలని భావించాం. వారికి కనీస అవసరాల కోసం గడపగడపకు తిరిగి 76 కుటుంబాలకు రేషన్‌కార్డులు, అలాగే 21 మందికి దగ్గరుండి ఓటరు కార్డు అప్లయి చేయించాం. వారు ఆత్మగౌరవంతో బతుకాలనే సంకల్పంతో గూడెంలో ప్రభుత్వానికి చెందిన ఆరెకరాల భూమిని గుర్తించి 78 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్‌తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయించి తెలంగాణ హౌజింగ్ కోటాలో వారికి అందించాం. రఘునాథపల్లి తహసీల్దార్ నేతృత్వంలో అర్హులను గుర్తించి 15.30 ఎకరాలకు సంబంధించిన భూమిపట్టాలను అందజేయడం జరిగింది. పిల్లలకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాన్ని కేటాయించాం. సిబ్బంది అక్కడి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా నియామకం చేపట్టడం జరిగింది. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా ఏర్పాటు చేయించాం.

అర్హులై అవగాహన లేక పింఛన్ తీసుకోలేకపోతున్న కొందరికి పింఛన్, ఉపాధి హామీ కార్డులు అందించడం జరిగింది. చీకట్లలో మగ్గుతూ దుర్భరంగా బతుకెల్లదీస్తున్న వారికి వెలుగుల కోసం ఎన్‌పీడీసీఎల్‌ఎస్‌ఈ నివేదిక ఆధారంగా కొత్త విద్యుత్ స్తంభాలు, మీటర్ల వివరాలు సేకరించి అందుకు కావాల్సిన చర్యలు తీసుకున్నాం. 138 మంది నిరక్షరాస్యులకు క్యాంపు నిర్వహించి వయోజన విద్య నేర్పించడం జరిగింది. వారికోసం హెల్త్‌క్యాంపులు నిర్వహించి మెరుగైన మందులు అందించేలా కృషిచేశాం. కమిషన్ పర్యటించిన తర్వాత జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులతో నక్కలజాతి ప్రజలకు అందించాల్సిన కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపాం.

> స్వాతంత్య్రం వచ్చిన డెబ్భై ఏండ్లవుతున్నా ఇలాంటి మారుమూల గూడేలలో ఇంకా పరిస్థితి ఇంత దారుణంగా ఉండటం బాధ కలిగించింది. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో వారి సమస్యలను తీర్చగలిగామనే సంతృప్తి కలిగింది. వారి అవసరాలను తీర్చడం, కనీస వసతులు కల్పించడం కోసం నా వంతు కృషిచేయడం నిజంగా గర్వంగా ఉంది. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను.

స్వాతంత్య్రం వచ్చిన డెబ్భై ఏండ్లవుతున్నా ఇలాంటి మారుమూల గూడేలలో ఇంకా పరిస్థితి ఇంత దారుణంగా ఉండటం బాధ కలిగించింది. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో వారి సమస్యలను తీర్చగలిగామనే సంతృప్తి కలిగింది. వారి అవసరాలను తీర్చడం, కనీస వసతులు కల్పించడం కోసం నా వంతు కృషిచేయడం నిజంగా గర్వంగా ఉంది. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను.

**(వ్యాసకర్త: రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్)**



కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకున్న బీజేపీ ఇప్పుడు అదే చట్టాన్ని చూసి భయపడిపోతున్నది.

**రామచంద్రగుహ**




అబ్దుల్ కలాంతో ఉండటం అంటే ఎంతో నేర్చుకోవడం. దేశానికి ఆయన చేసిన సేవ ఇంతటితో ముగిసిపోదు. తరువాతితరం వారు ఆయన కలను ఈ కింది విధాలుగా నిజం చేస్తారు. జీవించడం, కలలు కనడం, అధ్యయనం, శ్రమించడం, ఎదుగడం..! .

**మణిశంకర్ అయ్యర్**



మిగతా అన్నిరంగాల మాదిరిగానే, రాజకీయం సినిమా పరిశ్రమను కూడా చీల్చివేసింది. వారు, మేము: మీరెవరితో ఉన్నారు? అపర్ణ, కంగనా, అనురాగ్ లేదా ప్రసూన్, తుక్డే తుక్డే లేదా భక్త్‌లు. ఇతరులను దుర్భాషలాడేబదులు, చర్చలు జరుపుకోవచ్చు. చర్చించుకోండి, మెరుగైన భారతాన్ని నిర్మించండి, విభజిత భారతం కాదు.

**రాజ్‌దీప్ సర్దేశాయి**



(ఆక్సిజన్ విడుదల చేసే జంతువు ఆవు మాత్రమే: యూపీ సీఎం)
అయితే ఊపిరి ఆగిపోయిన మనిషికి నోటి ద్వారా ఆక్సిజన్ అందించడాన్ని ఆవుకు నేర్పించాలె. అధికార పార్టీ వారు వ్యాధిగ్రస్తులైతే, వారికి ఆక్సిజన్ మాస్క్ వంతుకు ఆవులను ఉపయోగించవచ్చు.

**మహువా మొయిత్ర**

# కుటుంబ సర్వేనే కీలకం

తెలంగాణం



ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

ఉమ్మడి రాష్ట్రంలో కుటుంబ సామాజిక ఆర్థిక గణాంకాలు గోప్యంగా అస్పష్టమైనవిగా ఉండేవి. దీనివల్ల సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందజేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో పైరవీకారులు, ఉన్నతవర్గాలు, ప్రాబల్య వర్గాలు, మాట్లాడే సత్తా గల వర్గాలు తప్పుడు సమాచారంతో పేదలకు అందవలసిన నిధులను తన్నుకుపోయేవారు. అయినప్పటికీ నాటి పాలకవర్గాలు ప్రేక్షక పాత్ర వహించాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ అట్టడుగు పేద ప్రజలకు, దళితులకు, గిరిజనులకు, ఆదివాసీలకు, బడుగులకు, మైనారిటీలకు, మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, ప్రాంతాలకు లబ్ధి చేకూరాలంటే వారికి సంబంధించిన సంపూర్ణ సమాచారం ఉండాలని భావించారు. తెలంగాణ సమాజంలోని అన్ని సమూహాలకు సంబంధించిన సూక్ష్మ స్థాయి నుంచి స్థూల స్థాయి ప్రణాళికల రచనకు, అమలుకు ప్రజల భాగస్వామ్యం, సంపూర్ణ సమాచారం అవసరమని గ్రహించారు. ఈ సమాచారంతో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను రూపొందించడం సాధ్యమవుతుంది. ఏయేవర్గాల ప్రజలు అర్హులు, వారిని ఏ విధంగా ఆదుకోవాలనే విషయమై స్పష్టత ఏర్పడుతుంది. దాంతో సంక్షేమ పథకాల వనరులు దుర్వినియోగం కాకుండా నిజమైన లబ్ధిదారులకు అందే వీలు కలుగుతుంది.

అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, బంధుప్రీతికి, లంచగొండితనానికి తావులేని సమగ్ర కుటుంబ సర్వే అవసరమే కాదు అనివార్యమని దూరదృష్టి కలిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారు. 2014 ఆగస్టు 19వ తారీకు నాడు సమగ్ర సర్వేను నిర్వహించారు. రాష్ట్రమంతటా ఒకేరోజు నాలుగు లక్షల మంది ఉద్యోగులు, అధికారులు కోటి 9 లక్షల కుటుంబాల పూర్తి సమాచారాన్ని సేకరించగలిగారు. ఇందులో తొమ్మిది ప్రధాన విషయాల ఆధారంగా ప్రశ్నావళిని నిష్ణాతులతో రూపొందించి సమగ్ర సమాచార గణాంకాలను సేకరించగలిగారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు.

ఇతర రాష్ట్రాలతో పాటు అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన, గుణాత్మక సమాచారాన్ని ఒకేరోజులో సమకూర్చగలిగిందని ప్రశంసించాయి. ఈ సమగ్ర కుటుంబ సర్వే 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా నిలిచిందని భారత ఆర్థిక సర్వే రూపకర్త, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆర్థిక సర్వే నాలుగవ చాప్టర్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ఇది అనుసరణీయమని చెప్పారు. ఇలాంటి దూరదృష్టి కలిగిన రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడానికి ఉపకరిస్తాయి.

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా కొన్ని చేదు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో కనీసం సురక్షితమైన తాగునీరు లభ్యం కావడం లేదు. అనేక ప్రాంతాల్లో నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండటం మూలంగా వ్యాధులు వ్యాపిస్తున్నాయి. తక్కువ వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపించడం, గృహవసతి లేక పూరి గుడిసెల్లో ప్రజలు జీవించడం, చుట్టూ అపరిశుభ్రత వాతావరణం, మురికి కాల్వలతో అనారోగ్య పరిస్థితులు, ఒకే గదిలో లేదా పూరి గుడిసెలో జీవించడానికి వీలులేని, గోప్యతకు అవకాశం లేని సామాజిక పరిసరాలలో యవ్వనం, కౌమారదశలో ఉన్న పిల్లలు చెడు అలవాట్ల బారిన పడే అవకాశాలు మొదలైనవి ప్రభుత్వ దృష్టికివచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక సోషల్ ఇంజినీర్‌గా కేసీఆర్ దేశ చరిత్రలో తొలిసారిగా ఆరోగ్యకరమైన పరిసరాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం, ఏటూరునాగారం లాంటి మండలాల లోని ఆదివాసి గూడేలలో అనేకచోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నేడు మనకు దర్శనమిస్తాయి. రాష్ట్రంలో ఉన్న భూమి కేవలం 31 శాతం మంది ప్రజల చేతుల్లో కేంద్రీకృతమైంది. భూమి లేనివారు అత్యధికులు దళితులు. తలాపున గోదావరి ప్రవహిస్తున్న సాగునీరు లేక అతివృష్టి, అనావృష్టితో వేలాది ఎకరాల భూమి బీళ్ళు వారింది. అనేకమంది మధ్యతరగతి, సన్నకారు, చిన్నకారు రైతులు, రైతుకూలీలు, వ్యవసాయ కార్మికులు వలస పోయారు. వ్యవసాయం దండుగ అని నాటి పాలకులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో రాత్రింబవళ్ళు కరెంటు కోత, ఫ్యాక్టరీలకు పవర్ హాలిడే లాంటి సంక్లిష్టమైన పరిస్థితులుండేవి. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విద్యుత్ ఇంజినీర్‌లా పథక రచన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలు నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయగలుగుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతంగా కొనసాగించడం, మరోవైపు కాకతీయుల కాలం నాటి చెరువుల పూడిక తీయడం లాంటి కార్యక్రమాలను చేపట్టి నీటిని నిల్వచేయడం, భూగర్భ జలాలను పెంచడం జరుగుతున్నది.

మొదటి ప్రపంచ యుద్ధకాలం నాటి మానసిక, సామాజిక ఆర్థిక అసమానతలు, సమస్యలు, పరిస్థితులు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవి. ఫీల్ ఫిషర్ అభిప్రాయం ప్రకారం చెదిరిన గూడు లేదా కుటుంబం అనేది యువత ఉపాధి కోసం వలసపోగా మిగిలిన వృద్ధులతో కూడిన ఆవాసం. పిల్లల కోసం తల్లిదండ్రులు ఒంటరిగా ఎదురుచూస్తూ, వృద్ధాప్యానికి మరింత దగ్గరవుతూ, నిరాశ, నిస్పృహ, దిగులు, ఆందోళన, నిస్సహాయస్థితిలో జీవచ్ఛవాల్లా మంచం పాలు కావడం, తనువుచాలించే స్థితిలో కలిగే మానసిక ఆందోళన, ఒంటరితనం, భయం, అచేతనమైన పరిస్థితిలో ఉండేవి. ఫీల్ ఫిషర్ ఉద్దేశించినట్లు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర పాలకుల కాలంలో తెలంగాణ ప్రాంతం తీవ్ర దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించింది. ఇలాంటి సజీవ దృశ్యాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా, వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట, చేర్యాల ప్రాంతాలు నిలువెత్తు నిదర్శనం. గూడు చెదిరిన వేలాది కుటుంబాలు అస్తవ్యస్తమై వలసవెళ్ళడం చూశాం.

> బడుగు బలహీనవర్గాలకు ఉపాధి, సంక్షేమ పథకాలను అమలు జరుపడం, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, తీవ్ర వ్యాధిగ్రస్తులకు పింఛన్లను భారీగా పెంచి సకాలంలో అందజే యడం ఈ ప్రభుత్వంలో జరుగుతున్నది. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలన్నీ స్పష్టంగా లబ్ధిదారులకు చేరడానికి కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే అందించిన గణాంకాలే మూలం.

రాష్ట్రం ఏర్పడినపుడు నాటి పరిస్థితులను గ్రహించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్ని కువిమర్శలు చేసినా లెక్కచేయక ఒక స్పష్టమైన ప్రణాళికతో, వ్యూహంతో పకడ్బందీగా సర్వే నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పరిశుద్ధమైన, సురక్షితమైన మంచినీరు మారుమూల ఆదివాసి గూడేలలో సైతం మిషన్ భగీరథ ద్వారా అందజేయగలుగుతున్నారు. లోపభూయిష్టమైన భూ సమస్యను పరిష్కరించే దిశగా భూ రికార్డుల ప్రక్షాళన చేయడం కోసం ధరణి పథకానికి శ్రీకారం చుట్టారు. దళితులకు మూడెకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధమై అందుబాటులో ఉన్నంతమేరకు దళితులకు భూమి కేటాయించింది. భూమి అందుబాటులో లేనిచోట ప్రజలే భూమిని చూపిస్తే స్వయంగా ప్రభుత్వం కొనుగోలు చేసి ఇస్తుందని ప్రకటించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యంతో నీటిని అందించడం వల్ల మెట్ట ప్రాంతాలు సైతం సస్యశ్యామలం చేయడం జరుగుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లా తీవ్ర దుర్భిక్షానికి ప్రతీక. అలాంటి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా, గొలుసు చెరువుల పునరుద్ధరణతో ఒకప్పుడు బీడుపడిన భూములు నేడు పచ్చదనంతో విరాజిల్లుతున్నాయి.

బడుగు బలహీనవర్గాలకు ఉపాధి, సంక్షేమ పథకాలను అమలు జరుపడం, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, తీవ్ర వ్యాధిగ్రస్తులకు పింఛన్లను భారీగా పెంచి సకాలంలో అందజేయడం ఈ ప్రభుత్వంలో జరుగుతున్నది. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలన్నీ స్పష్టంగా లబ్ధిదారులకు చేరడానికి కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే అందించిన గణాంకాలే మూలం. ముఖ్యమంత్రి తెలంగాణ సర్వతోముఖాభివృద్ధియే పరమావధిగా అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ కృషిలో కేసీఆర్‌కు యావత్ తెలంగాణ సబ్బండ జాతులు, వర్గాలు, సముదాయాలు, సమూహాలు బాసటగా నిలిచాయి. ఇకముందు కూడా ఇదే రీతిలో నిలువాలె.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో రామప్ప కళాశాల విద్యార్థులు 83 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. - న్యూశాయంపేట (వరంగల్)

## వనపర్తిలో నేడు సినారె జయంత్యుత్సవాలు

**వనపర్తి, నమస్తే తెలంగాణ :** జ్ఞానపీఠ అవార్డుగ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారె) జయంతి వేడుకలకు వనపర్తి ముస్తాబైంది. సినారె సాహితీ వైభవం కవి సమ్మేళనం సాంస్కృతిక విభావరిని ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వర కు నిర్వహిస్తున్నట్లు సినారె జయంత్యుత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వన పర్తి శివారు నాగవరంలోని శ్రీనివాస పద్మావతి గార్డెన్‌లో పలు కార్యక్రమాలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షులు జయంతి తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, సీఎం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, సినారె కుటుంబసభ్యులు, కవులు, కళాకారులు హాజరుకానున్నారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతానికి వరదతాకిడి మొదలైంది. కుంటాల జలకళ సంతరించుకోవడంతో జలపాతం అందాలను తిలకించడానికి పర్యాటకులు తరలివస్తున్నారు. - నేరడిగొండ








కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆముదాలపల్లిలో వర్షం ధాటికి కూలిన ఇంటి పైకప్పు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం శ్రీరంగాపురం- చొప్పాల గ్రామాల మధ్య వట్టివాగుపై కొట్టుకుపోయిన రహదారి



జగిత్యాల జిల్లా నంచర్లలో గాలి బీభత్సానికి ఓ ఇంటిపై కూలిన చెట్టు

# పొంగిన వాగులు

## రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు

చెరువులు,కుంటల్లోకి చేరుతున్న నీరు

పలుచోట్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

జగిత్యాల జిల్లాలో గాలి బీభత్సం

పలు ఇండ్లు ధ్వంసం, నలుగురికి గాయాలు

వచ్చే మూడ్రోజులు వర్షాలు.. 31న మరో అల్పపీడనం

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం పడింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవగా, వరంగల్ రూరల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పలు వాగులు పొంగిపొర్లాయి. జలాశయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలోని పలు ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్లలో ఈదురుగాలి బీభత్సం సృష్టించింది. పలు చెట్లు నేలవాలగా, నాలుగు ఇండ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మట్టిపెల్లలు పడటంతో నలుగురికి గాయాలయ్యాయి. వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండటంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మరింత బలపడనున్నా యి. దీని ప్రభావంతో ఆది,సోమ, మంగళవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**ఉమ్మడి ఖమ్మంలో..**

ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో 7.38 సెం.మీ. ముదిగొండలో 6.24 సెం.మీ. వర్షం కురిసింది. వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 3.62 సెం.మీ. వర్షం పడింది. కొత్తగూడెం, పాల్వంచలోని మొర్రేడు వాగుల్లోకి వర్షపు నీరు చేరింది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు ఉండగా ఇప్పటికే 387 అడుగులకు చేరి కళకళలాడుతున్నది.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అనంతారం పెద్దవాగులోకి వచ్చిన వరద

**ఉధృతంగా ప్రవహిస్తున్న జేడివాగు**

వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాలలో 2.08 సెం.మీ., నల్లబెల్లిలో 3.46 సెం.మీ. వర్షంపడింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం-రాంనగర్ మధ్య ఉన్న జేడివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలో జాతీయ రహదారి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డైవర్షన్ రోడ్డు భారీ వరదకు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోవిందరావుపేట మండలంలో కురుస్తున్న వర్షాలకు లక్నవరం సరస్సు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 17 అడుగులకు చేరుకున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 5.77 సెం.మీ. వర్షం పడింది. మహాముత్తారం మండలం పెగడపల్లి పెద్దవాగు, సింగంపల్లి వాగు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు స్తంభించిపోయాయి. యత్నారం, సింగంపల్లి గ్రామాల మధ్య వాగు తెగిపోయింది. భూపాలపల్లి మండలం గొర్లవీడులో 12 ఇండ్లు నేలమట్టమయ్యాయి. పలిమెల మండలంలో పంకెన, సర్వాయిపేట వాగులు పొంగిపొర్లుతున్నాయి.

✦ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6.4 సెం.మీ., నిర్మల్ జిల్లాలో 4.9 సెం.మీ., నిజామాబాద్ జిల్లాలో 2.05 సెం.మీ., జనగామ జిల్లాలో 1.56 సెం.మీ., మెదక్ జిల్లాలో 7.3 మి.మీ., వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లాలో ముసురు పట్టగా, జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరిలోకి వరద ప్రవాహం పెరిగింది. పెద్దపల్లి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నల్లగొండ జిల్లాతోపాటు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, నారాయణపేట జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేటతోపాటు గజ్వేల్, వర్గల్‌లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

**31న మరో అల్పపీడనం**

వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఈ నెల 31న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలో రుతుపవనాలు మరింత బలపడుతాయని తెలిపింది. ఇప్పటికే వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమబెంగాల్ ఉత్తర ప్రాంతం.. దాని పరిసరాల్లో కొనసాగుతుండగా, ఇది శనివారం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. మూడ్రోజులు రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో నేడు, రేపు వర్షాలు..**

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఆది, సోమవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం నగరంలోని పలు చోట్ల చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లగా మారింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.4 డిగ్రీలు, గాలిలో తేమ 71 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు.

## జగిత్యాల జిల్లా నంచర్లలో గాలి బీభత్సం

- కూలిన చెట్లు, నాలుగు ఇండ్లు పూర్తిగా ధ్వంసం
- సుమారు 30 ఇండ్లకు నష్టం

**పెగడపల్లి:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గాలి బీభత్సం సృష్టించింది. రెండు నిమిషాలపాటు వీచిన తీవ్రమైన గాలులకు రేకుల షెడ్లు లేచిపోగా, చెట్లు నేల కూలాయి. నాలుగు ఇండ్లు పూర్తిగా ధ్వంసం కాగా, సుమారు 30 గృహాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో కరెంటు లేక చీకట్లో ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. క్షణాల్లోనే జరిగిన ఈ ఘటనతో పెద్ద ఎత్తున నష్టం సంభవించడంతో బాధితులు షాక్ నుంచి తేరుకోలేక పోతున్నారు. రేకుల షెడ్ల కింద నిద్రిస్తున్న దీకొండ రామయ్య, రాజవ్వ, కనుకుట్ల రాజవ్వ, సుద్దాల లచ్చవ్వపై మట్టి పెల్లలు పడటంతో గాయపడ్డారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు జగిత్యాల ఆర్డీవో ఘంటా నరేందర్ గ్రామన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఇండ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.9 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించి తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున అందజేశారు. గాయాలైన నలుగురికి రూ.4,200 చొప్పున అందజేయగా, కలెక్టర్ ఆదేశాల మేరకు బాధితులకు 20 కిలోల చొప్పున బియ్యం అందించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాధితులకు భోజన సౌకర్యం కల్పించారు.

## సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం..

వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లోని క్వారీలలో రోడ్లన్నీ బురదగా మారి, బొగ్గును వెలికితీసే యంత్రాలు నిలిచిపోయాయి. కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ -1, ఓపెన్‌కాస్ట్- 2, గౌతంఖని ఓపెన్‌కాస్ట్, మణుగూరులోని ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 4లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. కాగా మంచిర్యాల జిల్లాలో శ్రీరాంపూర్, ఆర్కేపీ, కేకే ఓపెన్ కాస్టుల్లో వర్షపు నీరు చేరి బొగ్గు ఉత్పత్తి, మట్టి తరలింపు నిలిచిపోయింది. శ్రీరాంపూర్ ఓసీలో 10వేలు టన్నులు, ఆర్కేపీలో 6వేల టన్నులు, కేకే ఓసీలో 5వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.



బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్టీ బాలికల వసతిగృహ పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

## విద్యా విధానంలో వినూత్న మార్పులు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేసేందుకు విద్యావిధానంలో వినూత్న మార్పులు తీసుకొచ్చిందని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న ఎస్టీ బాలికల వసతిగృహం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ, డిసెంబర్ మొదటివారంలోగా భవనాన్ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# గ్రామాభివృద్ధి బాధ్యత సర్పంచులదే

- విధుల్లో నిర్లక్ష్యం చేస్తే తొలగింపే..
- మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి
- సంగారెడ్డిని ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించిన మంత్రులు

**సంగారెడ్డి అర్బన్, నమస్తే తెలంగాణ:** ఉద్యమాలతో సాధించిన తెలంగాణను గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సర్పంచులకు విశేష అధికారాలు కల్పించిందనీ, అభివృద్ధి బాధ్యత సర్పంచులదేనని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లాకేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, అటవీశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా బహిరంగ మలవిసర్జన లేని జిల్లాగా సంగారెడ్డిని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ప్రభుత్వోద్యోగులతో కలిసి మంత్రులను గజమాలతో సన్మానించారు. అనంతరం కంది మండలం చిమ్నాపూర్‌లో మొక్కలు నాటారు. ఐదో విడత హరితహారంలో 3.50లక్షల మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హనుమంతరావు, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఓడీఎఫ్ జిల్లాగా జోగుళాంబ గద్వాల**

**గద్వాల, నమస్తే తెలంగాణ:** జోగుళాంబ గద్వాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత జిల్లాగా కలెక్టర్ శశాంక ప్రకటించారు. శనివారం గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని జమ్మిచేడ్‌లో జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహంలతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలో లక్షన్నర కుటుంబాల్లో 50 వేల కుటుంబాలు ప్రస్తుతం మరుగుదొడ్లు నిర్మించుకున్నాయనీ, వివిధ దశల్లో 12 వేల మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 2018లో కేవలం 14 వేల మరుగు దొడ్లు నిర్మిస్తే 2019లో ఇప్పటి వరకు 36 వేల నిర్మాణాలు పూర్తిచేసి జిల్లాను ఓడీఎఫ్‌గా ప్రకటించుకోవడం సంతోషకరంగా ఉందని కలెక్టర్ అన్నారు.




సంగారెడ్డిలో ఢంకా మోగించి ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్ తదితరులు

## అక్బరుద్దీన్ ప్రసంగంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేవు

కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి

**కరీంనగర్ క్రైం:** కరీంనగర్ సమావేశంలో అక్బరుద్దీన్ ప్రసంగంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేవని సీపీ కమలాసన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఐఎం సమావేశంలో అక్బరుద్దీన్ ఓవైసీ ఒక వర్గాన్ని అవమానించేలా విద్వేషపూరితంగా, రెచ్చగొట్టేలా ప్రసంగించారని గత మూడు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. దీనిపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ సీపీకి ఫిర్యాదు చేశారు. పోలీస్‌శాఖ ముందు జాగ్రత్తగా రికార్డు చేసిన అక్బరుద్దీన్ ప్రసంగాన్ని అనువదించి, వీడియో రికార్డింగ్, అనువాదప్రతిని న్యాయ నిపుణుల సలహా కోసం పంపించారు. అందులో ఎలాంటి విద్వేషపూరిత వాఖ్యలు లేవనీ, కేసులు నమోదు చేసే అవకాశం లేదని నిపుణులు సలహా ఇచ్చినట్టు సీపీ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.



వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని శనివారం మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పాలమూరు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్, కొడంగల్, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకటవీరయ్య, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, పురాణం సతీశ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత గట్టు రామచంద్రరావు, షాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు పరామర్శించారు. నిరంజన్‌రెడ్డి తల్లి తారకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - వనపర్తి, నమస్తే తెలంగాణ



ప్రసవం కోసం తూప్రాన్ సామాజిక దవాఖానకు వస్తున్న గర్భిణి రోడ్డు పక్కనే ప్రసవించింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లిలో నివసిస్తున్న జార్ఖండ్‌కు చెందిన మహంతిదేవీ శనివారం ఉదయం తూప్రాన్ దవాఖానకు బయలుదేరింది. దవాఖాన సమీపానికి చేరుకోగానే పురిటి నొప్పులు ఎక్కువవ్వడంతో రోడ్డు పక్కనే కూర్చుంది. వైద్యులు అక్కడికి చేరుకునే లోపే పాపకు జన్మనిచ్చింది. వెంటనే తల్లీబిడ్డలను స్ట్రెచర్‌పై దవాఖానకు తరలించి వైద్యం అందించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకోవాలని వైద్యులు సూచించగా అందుకు ఆమె నిరాకరించారు. ఇప్పటికే ఎనిమిది మందికి జన్మనివ్వగా మరో పదిమందిని కనాలని భావిస్తున్నట్టు ఆమె తెలిపింది. - తూప్రాన్, నమస్తేతెలంగాణ

# వంద కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

కామారెడ్డిలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ▪ పరిగిలో మొక్క నాటిన మంత్రి మల్లారెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగిలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి మల్లారెడ్డి



సూర్యాపేట జిల్లా అనంతగిరిలో మొక్క నాటుతున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఈ ఏడాది హరితహారంలో భాగంగా రాష్ట్రంలో వంద కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు అటవీ శాఖ మంత్రి అలోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోనిడిగ్రీ కళాశాల ప్రాంగణంలోని రాశివనంలో 2015లో సీఎం కేసీఆర్ నాటిన మొక్కను పరిశీలించారు. అనంతరం మంత్రి మొక్కలు నాటి నీరుపోశారు. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలో రూ.10కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి మంత్రి చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేసి, మొక్క నాటారు. సూర్యాపేట జిల్లా అనంతగిరిలో హరితహారంలో శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని మొక్క నాటారు. రాష్ట్రాన్ని హరితవనంగా మార్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు.

# ఆసరా సంబురం



భువనగిరిలో పింఛన్లు తీసుకునేందుకు వరుసలో నిల్చున్న లబ్ధిదారులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ :** పెరిగిన ఆసరా పింఛన్ డబ్బులను తీసుకొంటున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం వరంగల్ రూరల్ జిల్లాలో పింఛన్‌దారులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆత్మకూరు మండలం కటాక్షపూర్, దామెర మండలం దమ్మన్నపేటలో లబ్ధిదారులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అందజేశారు. భువనగిరిలో పింఛన్లు తీసుకునేందుకు బారులుదీరిన లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# వైద్యసిబ్బందిపై టిక్‌టాక్ ఎఫెక్ట్

**కరీంనగర్ హెల్త్:** టిక్‌టాక్ మాయలో పడిన వైద్య సిబ్బందిపై వేటుపడింది. పని చేస్తున్న కార్యాలయంలో టిక్‌టాక్ వీడియోలు చేయడం, సోషల్ మీడియాలో అవి వైరల్ కావడంతో ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. కరీంనగర్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లు కే సమత, టీ దివ్యవాణి, ల్యాబ్ అటెండెంట్ వై జయలక్ష్మి టిక్‌టాక్ వీడియోలు చేయగా, సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. విషయం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాంమనోహర్‌రావు దృష్టికి రావడంతో శుక్రవారం షోకాజ్ నోటీసు ఇచ్చారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామనీ, ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# ఎలుగుబంటి కలకలం

- నిజామాబాద్ జిల్లాలో నలుగురిపై దాడి
- రెస్క్యూ టీమ్‌కు చిక్కిన భల్లూకం

**ఇందల్వాయి :** నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లో శనివారం ఎలుగుబంటి కలకలంరేపింది. ఆరు నెలల క్రితం గ్రామానికి వచ్చిన ఎలుగుబంటి గురించి గతంలో గ్రామస్థులు అటవీ అధికారులకు తెలుపగా, అప్పట్లో రెస్క్యూటీమ్ పట్టుకోవడానికి శ్రమించినా చిక్కలేదు. తాజాగా శనివారం ఉదయం బర్ధిపూర్ నుంచి ధర్మారం గ్రామానికి చెందిన కోటగిరి రాజు, చాకలి నర్సింహులు, బత్తుల నరసయ్య, పెద్దపురం శివపై దాడి చేసి గాయపరిచింది. గ్రామానికి వచ్చిన అటవీశాఖ సిబ్బంది ఎలుగుబంటి పాత దేనా బ్యాంకు గల్లీలో చొరబడినట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జూపార్కు రెస్క్యూ టీమ్ మత్తు మందిచ్చి తల్లితో పాటు పిల్ల ఎలుగును పట్టుకొని జూపార్కుకు తరలించారు.

వాణిజ్య
నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
ఆదివారం 28 జూలై 2019 [ కరీంనగర్ ]



## అమెరికాలో తయారు చేస్తేనే పన్నుండదు

### యాపిల్ ఉత్పత్తులపై ట్రంప్

**వాషింగ్టన్, జూలై 27:** చైనాలో తయారయ్యే యాపిల్ ఉత్పత్తులకు సుంకాల రద్దును తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పన్నుల నుంచి తప్పించుకోవాలంటే అమెరికాలోనే తయారు చేయాలని స్పష్టం చేశారు. చైనాలో ఉత్పత్తి ఆపేయాలని తాను చెప్పబోవడం లేదన్న ట్రంప్.. అక్కడ తయారైన ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతైతే మాత్రం సుంకాలు ఖాయమని తేల్చిచెప్పారు. వైట్‌హౌజ్‌లోని తన వోవల్ ఆఫీస్‌లో విలేఖరులతో మాట్లాడిన ట్రంప్.. యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌కు తాను ఎంతో గౌరవాన్ని ఇస్తానని, అమెరికాలో ఆ సంస్థ ఉత్పత్తులు తయారైతే మరింతగా గౌరవం పెరుగుతుందని చెప్పారు. మరోవైపు ఫ్రాన్స్ డిజిటల్ ట్యాక్స్.. అమెరికా టెక్నాలజీ సంస్థలను ప్రభావితం చేస్తున్నదని, తాము కూడా ఫ్రెంచ్ వైన్‌పై పన్ను వేస్తామని ట్రంప్ హెచ్చరించారు.


సంప్రద సింగ్

## ఆల్కెమ్ లాబొరేటరీస్ వ్యవస్థాపకుడు సంప్రద సింగ్ కన్నుమూత

**న్యూఢిల్లీ, జూలై 27:** ప్రముఖ ఔషధ రంగ సంస్థ ఆల్కెమ్ లాబొరేటరీస్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎమిరేట్స్ సంప్రద సింగ్ కన్నుమూశారు. ఈ మేరకు ఆ సంస్థ శనివారం ఓ ప్రకటనలో తెలియజేసింది. శనివారం ఉదయం ఆయన ముంబైలో చనిపోయినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడించింది. దేశీయ ఔషధ పరిశ్రమలో సింగ్‌కు 43 ఏండ్లకుపైగా అనుభవం ఉన్నది. బీహార్‌లో 1925లో జన్మించిన ఆయనకు ప్రస్తుతం 94 ఏండ్లు. 2017లో ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన భారతీయ కుబేరుల జాబితాలో సింగ్ 43వ స్థానంలో నిలిచారు.

# ఈవీలకు కిక్కు

### 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గిన జీఎస్టీ

### చార్జింగ్ స్టేషన్లపైనా 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గుముఖం

### కొత్త రేట్లు వచ్చే నెల 1 నుంచి అమలు

### జీఎస్టీ మండలి నిర్ణయాన్ని స్వాగతించిన పరిశ్రమ వర్గాలు

**న్యూఢిల్లీ, జూలై 27:**

విద్యుత్ వాహనాల పరిశ్రమకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి కేంద్ర ప్రభుత్వం గొప్ప ఊరటను అందించింది. విద్యుత్ వాహనాల(ఈవీ)పై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించగా, చార్జింగ్ స్టేషన్లపైనా 18 శాతంగా ఉన్న పన్నును 5 శాతానికి తీసుకొచ్చింది. ప్రమాదకర స్థాయికి చేరిన వాతావరణ కాలుష్యం, పెట్రో ఉత్పత్తుల ధరాఘాతం నేపథ్యంలో విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని మోదీ సర్కారు ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జీఎస్టీ భారాన్ని దించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామ న్ నేతృత్వంలోని జీఎస్టీ మండలి శనివారం ఇక్కడ ప్రత్యేకంగా సమావేశమైంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ 36వ మండలి సమావేశంలో కేవలం విద్యుత్ వాహనాలపై జీఎస్టీ అంశాన్నే చర్చకు స్వీకరించారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ కూడా పాల్గొనగా, సభ్యులుగా ఉన్న రాష్ర్టాల ఆర్థిక మంత్రుల అభిప్రాయాలను సేకరించిన మండలి.. కనిష్ఠ స్థాయి జీఎస్టీని వేయాలని నిర్ణయించింది. వచ్చే నెల 1 నుంచి మార్చిన ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. జీఎస్టీ మండలి తాజా నిర్ణయం పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ ఆనందం వ్యక్తం చేశారు. దీంతో ముడి చమురు దిగుమతులు తగ్గడమేగాక, సౌర విద్యుదుత్పత్తి రంగానికి కొత్త ఊపునిచ్చినట్లైందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికిల్ ఖర్చులో దాదాపు 40 శాతం బ్యాటరీలకే పెట్టాల్సి వస్తుందన్న ఆయన ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు దేశీయ బ్యాటరీ తయారీ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. లిథియం-ఐయాన్ బ్యాటరీ ఉత్పత్తి ప్లాంట్ కోసం టాటా కెమికల్స్‌తో చర్చిస్తున్నామని చెప్పారు.


శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జీఎస్టీ మండలి 36వ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా, సహాయ మంత్రి ఠాకూర్, రెవెన్యూ కార్యదర్శి అజయ్

#### ఆటో ఇండస్ట్రీ హర్షం

జీఎస్టీ మండలి నిర్ణయాలను దేశీయ ఆటో పరిశ్రమ స్వాగతించింది. విద్యుత్ ఆధారిత వాహనాలకు, వాటి చార్జింగ్ స్టేషన్లకు జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం హర్షదాయకమని కొనియాడింది. దీనివల్ల వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై దృష్టి సారిస్తారని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఎండీ, సీఈవో ఎస్ఎస్ కిమ్ అభిప్రాయపడ్డారు. కేంద్రం తీసుకున్న మరో సాహసోపేత నిర్ణయంగా మహీంద్రా అండ్ మహీంద్రా ఎండీ పవన్ గోయెంకా ట్విట్టర్ వేదికగా అభివర్ణించారు. విద్యుత్ ఆధారిత వాహనాల తయారీ సమాజం (ఎస్ఎంఈవీ)తోపాటు, భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (ఎస్ఐఏఎం) సైతం హర్షం వ్యక్తం చేసింది. విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుందని ఎస్ఐఏఎం అధ్యక్షుడు రాజన్ వధేరా అన్నారు.

#### అద్దె బస్సులపైనా..

అద్దె ఎలక్ట్రిక్ బస్సులకూ జీఎస్టీ మినహాయింపును కల్పించింది మండలి. ఆగస్టు 1 నుంచి స్థానిక సంస్థలు అద్దెకు తీసుకుని నడిపించే విద్యుత్ ఆధారిత బస్సులకు జీఎస్టీ వర్తించదని ఓ ప్రకటనలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాగా, 12 మంది కిపైగా ప్రయాణించే సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ బస్సులకే ఈ వెసులుబాటు ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ కొనుగోలుదారులకు ఆదాయం పన్ను (ఐటీ) ప్రోత్సాహకాలనూ కేంద్రం ప్రకటించిన సంగతి విదితమే. విద్యుత్ ఆధారిత వాహనాల కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీరేటుపై రూ.1.5 లక్షల వరకు అదనంగా ఐటీ కోతను మోదీ సర్కారు కల్పించింది. ఈ వాహనాల విడి భాగాల దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్నీ ఎత్తివేసింది. ఫేమ్-2 పథకం కింద ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడకాన్ని వేగంగా విస్తరింపజేసేందుకు రూ.10,000 కోట్లనూ కేటాయించింది. ఈ నిధులతో విద్యుత్ ఆధారిత వాహనాలకు కావాల్సిన చార్జింగ్ స్టేషన్లకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

# గుత్తాధిపత్యం చెల్లదు

### పారదర్శక పోటీ ఉండాలి: టెలికం మంత్రి ప్రసాద్

### ఆయా సంస్థల సీఈవోలతో సమావేశం

**న్యూఢిల్లీ, జూలై 27:** టెలికం రంగంలో పారదర్శకమైన పోటీ ఉండాలని, గుత్తాధిపత్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహించదని టెలికం శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం ఇక్కడ భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాలతోపాటు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సీఈవోలతో ప్రసాద్ సమావేశమయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడంపైనే సంస్థలు దృష్టి పెట్టాలన్న ఆయన 5జీ సేవల్లో ఉత్సాహంగా పాల్గొని, దేశీయ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చేందుకు సహకరించాలని కోరారు. కాగా, ఈ సందర్భంగా తమ సమస్యలను మంత్రికి ఏకరువు పెట్టిన టెల్కోలు.. ప్రభుత్వ అండను అర్థించారు. ప్రస్తుతం టెలికం రంగం ఇబ్బందుల్లో ఉందని, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విడుదల, సుంకాల భారం, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పాయి. గంటకుపైగా జరిగిన ఈ సమావేశంలో ఎయిర్‌టెల్ సీఈవో గోపాల్ విఠల్, వొడాఫోన్ ఐడియా సీఈవో బాలేశ్ శర్మ, జియో బోర్డు సభ్యుడు మహీంద్ర నహత, బీఎస్ఎన్ఎల్ చైర్మన్ పీకే పుర్వార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ '5జీ ఉత్పత్తుల సృష్టి, 5జీలో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఏర్పాటు అవసరం ఉన్నది. దేశ జీడీపీని 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యంలో టెలికం రంగం వాటా 25 శాతంగా ఉండాలి' అని అన్నారు. కేంద్ర టెలికం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిశ్రమ వర్గాలతో ప్రసాద్ భేటీ కావడం ఇదే ప్రథమం. ప్రస్తుతం దేశీయ టెలికం రంగం రూ.7 లక్షల కోట్లకుపైగా రుణ భారంతో సతమతమవుతున్నది. కాగా, టెలికం ఎక్విప్‌మెంట్ తయారీలో భారత్‌ను కేంద్రంగా మార్చాలని మంత్రి పిలుపునిచ్చారు.


శనివారం న్యూఢిల్లీలో దేశీయ టెలికం సంస్థల సీఈవోలతో సమావేశమైన టెలీ కమ్యూనికేషన్స్ మంత్రి రవిశంకర్ ప్రసాద్



కూకట్‌పల్లి బాలాజీనగర్ షోరూమ్‌లో శనివారం ఆషాడం ఆఫర్లను ప్రకటిస్తున్న లాట్ మొబైల్స్ ప్రతినిధులు. చిత్రంలో సినీ నటుడు కార్తికేయ కూడా ఉన్నారు. మొబైల్ కొనుగోళ్లపై ఓ ఈఎంఐ మినహాయింపు, రూ. 2 వేల వరకు క్యాష్ బ్యాక్, ఒక మొబైల్ కొంటే మరో మొబైల్ ఉచితం వంటి ఆఫర్లను సంస్థ ప్రకటించింది.

# మళ్లీ లాభాల్లోకి ఐసీఐసీఐ

### తొలి త్రైమాసికంలో రూ.1,908 కోట్లుగా నమోదు

**ముంబై, జూలై 27:** ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రూ.1,908 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఇదే వ్యవధిలో రూ.119 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఏకీకృత నికర లాభం ఈసారి రూ.2,513.69 కోట్లుగా ఉంటే, పోయినసారి రూ.4.93 కోట్లుగానే ఉన్నట్లు శనివారం బ్యాంక్ స్పష్టం చేసింది. బ్యాంక్ కీలక నికర వడ్డీ ఆదాయం 26.8 శాతం ఎగిసి రూ.7,737 కోట్లకు చేరింది. నిరుడుతో చూస్తే 3.19 శాతం నుంచి 3.61 శాతానికి ఎగబాకింది. రిటైల్ విభాగం కార్యకలాపాలు 22 శాతం పెరుగడంతో రుణ వృద్ధి 18 శాతంగా ఉందన్నది. ఇదిలావుంటే గతేడాది స్థూల మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) తీవ్రత రూ.3,547 కోట్లుగా ఉంటే, ఈసారి రూ.2,779 కోట్లుగా ఉన్నాయి. ఇందులో రిటైల్ రంగానికి చెందినవే రూ.1,511 కోట్లుగా ఉండటం గమనార్హం. కార్పొరేట్, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎస్ఎంఈ)లకు చెందినవి రూ.1,268 కోట్లు. కిసాన్ క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియోలో రూ.452 కోట్లకుపైగా రుణాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు బ్యాంక్ ఈ సందర్భంగా చెప్పింది. గత వారం ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం ఇదే మాట అనడం విశేషం.



#### పెరిగిన జైపీ ఇన్‌ఫ్రా నష్టాలు

రుణ పీడిత జైపీ ఇన్‌ఫ్రాటెక్ నికర నష్టం ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.448.09 కోట్లుగా నమోదైంది. నిరుడు రూ.319.82 కోట్ల నష్టాన్ని సంస్థ ప్రకటించింది. కాగా, ఆదాయం గతంతో పోల్చితే రూ.432.31 కోట్ల నుంచి రూ.669.56 కోట్లకు పెరిగినట్లు జైపీ ఇన్‌ఫ్రా శనివారం స్పష్టం చేసింది. ఐడీబీఐ బ్యాంక్ నేతృత్వంలోని రుణదాతల కూటమి 2017లో బకాయిల వసూలుకు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడంతో జైపీ ఇన్‌ఫ్రాటెక్ ప్రస్తుతం దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

#### తగ్గిన హావెల్స్ లాభాలు

కన్జ్యూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ తయారీదారు హావెల్స్ ఇండియా ఈ జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలంలో రూ.177.09 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో రూ.211.16 కోట్ల లాభాలను అందుకున్నట్లు శనివారం స్పష్టం చేసింది. అయితే ఆదాయం ఈసారి రూ.2,756.50 కోట్లకు పెరిగింది. పోయినసారి రూ.2,629.94 కోట్లుగా ఉన్నది. కానీ సంస్థాగత ఖర్చులు గతంతో పోల్చితే రూ.2,328.23 కోట్ల నుంచి రూ.2,489.62 కోట్లకు చేరడంతో లాభాలు తగ్గాయి.


**www.prabhakarreddymatrimony.com**



22 సంవత్సరాల అనుభవం అన్ని కులములు 1వ, 2వ, లేట్, India/Abroad
Email: prabhakarpinnama@gmail.com
P. Prabhakar Reddy, M.Com., L.B. Nagar, Hyderabad
Cell No. 9391198332 (W) 9059430595
Branch Office: దిల్‌సుఖ్‌నగర్, సెల్ నం: 63008 65815
www.bcmatrimony.in - 8919664670
రైతు బిడ్డలకు ఉచితంగా సంబంధాలు చూపబడును

**వధువు కావలెను**

★రెడ్డి: 27Y/ 5'10"/ MS-USA/ SWE/ 130K 5Cr's ఆస్తి గల వరుడుకు తగిన వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 28Y/ 5'11"/ MS-USA/ SWE/ 125K 15Cr's ఆస్తి గల వరుడుకు తగిన వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 26Y/ 5'9"/ MS B.Tech /SWE12 Lakhs P/A 5Cr'sఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 29Y/ 5'9"/ B.Tech SWE 16 Lac's P/A 15Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 29Y/ 5'8"/ MBBS MD/ Doctor 1 Lac P/M 4Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 30Y/ 5'11"/ MBBS Doctor 2 Lakh's P/M 7Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★వెలమ: 27Y/ 5'9"/ B-Tech, 30,000/- P/M 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★పద్మశాలి: 28Y/ 5'10"/ B.Tech /SWE 50,000/- P/M 3Cr's ఆస్తి గల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★మున్నూరుకాపు: 27Y/ 5'8"/ B.Tech SWE 40,000 P/M 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★ముదిరాజ్:28Y/5,7"/B.Tech/SWE 30,000/- P/M 3Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★బ్రాహ్మణ్: 30Y/5,7"/ MS/ SWE /1 Lakh P/M 4Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★యాదవ: 29Y/ 5'8"/ MBA/ Pvt Job/ 20,000/- PM 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★బలిజ: 28Y/ 5'7"/ BA/ Pvt Job/ 25,000/- P/M 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★ముస్లిం: 26Y/ 5'6"/ DEGREE/ Pvt Job/ 20,000/- P/M 1Cr ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com

**వివాహ పరిచయ వేదిక**
★కాపు, మున్నూరుకాపు, బలిజ, వెలమ వధూవరుల
వివాహ పరిచయ వేదిక: 28-07-2019
9.30 AM to 2.00 PM. Uppal, Hyd.
Fee: 1500/-
7095596623, 9391198332

★గౌడ్స్: 27Y/ 5'8"/ MBA/ Pvt Job/ 25,000/- P/M 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★SC-మాల: 28Y/ 5'7"/B-Tech /SWE 40,000/-P/M 2Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★SC-మాదిగ రెండవ పెళ్లి: 31Y/ 5'8"/ Degree/ Govt Job/ 50,000/- PM 3 Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి రెండవ పెళ్లి: 32Y/ 5'10"/ MS USA/ SWE/ 100K/ 10Cr's ఆస్తిగల వరుడుకు వధువు కావలెను. 9391198332 www.prabhakarreddymatrimony.com

**వరుడు కావలెను**

★రెడ్డి: 26Y/ 5'4"/ MS-USA/ SWE 90K 3Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి:25Y/5'5"/MS-USA/SWE/ 95K 5Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి:24Y/5'4"/B.Tech/SWE 90,000/- P/M 10Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 25Y/5'5"/B.Tech/SWE 50,000/-P/M 15Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి: 26Y/ 5'5"/ MBBS / Doctor 1 Lac/-P/M 5Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి:25Y/5'4"/MBBS/Doctor /2Lakhs P/M 7Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★మున్నూరుకాపు: 26Y/5'4"/B.Tech SWE/25,000/- P/M 2Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★ముదిరాజ్:25Y/5'5"/B.Tech/SWE/ 30,000/- P/M 2Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★పద్మశాలి: 24Y/ 5'4"/Degree/Pvt Job/ 20,000/- PM 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★యాదవ:23Y/5'3"/Degree/Pvt Job/ 25,000/-PM 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★గౌడ్స్:24Y/5'4"/B.Tech SWE 25,000/- PM 2Cr's గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★ముస్లిం: 23Y/5'3"/Degree/Pvt Job/ 20,000/- PM 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★వెలమ: 23Y/5'4"/Degree/Pvt Job/ 20,000/- PM 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★బ్రాహ్మణ్: 25Y/ 5'4"/ B-Tech / SWE/ 30,000/- PM 2Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★వైశ్య:24Y/ 5'3"/Degree/Pvt Job/ 20,000/- PM 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★ఆర్యవైశ్య: 25Y/ 5'4"/ B-Tech /SWE/ 25,000/- PM 2Cr's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి రెండవ పెళ్లి: 28Y/5'5"/MS USA/ SWE/ 90K 5Cr's. ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com
★రెడ్డి రెండవ పెళ్లి: 27Y/ 5'5"/B-Tech/ SWE/50,000/-P/M 3Cr's. ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9059430595 www.prabhakarreddymatrimony.com

**భ్రమరాంభ మ్యారేజ్ బ్యూరో**
**ఓన్లీ మున్నూరు కాపు**
(Since:1996)
డాక్టర్స్/ఇంజనీర్స్/గౌట్/NRI/బిజినెస్
మీరు కోరిన పెళ్లి సంబంధాలకు
సంప్రదించండి. కరీంనగర్.
సెల్: 9948483542, 9515987410

**మాల మహానాడు వివాహ ఐక్య వేదిక**
ప్రభుత్వ ఆమోదితము 614/2011
వివాహా సంబంధాలకై సంప్రదించండి
సాగె సుమోహన్ (అధ్యక్షులు) శ్రీమతి జి.సరోజ (వ్యవస్థాపకురాలు)
H.O: జ్యోతినగర్, కరీంనగర్-(T.S & A.P)
సెల్: 9849009989, 9032727919, 9059126256

**శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో**



అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.
H.O.:తార్నాక, షాప్ నెం.48, హుడా కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
B.O.: Beside Santoshimaatha Temple, Backside RTC Bus Depot, Dilsukhnagar,
Whatsapp: 9866044439

**వధువు కావలెను**

★మున్నూరుకాపు: 27Yrs, 5'8", M.Tech, SWE, 70K PM + Business 1.5K PM గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★పద్మశాలి: 33Yrs, 5'7", B.Tech, M.Tech, PGDM, SWE, 16L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★గౌడ్స్: 30Yrs, 5'11", MBBS (PG), Doctor, 45,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 9701960229
★ముదిరాజ్: 29Yrs, 5'11", B.Tech, M.Tech, Central Govt. Emplyee, 8L PA గల వరునికి తగిన వధువు కావలెను. 6301634833
★యాదవ: 28Yrs, 5'10", M.Tech, SWE, 12L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★విశ్వబ్రాహ్మణ: 33Yrs, 5'7", MCA, SWE, 90,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★నాయిబ్రాహ్మణ: 29Yrs, 5'7", Ph.D, Govt. Employee, 60,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 9701960229
★గంగపుత్ర: 32Yrs, 5'8", B.Tech, MBA, Bank Manager, 50,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 6301634833
★హిందూ మాల: 30Yrs, 5'8", B.Tech, Sr. SWE, 14L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★హిందూ మాదిగ: 35Yrs, 5'5", M.Sc, Govt. Employee, 70,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 6301634833

**వరుడు కావలెను**

★కాపు: 30Yrs, 5'2", B.Tech, SWE, 7.8L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229
★మున్నూరుకాపు: 26Yrs, 5'6", M.Tech, SWE, 7L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 6301634833
★పద్మశాలి: 25Yrs, 5'4", B.Tech, SWE, 4.5L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★గౌడ్స్: 28Yrs, 5'5", B.Tech, MBA, SWE, 50,000/- PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★ముదిరాజ్: 30Yrs, 5'5", MBA, SWE, 6.3L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229
★యాదవ: 26Yrs, 5'1", BCA, Bank Employee, 25,000/- PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 6301634833
★విశ్వబ్రాహ్మణ: 25Yrs, 5'2', B.Tech, SWE, 4L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★గంగపుత్ర: 28Yrs, 5'4", B.Tech, SWE, 4.5L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★మాల(హిందు): 30Yrs, 5'5", B.Tech, SWE, 12L PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229
★మాదిగ: 30Yrs, 5'6", MBA, Central Govt. Job, 40,000/- PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

**వెంకటేశ్వర మ్యారేజ్ లైన్స్**



**మున్నూరు కాపు** స్పెషల్
అన్ని కులములు 1వ, 2వ, లేట్ /India/Abroad
కొలిశెట్టి సోమయ్య నాయుడు
Head Office: అల్కాపురి, నాగోల్, హైదరాబాద్
9247523555/9666160907/040-48509994
Branch Office: RTC 'X' Road, Piller No.3
7093499919/8639065571/040-40032881

**అమ్మాయిలు**

★ మున్నూరు కాపు : 26Y, 5'6", Fair, BE, CA Technologies, SWE, Hyd, 80,000/- PM, 1 కోటి ఆస్తి గల అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 22Y, 5'5", Fair, B.Tech (CSE), 50,000/- PM, SWE, Hyd. వెల్‌సెటిల్డ్ అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 31Y, 5'3", Fair, MBA, MS(IT), USA, SWE-USA, HIB VISA, 150K, 2 కోట్ల ఆస్తి గల అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 25Y, 5'5", Fair, B.Tech, MS-USA, SWE-USA, HIB, 120K, 1 కోటి ఆస్తి గల అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 30Y, 5'4", Fair, MBBS, PG, Doctor అమ్మాయికి Any Doctor అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 27Y, 5'3", Fair, MBBS, PG, Anasthishiya Doctor అమ్మాయికి Any Doctor అబ్బాయి కావలెను. 7093499919.
★ మున్నూరు కాపు : 24Y, 5'4", Fair, B.Tech, Bank Empl/-, 30,000/- PM అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 28Y, 5'5", Fair, B.Tech, Govt. Emp/- 60,000/- PM వెల్‌సెటిల్డ్ అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 27Y, 5'6", Fair, B.Tech, Sr. SWE, Hyd. 1 లక్ష PM, 1 కోటి ఆస్తి గల అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919
★ రెండో పెళ్ళి మున్నూరు కాపు : 35Y, 5'4", Fair, MCA, SWE-Hyd. 80,000/- PM 1 కోటి ఆస్తి గల అమ్మాయికి అబ్బాయి కావలెను. 7093499919

**అబ్బాయిలు**

★ మున్నూరు కాపు : 32Y, 5'10", Fair, M.Tech, Sen, SWE, 14 Lakhs/ PA, 10 Cr అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919.
★ మున్నూరు కాపు : 35Y, 6'0", Fair, M.Tech(IIT), Project Manager, Hyd-18 Lakhs PA, 5 Cr అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919.
★ మున్నూరు కాపు : 28Y, 5'11", Fair, B.Tech, Govt. Emp/- Hyd. 80,000/- PM, వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 29Y, 5'7", Fair, B.Tech, Bank Officer, 60,000/- PM, Hyd, వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 28Y, 5'11", Fair, B.Tech, MS-USA, SWE-USA, 100K, వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919
★ రెడ్డి/ కాపు : 34Y, 5'10", Fair, B.Tech, SWE, Hyd, 110K/ PA, వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 26Y, 5'7", Fair, B.Tech, MS-USA, SWE-USA, 120K, వెల్‌సెటిల్డ్ అబ్బాయికి అమ్మాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 29Y, 5'8", Fair, MBBS, MD General Doctor, అబ్బాయికి Doctor అమ్మాయి కావలెను. 7093499919
★ మున్నూరు కాపు : 30Y, 5'11", MS, E.N.T. Doctor అబ్బాయికి Any Doctor అమ్మాయి కావలెను. 7093499919
★ రెండో పెళ్ళి మున్నూరు కాపు : 50Y, 5'9", Fair, MBBS, Own Clinic, 20 కోట్ల ఆస్తి, కుల పట్టింపు లేని అమ్మాయి కావలెను. 7093499919

**బాబురావు మ్యారేజ్ బ్యూరో**
మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IES, Doctors, SWE, Govt.Job, విదేశీ, సంబంధాలకై సంప్రదించండి : H.No. 33-6-556, రంగశాయిపేట్, వరంగల్, జగిత్యాల, HYD. 7893013265, 9966621170.

**వరుడు కావలెను**

★మాల హిందూ: Age: 26, Ht: 5'.3", MD. General Medicine, Age: 26, Ht: 5'.4", MD. Dermatology, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9966621170.
★మాల హిందూ: Age: 29, Ht: 5'.5", SBI-Manager, Age: 30, Ht: 5.'4", M.Sc, Group-II, Acto, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265
★మాల హిందూ: Age: 26, Ht: 5.4", B.Tech, R.W.S.-A.E.E, Age: 28, Ht: 5.4", M.Sc, OBG, వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్: Age: 25, Ht: 5.3", B.Tech, GHMC-A.E, Age: 26, Ht: 5.5", MD. Pediatrics, వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్: Age: 27, Ht: 5.5", SBI-P.O, Age: 29, Ht: 5.4", MBBS, I.R.S, Group-I, వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ : Age: 25, Ht: 5.'3", B.Tech(IIT), Scientist (ISRO), Age: 25, Ht: 5'.3", B.Tech, T.S.Genco-A.E. వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ : Age: 27, Ht: 5'.3", M.S. General Surgeon, Age: 29, Ht: 5'.5", M.S. OBG, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్: Age: 26, Ht: 5.3", B.Tech, SBI-P.O, Age: 30, Ht: 5.4", M.Sc, Group-I, వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్: Age: 25, Ht: 5'.3", B.Tech, MBA, SWE-10 లక్షలు, Age: 29, Ht: 5'.4", B.Tech, SWE-20 లక్షలు, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ : Age: 27, Ht: 5.'5", B.Tech, R.W.S-A.E, Age: 29, Ht: 5'.3", B.Tech, I.O.B-P.O, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9966621170.

**వధువు కావలెను**

★మాల హిందూ: Age: 27, Ht: 5'.6", B.Tech (IIT), I.R.S, Age: 27, Ht: 5.'9", B.Tech(IIT), MBA (IIM), SWE- 25లక్షలు, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్:- Age: 28, Ht: 5'.8", B.Tech(IIT), I.E.S. Railway, Age: 30, Ht: 5'.8", M.S. Ortho, Age: 30, Ht: 5'.9", MD. General Medicine, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 28, Ht: 5.8", MD. General Medicine, Age: 26, Ht: 5.9", B.Tech(IIT), BPCL-Manager, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్: Age: 29, Ht: 5'.6", B.Tech, T.S. Genco-A.E, Age: 27, Ht: 5.'8", B.Tech(NIT), Coal India-Manager, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 31, Ht: 5.8", MBA, SBI-Manager, Age: 30, Ht: 5.8", M.Sc, Ph.D, BPCL-Manager 18లక్షలు, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ: Age: 29, Ht: 5'.9", M.D. General Medicine, Age: 31, Ht: 5.'8", B.Tech, SBI-Manager, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్:- Age: 30, Ht: 5'.8", B.Tech(IIT), SWE- 20 లక్షలు, Age: 30, Ht: 5'.8", M.Pharmacy, Drug Inspector, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ:- Age: 27, Ht: 5'.7", B.Tech, R.W.S-A.E, Age: 27, Ht: 5'.8", B.Tech, CBI Officer, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్:- Age: 29, Ht: 5'.8", SBI-P.O, Age: 29, Ht: 5'.9", B.Tech(IIT), MBA(IIM), SWE-20 లక్షలు, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ:- Age: 29, Ht: 5'.8", B.Tech (IIT), MBA(IIM), SWE-20లక్షలు, Age: 29, Ht: 5'.7", M.Sc., Andhra Bank-Manager, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.

**పీకేఎల్‌లో నేడు**

ఢిల్లీ X హర్యానా-7.30గం.
యు ముంబా X బెంగళూరు-8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో



నిఖత్ జరీన్

# సిల్వర్ పంచ్

## నిఖత్, హుస్సాముద్దీన్‌కు రజతాలు
## పోరాడి ఓడిన రాష్ట్ర బాక్సర్లు .. థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీ

**అంతర్జాతీయ వేదికపై తెలంగాణ బాక్సర్లు మరోమారు సత్తాచాటారు. మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థులకు సవాలు విసురుతూ థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీలో రాష్ట్ర యువ బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుస్సాముద్దీన్ ఆకట్టుకున్నారు. తమకంటే మెరుగైన ప్రత్యర్థులు ఎదురైనా వెరవకుండా కడదాకా పోరాడి ఓడి తృటిలో పసిడి పతకాలను చేజార్చుకున్నారు. టోర్నీ మొత్తంగా భారత బాక్సర్లు పతకాల పంట పండించారు.**

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో రాష్ట్ర బాక్సర్లు నిఖత్ జరీన్(51కి), మహ్మద్ హుస్సాముద్దీన్(56కి) రజత పతకాలతో మెరిశారు. శనివారం జరిగిన వేర్వేరు విభాగాల ఫైనల్లో ప్రత్యర్థుల చేతుల్లో ఓటములతో స్వర్ణ పతకాలను చేజార్చుకున్నారు. టోర్నీ ఆద్యంతం మెరుగైన రీతిలో ఆకట్టుకున్న నిఖత్, హుస్సాముద్దీన్ ఫైనల్ పోరులో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. మహిళల 51కిలోల కేటగిరి ఫైనల్లో బరిలోకి దిగిన నిజామాబాద్ బాక్సర్ నిఖత్ 0-5 తేడాతో చాంగ్ యువాన్(చైనా) చేతిలో ఓడింది. ఆసియా గేమ్స్(జకార్తా) స్వర్ణ విజేత అయిన యువాన్‌కు నిఖత్ దీటైన పోటీనివ్వలేకపోయింది. ఓవైపు చైనా బాక్సర్ అదే పనిగా పంచ్‌లు సంధించుకుంటూ పోవడంతో నిఖత్ దగ్గర సరైన సమాధానం లేకపోయింది. పోటీనిచ్చేందుకు ప్రయత్నించినా యువాన్ చురుకైన కదలికలతో పట్టు బిగించింది. పురుషుల 56కిలోల విభాగంలో పోటీపడ్డ హుస్సాముద్దీన్ 0-5తో చాట్‌చాయి దేచా బుడ్డీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు. ఇటీవలే ఇండియన్ ఓపెన్ చాంపియన్‌షిప్ గెలిచిన చాట్‌చాయి.. హుస్సాముద్దీన్‌కు ఏ మాత్రం అవకాశామివ్వకుండా పసిడి దక్కించుకున్నాడు. పురుషుల 75కిలోల విభాగంలో అశిష్ కుమార్ 5-0 తేడాతో కిమ్ జిన్‌జాయి(కొరియా)పై గెలిచి భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించాడు. అంతర్జాతీయ కెరీర్‌లో అశిష్‌కు ఇది అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. మరోవైపు దీపక్(49కి), బ్రిజేష్ యాదవ్(81కి) ఫైనల్లో ఓడి రజత పతకాలతో నిలిచారు మంజురాణి(48కి), అశిష్(69కి), భాగ్యబతి కచారీ(75కి) కాంస్య పతకాలు సాధించారు. వివిధ దేశాల నుంచి 37 మంది బాక్సర్లు పాల్గొన్న టోర్నీలో మొత్తంగా భారత్‌కు స్వర్ణం సహ నాలుగు రజతాలు, మూడు కాంస్యాలు దక్కాయి.



హుస్సాముద్దీన్

## 'ప్రెసిడెంట్స్' ఫైనల్లో మేరికోం



**న్యూఢిల్లీ:** ఇండోనేషియా వేదికగా జరుగుతున్న 23వ ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో భారత బాక్సింగ్ క్వీన్ మేరికోం ఫైనల్లోకి దూసుకెళ్లింది. మేరికోంతో సహా గౌరవ్ బిధూరీ(56కి), నీరజ్ స్వామి, అనంత ప్రహ్లాద్(52కి), జమునా బొరో(54కి), సిమ్రన్‌జీత్‌కౌర్(60కి), దినేశ్ దాగర్(69కి), మోనిక(48కి), అంకుశ్ దహియా(64కి) పసిడి పోరులో నిలిచారు. శనివారం జరిగిన మహిళల 51కిలోల సెమీస్ బౌట్‌లో మేరికోం 3-2తో అన్హ్ వో థీకిమ్(వియత్నాం)పై విజయం సాధించింది. అక్టోబర్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకుని మేరి ఈటోర్నీలో బరిలోకి దిగింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఫ్రాంక్స్ ఎప్రిల్‌తో మేరి తలపడుతుంది. పురుషుల 56కిలోల కేటగిరీలో బిధూరీ 3-2తో ఒగ్యారె జునమిలార్డో(ఫిలిప్పీన్స్)పై గెలిచాడు.

# కోచ్ పదవిపై రాబిన్ గురి

### దరఖాస్తు చేసుకున్న మాజీ క్రికెటర్



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ పదవి కోసం రేసు రసవత్తరంగా మారే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. తాజాగా కోచ్ స్థానం కోసం భారత మాజీ ఆల్‌రౌండర్ రాబిన్ సింగ్ దరఖాస్తు చేసుకున్నాడు. 15 ఏండ్లుగా విభిన్న జట్లకు వివిధ విభాగాల్లో కోచ్‌గా పని చేసిన అనుభవమున్న అతడు... టీమ్‌ఇండియా హెడ్ కోచ్ స్థానం కోసం బీసీసీఐకి శనివారం దరఖాస్తు సమర్పించాడు. అనంతరం మాట్లాడుతూ 'కోచ్‌గా రవిశాస్త్రి హయాంలో ఇటీవల జరిగిన ప్రపంచకప్ సెమీస్‌లోనే భారత్ ఓడిపోయింది. 2015 విశ్వటోర్నీలో ఆయన జట్టు డైరెక్టర్‌గా ఉన్న సమయంలోనూ ఇలానే జరిగింది. 2023 ప్రపంచకప్ కోసం జట్టును సిద్ధం చేసేందుకు ఇదే సరైన సమయం. ప్రస్తుతం కోచ్ మార్పు జట్టుకు మంచిది' అని చెప్పాడు. టీమ్‌ఇండియా ఫీల్డింగ్ కోచ్‌గా 2007-09 వరకు పని చేసిన రాబిన్ సింగ్... మూడేండ్ల పాటు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు హెడ్‌కోచ్‌గా పని చేశాడు. ప్రస్తుతం ఆ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా కొనసాగుతున్నాడు. గతంలో అండర్-19, భారత్-ఏ జట్లకూ కొంత కాలం కోచ్‌గా చేసిన అనుభవం రాబిన్‌కు ఉంది. చీఫ్ కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 30తో ముగియనుంది. శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్దనే, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైక్ హస్సీ, సీనియర్ కోచ్ టామ్ మూడీ కూడా కోచ్ రేసులోకి వచ్చే అవకాశముంది. అయితే, ప్రధాన కోచ్‌గా కొనసాగాలని రవిశాస్త్రి ఆశిస్తున్నాడు. మరోవైపు ఈసారి కోచ్ ఎంపిక బాధ్యతను దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ నిర్వర్తించనుండగా... ఈ ప్రక్రియలో కెప్టెన్ కోహ్లీ ప్రమేయం ఏమీ ఉండదని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ శుక్రవారం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



# షమీకి యూఎస్ వీసా తిరస్కరణ

### బీసీసీఐ లేఖతో లైన్‌క్లియర్

**కోల్‌కతా:** భారత సీనియర్ క్రికెటర్ మహమ్మద్ షమీ వీసా ధరఖాస్తును అమెరికా తిరస్కరించింది. గతంలో గృహహింస కింద నమోదైన కేసులు ఇంకా ఒక కొలిక్కిరాని కారణంగా షమీకి అమెరికా వీసా అనుమతి ఇవ్వలేదు. అయితే వెంటనే రంగంలోకి దిగిన బీసీసీఐ షమీకి అండగా నిలిచింది. బోర్డు సీఈవో రాహుల్ జోహ్రీ.. ఈ బెంగాల్ స్పీడ్‌స్టర్ దేశం తరపున సాధించిన విజయాలను గుర్తుచేస్తూ యూఎస్ ఎంబసీకి లేఖ రాశాడు. ఇటీవల జరిగిన ప్రపంచకప్‌లో షమీ ప్రదర్శనను లేఖలో ప్రస్తావించాడు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న అమెరికా ఎంబసీ పీ1 కేటగిరీ కింద వీసా మంజూరు చేసింది. అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధించిన ఆటగాళ్లకు పీ1 కింద వీసాలు ఇస్తారు. 'అవును షమీ వీసాను తొలుత యూఎస్ ఎంబసీ తిర్కసరించింది. అతనిపై ఉన్న కొన్ని కేసులపై పోలీసు దర్యాప్తు అనేది పూర్తి కానందువల్ల ఇది జరిగింది. అయితే బోర్డు జోక్యంతో వీసా సమస్య పరిష్కారమైంది' అని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు.

# ఆశలు ఆవిరి

### జపాన్ ఓపెన్ సెమీస్‌లో ప్రణీత్ ఓటమి
### టోర్నీలో ముగిసిన భారత్ పోరు



సాయి ప్రణీత్

**టోక్యో:** జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. ఎలాగైనా సీజన్‌లో తొలి టైటిల్ సాధించాలనుకున్న మన ప్లేయర్ల ఆశలు నెరవేరలేదు. టోర్నీ తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్, క్వార్టర్స్‌లో సింధు వెనుదిరగ్గా...శనివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో సాయి ప్రణీత్ 18-21, 12-21తేడాతో టాప్‌సీడ్ కెంటో మొమొటా(జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. 45నిమిషాల పాటు సాగిన మ్యాచ్ తొలి గేమ్‌లో భారత షట్లర్ అద్భుత పోరాటపటిమ కనబరిచాడు. ప్రారంభంలో 3-1తో ఆధిక్యంలో నిలిచినా ఆ తర్వాత మొమొటా పుంజుకోవడంతో 11-11తో పాయింట్లు సమమయ్యాయి. అప్పటి నుంచి వెనుకబడిన ప్రణీత్ వరుసగా పాయింట్లు కోల్పోయాడు. చివర్లో పోరాడినా 18-21తో తొలి గేమ్ కోల్పోవాల్సి వచ్చింది. రెండో గేమ్‌లో ఓ దశలో 5-4తో ఆధిక్యంలో నిలిచినా ఆ తర్వాత ప్రణీత్ కనీస పోటీనివ్వలేక చేతులెత్తేశాడు. రెండో గేమ్‌ను ప్రణీత్ 12-21తో ప్రత్యర్థికి కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. దీంతో జపాన్ ఓపెన్‌లో భారత్ టైటిల్ ఆశలు ఆవిరయ్యాయి. ఈనెల 30న ప్రారంభమయ్యే థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత షట్లర్లు మరోసారి టైటిల్ వేటను ప్రారంభించనున్నారు.

# పాంథర్స్ అదుర్స్

### బెంగాల్‌పై ఉత్కంఠ విజయం.. పుణేరిపై యు ముంబా జయకేతనం



**ముంబై:** ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. నువ్వానేనా అన్నట్లు తలపడుతుండటంతో ఆఖరి వరకు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. శనివారం టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ముఖ్య అతిథిగా హాజరైన ముంబై అంచె పోటీల్లో రెండు మ్యాచ్‌లు ఫ్యాన్స్‌ను అలరించాయి. విభిన్న వేషధారణలో మ్యాచ్‌కు వచ్చిన కోహ్లీ జాతీయ గీతాలాపనతో ఆకట్టుకున్నాడు. జైపూర్ పింక్‌పాంథర్స్ 27-25తో బెంగాల్ వారియర్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. జైపూర్ తరపున రైడింగ్‌లో దీపక్ హుడా(6), డిఫెన్స్‌లో సందీప్ దల్(8) అదరగొట్టారు. మరోవైపు బెంగాల్‌లో ప్రపంజన్(7), బల్దేవ్‌సింగ్(6) రాణించారు. తమ తొలి మ్యాచ్‌ల్లో విజయాలతో పోరుకు దిగిన జైపూర్, బెంగాల్ గెలిచిందుకు కడదాకా కసిగా కొట్లాడాయి. ఈ మ్యాచ్ ద్వారా మణిందర్‌సింగ్ 450వ రైడ్ పాయింట్ నమోదు చేసుకోగా, సందీప్ దల్ డిఫెన్స్‌లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. మ్యాచ్‌లో తొలుత బెంగాల్ తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. రైడింగ్‌కు తోడు డిఫెన్స్‌లో పాయింట్లు కొల్లగొడుతూ ముందుకు సాగింది. ముఖ్యంగా ప్రపంజన్ తన తొమ్మిది రైడ్లలో ఆరు పాయింట్లు దక్కించుకున్నాడు. ఈ సమయంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన అజింక్యా పవార్ బెంగాల్‌కు నాలుగు పాయింట్లు అందించాడు. దీంతో ప్రథమార్ధం ముగిసే సరికి బెంగాల్ 14-10తో ఆధిక్యంలో నిలిచింది. కీలకమైన ద్వితీయార్ధంలో పుంజుకున్న జైపూర్ వెనుదిరిగి చూడలేదు. ప్రత్యర్థి బెంగాల్‌ను ఒకింత ఒత్తిడిలోకి నెడుతూ పాయింట్లు కైవసం చేసుకుంటూ పోయింది. దీంతో మ్యాచ్ 25వ నిమిషానికి పాంథర్స్ 15-16 చేరుకుంది. మరుసటి నిమిషంలోనే పాంథర్స్ కెప్టెన్ దీపక్‌ను ఔట్ చేసి బెంగాల్ మ్యాచ్‌పై పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నించింది. మరోవైపు పాంథర్స్ డిఫెండర్ సందీప్ వీలుచిక్కినప్పుడల్లా వారియర్స్ రైడర్లను తనదైన పట్టుతో పడేసి జైపూర్‌కు కీలక పాయింట్లు అందించాడు. మ్యాచ్ ఆఖరి నిమిషాల్లో బెంగాల్ ఆలౌట్ కావడం పాంథర్స్‌కు కలిసి వచ్చింది.

**యు ముంబా జోరు**

అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 33-23 తేడాతో పుణేరి పల్టాన్‌పై గెలిచింది. యు ముంబా తరుపున అభిషేక్ సింగ్(5), సురిందర్ సింగ్(4) రాణించారు. పుణె జట్టులో పవన్ కదియాన్(4), సుర్జీత్‌సింగ్(4) ఆకట్టుకున్నారు.



శనివారం ముంబైలో జరిగిన యు ముంబా, పుణేరి పల్టాన్ కబడ్డీ మ్యాచ్‌కు హాజరైన టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ

**ఇంగ్లండ్ జట్టు :**

**జో రూట్(కెప్టెన్), మొయిన్ అలీ, అండర్సన్, ఆర్చర్, బెయిర్‌స్టో, బ్రాడ్, రోరీ బర్న్స్, బట్లర్(వికెట్ కీపర్), సామ్ కరన్, జో డెన్లీ, రాయ్, స్టోక్స్, ఒల్లీ స్టోన్స్, వోక్స్.**



# ఆర్చర్ ఆగయా

### యాషెస్ టెస్ట్ సిరీస్‌కు ఎంపిక.. ఇంగ్లండ్ వైస్ కెప్టెన్‌గా స్టోక్స్

**లండన్:** ఇంగ్లండ్ వన్డే ప్రపంచకప్ విజేతగా నిలువడంలో కీలకపాత్ర పోషించిన ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్.. యాషెస్ సిరీస్ కోసం జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇంతవరకు ఒక్క టెస్టు కూడా ఆడని అతడు నేరుగా ప్రతిష్ఠాత్మక సిరీస్‌కు ఎంపికవడం విశేషం. ఇటీవల గాయంతో బాధపడ్డ జోఫ్రా పూర్తిగా కోలుకున్నాడు. ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై ఆగస్టు 1న ప్రారంభమయ్యే యాషెస్ సిరీస్ తొలి టెస్టు కోసం ఇంగ్లండ్ క్రికెట్‌బోర్డు శనివారం 14మంది ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేసింది. విశ్వ టోర్నీ ఫైనల్లో వీరోచితంగా పోరాడిన ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ మరోసారి ఇంగ్లీష్ టెస్టు జట్టు వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టనున్నాడు. 2017 సెప్టెంబర్‌లో ఓ నైట్ క్లబ్‌లో గొడవ కారణంగా ఉపసారథి స్థానాన్ని అతడు కోల్పోగా... క్లీన్ చిట్ రావడం, నిలకడగా రాణిస్తుండడంతో మరోసారి నియమితుడయ్యాడు. గాయం కారణంగా ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు దూరమైన సీనియర్ స్పీడ్‌స్టర్ జేమ్స్ అండర్సన్ జట్టులోకి రాగా, పసికూనను 15 ఓవర్లలోపే కుప్పకూల్చిన క్రిస్ వోక్స్, స్టువర్ట్ బ్రాడ్ ద్వయంతో ఇంగ్లండ్ బౌలింగ్ మరింత బలోపేతమైంది. ఐరిష్ జట్టుతో మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా వచ్చి 92పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన లీచ్‌కు జట్టులో చోటు దక్కలేదు. లార్డ్స్‌లో ఐర్లాండ్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో ఇంగ్లండ్ 143 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో వోక్స్, బ్రాడ్ ప్రత్యర్థి జట్టును 38 పరుగులకు ఆలౌట్ చేశారు.

**అలెక్స్ క్యారీకి నో చాన్స్**

ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన వికెట్ కీపింగ్, బ్యాట్స్‌మన్ అలెక్స్ క్యారీకి యాషెస్ సిరీస్ కోసం ఎంపిక చేసిన ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కలేదు. క్యారీకి చాన్స్ ఇవ్వకపోవడాన్ని ఆ దేశ మాజీ క్రికెటర్లు తీవ్రంగా తప్పుబట్టారు. జట్టులో క్యారీ లేడనే విషయాన్ని నమ్మలేకున్నామని ఆసీస్ మాజీలు మార్క్ వా, షేన్ వార్న్, మార్క్ టేలర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రెండేండ్లుగా టెస్టు జట్టుకు దూరంగా ఉన్న వికెట్ కీపర్ మాథ్యూ వేడ్‌ను మాత్రం ఆసీస్ బోర్డు ఎంపిక చేసింది. మరోవైపు బాల్ ట్యాంపరింగ్ ఉదంతం తర్వాత బాన్‌క్రాఫ్ట్ మరోసారి జట్టులోకి వచ్చాడు.

# శభాష్ నదీమ్

- 10 వికెట్లతో విజృంభణ
- విండీస్-ఏపై భారత్-ఏ గెలుపు



నదీమ్

**నార్త్‌సౌండ్(అంటిగ్వా):** వెస్టిండీస్-ఏపై వన్డే సిరీస్ గెలిచి సత్తా చాటిన భారత్-ఏ జట్టు... తొలి అనధికార టెస్టులో సైతం ఘన విజయం సాధించింది. షబాద్ నదీమ్ రెండు ఇన్నింగ్స్‌లో 10వికెట్ల మ్యాజిక్‌కు తోడు.. తొలి ఇన్నింగ్స్‌లో శివం దూబే(71), వృద్ధిమాన్ సాహా(66) బ్యాటింగ్‌లో చెలరేగడంతో 6 వికెట్ల తేడాతో భారత్-ఏ సునాయాసంగా గెలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ నిర్దేశించిన 97 పరుగుల లక్ష్యాన్ని మ్యాచ్ చివరి రోజైన శనివారం భారత బ్యాట్స్‌మెన్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించేశారు.

**మెరిసిన నదీమ్, దూబే, సాహా**

మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్-ఏ... భారత స్పిన్నర్ నదీమ్(5/62) విజృంభణతో విలవిల్లాడింది. 97-5 వికెట్లు కోల్పోయిన తరుణంలో బ్లాక్‌వుడ్(53), కోర్న్‌వాల్(59) రాణించడంతో 228 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో నదీమ్ ఐదు, సిరాజ్, మార్కండే రెండేసి, దూబే ఓ వికెట్ తీసుకున్నారు. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ -ఏ... ఓపెనర్ పంచల్(49) సహా వృద్ధిమాన్ సాహా(66), శివం దూబే(71) రాణించడంతో 312 పరుగులు చేసి 84 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కోసం బరిలోకి దిగిన వెస్టిండీస్-ఏను మరోసారి నదీమ్(5/47) తీవ్రంగా దెబ్బకొట్టాడు. టాపార్డర్‌ను కుప్పకూల్చడం సహ ఐదు వికెట్లతో రెచ్చిపోయి మ్యాచ్ మొత్తం మీద పది వికెట్లు తీశాడు. అతడికి తోడు హైదరాబాదీ పేసర్ సిరాజ్ కూడా మూడు వికెట్లతో రెచ్చిపోవడంతో విండీస్-ఏ 180 పరుగులకే ఆలౌటై.. భారత్‌కు 97 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓవర్‌నైట్ స్కోరు 29/1తో ఆఖరి రోజు శనివారం ఛేదనకు దిగిన టీమ్‌ఇండియా 30 ఓవర్లలో 4 వికెటు కోల్పోయి విజయ్యానందుకుంది. మూడు టెస్టుల అనధికార సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

**సంక్షిప్త స్కోర్లు: వెస్టిండీస్ 'ఏ' తొలి ఇన్నింగ్స్:** 228 ఆలౌట్, **భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్:** 312 ఆలౌట్, **వెస్టిండీస్ 'ఏ' రెండో ఇన్నింగ్స్:** 180 ఆలౌట్, **భారత్ 'ఏ' రెండో ఇన్నింగ్స్:** 30 ఓవర్లలో 97/4(భరత్ 28, కార్న్‌వెల్ 2/18)

# కూలిన బాల్కనీ, స్విమ్మర్లకు గాయాలు

**గ్వాంగ్జు(దక్షిణకొరియా):** స్విమ్మింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ జరుగుతున్న గ్వాంగ్జు నగరంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అథ్లెట్స్ విలేజ్‌కు సమీపంలో ఉన్న ఓ నైట్‌క్లబ్‌లోని బాల్కనీ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు స్థానికులు మృతి చెందగా.. 16 మంది క్షతగాత్రులయ్యారు. గాయపడిన వారిలో రియో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, అమెరికా స్విమ్మర్ కలై గిల్‌క్రిస్ట్ సహా చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఎనిమిది మంది అథ్లెట్లు ఉన్నారు. గాయపడిన స్విమ్మర్లను హుటాహుటిన సమీప ఆస్పత్రులకు తరలించినట్టు అధికారులు తెలిపారు. క్లబ్‌లోని 16అడుగుల ఎత్తులో ఉన్న బాల్కనీ ఒక్కసారిగా కుప్పకూలడంతో అక్కడ ఉన్న వారు భయపడిపోయి పరుగెత్తారని పోలీసులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు స్థానికులు మృతి చెందగా.. మొత్తం 10మంది విదేశీయులు గాయపడ్డారని... వారిలో ఎనిమిది మంది స్విమ్మర్లేనని వెల్లడించారు.

# ధర్మసేనకు ఐసీసీ దన్ను



**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఫైనల్ చివరి ఓవర్లో ఓవర్‌త్రోకు ఐదుకు బదులు ఇంగ్లండ్‌కు ఆరు పరుగులు ఇచ్చిన అంపైర్ ధర్మసేనపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఐసీసీ మాత్రం ధర్మసేనను వెనకేసుకొచ్చింది. సరైన ప్రక్రియ ప్రకారమే అంపైర్లు ఆ నిర్ణయం తీసుకున్నారని శుక్రవారం పేర్కొంది. 'ఫీల్డర్ త్రో విసిరినప్పుడు బ్యాట్స్‌మెన్ క్రీజును దాటారా లేదా అనే విషయంపై ఆ మ్యాచ్ ఫీల్డ్ అంపైర్లే తీర్పునివ్వాలి. ఆ త్రో వేశాక అంపైర్లిద్దరూ చర్చించుకున్నారు. ఆ తర్వాతే నిర్ణయం వెలువరించారు. నిర్ణయం తీసుకునేందుకు వారు సరైన ప్రక్రియనే అవలంబించారు. సమీక్ష కోసం థర్డ్ అంపైర్‌ను సంప్రదించేందుకు అప్పటి పరిస్థితులు వారిని అనుమతించలేదు' అని ఐసీసీ జనరల్ మేనేజర్ జెఫ్ అలార్డైస్ అన్నారు. విశ్వటోర్నీ ఫైనల్ చివరి ఓవర్లో న్యూజిలాండ్ ఫీల్డర్ గప్టిల్ త్రో వేయడంతో... పరుగు పూర్తి చేసేందుకు డైవ్ చేసిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ స్టోక్స్ బ్యాట్‌కు బంతి తగిలి బౌండరీ చేరింది. దీంతో అంపైర్ ధర్మసేన ఇంగ్లండ్‌కు ఆరు పరుగులు ఇచ్చాడు. దీంతో ఆ మ్యాచ్ టై కావడం.. సూపర్ ఓవర్‌లోనూ స్కోర్లు సమం కావడంతో బౌండరీలు ఎక్కువ బాదిన ఇంగ్లండ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.



హ్యూస్టన్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## హ్యూస్టన్‌లో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవం

**యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శనివారం ఆమెరికాలోని హ్యూస్టన్ సిటీలో శ్రీజయరామనికేతన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలుగువారు ఒక సమూహంగా కల్యాణంలో పాల్గొన్నారు. యాదాద్రి దేవస్థానం ఉప ప్రధానార్చకులు వెంకటాచార్యులు, రంగాచార్యులు, అర్చకులు కిరణ్‌స్వామి కల్యాణ తంతును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రఘుబాబు, శ్రీజయరామనికేతన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తోపాటు ఆమెరికాలోని తెలుగు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలపై

## అనుచిత వ్యాఖ్యలు

నిందితుడిపై కేసు నమోదు

**అమరావతి, నమస్తే తెలంగాణ:** వైఎస్సార్సీపీ మహిళా ఎమ్మెల్యేలపై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలుచేసిన పునుగుపాటి రమేశ్‌పై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కేసు నమోదుచేశారు. మహిళా ఎమ్మెల్యేలను అగౌరవపరిచేలా పోస్టులు పెట్టారంటూ అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సెక్షన్లకింద కేసులు నమోదయ్యాయి.

## ఢిల్లీ విమానం అత్యవసర ల్యాండింగ్

న్యుమోనియాతో బాధపడుతున్న ఎన్నారై మృతి



రూపాల్ ఫైల్ ఫోటో

**శంషాబాద్:** కెన్యా నుంచి ఢిల్లీ వెళ్తున్న ప్రత్యేక విమానం శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. గుజరాత్‌కు చెందిన రూపాల్‌కుమారి, దినేశ్‌కుమార్ దంపతులు కెన్యాలో స్థిరపడ్డారు. న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్న రూపాల్‌కుమారి చికిత్స నిమిత్తం కెన్యా నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. హఠాత్తుగా రూపాల్‌కు తీవ్ర అస్వస్థతకు గురి కాగా మార్గమధ్యంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాన్ని అత్యవసరంగా దింపారు. ఎయిర్‌పోర్టులో దిగిన కొద్దిసేపటికి ఆమె మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# మన అవసరం.. జలచైతన్యం

ఊరికి చెరువే ఊపిరి.. పట్నానికి ఇంకుడుగుంతే ప్రాణం

వాటితోనే భూగర్భ జలాల రీచార్జ్.. ఆదర్శనీయంగా తుర్క్‌మెనిస్థాన్

ఎడారి దేశంలో నీటి చైతన్యం.. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజలకు వివరిస్తున్న సేవ్ ఫౌండేషన్





ఇంకుడుగుంత నమూనా చూపిస్తున్న సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయరాం

**శిరందాస్ ప్రవీణ్‌కుమార్**

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

పల్లెలకు చెరువులు ఊపిరిపోస్తే.. పట్టణప్రాంతాలకు ఇంకుడుగుంతలు భరోసానిస్తాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువులు పునరుద్ధరిస్తున్నది. పల్లెలు, పట్టణాలకు మిషన్ భగీరథ పేరుతో మంచినీరు సరఫరా చేస్తున్నది. దీనికి వ్యక్తిగత చైతన్యం కూడా తోడైతే.. భావితరాలు ఎలాంటి ఇబ్బందులకు గురికావని నిపుణులు చెప్తున్నారు. నీటి సంరక్షణ పద్ధతులను పట్టించుకోకపోవడంతో జలసమస్య రానురాను జటిలంగా మారుతున్నదని అంటున్నారు. ఈ పరిస్థితిని మార్చి.. ప్రతి ఒక్కరూ నీటి విలువను గుర్తించాలని, దిద్దుబాటు చర్యలకు పూనుకోవాలని సూచిస్తున్నారు. ఎవరికి సరిపడా నీళ్లను వాళ్లే సంపాదించుకోవాలంటున్న నిపుణులు.. వర్షపునీటిని దాచిపెట్టుకొనేందుకు ఇంకుడుగుంతలు చక్కటి పరిష్కారంగా సూచిస్తున్నారు.

### వాన చుక్క.. బంగారం

హైదరాబాద్ నగరాన్నే ఉదాహరణగా తీసుకుంటే.. జీహెచ్ఎంసీ పరిధిలో కోటిమందికి సరిపోయే నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ.. తీవ్రవర్షాభావ పరిస్థితులతో బోర్లు ఎండిపోయి, డిమాండ్ పెరుగుతున్నది. ఈ



ఇందిరాపార్కు దగ్గర వాన నీటి సంరక్షణ అవగాహన శిబిరం వద్ద ఇంకుడుగుంత ఆవశ్యకతను వివరిస్తున్న విజయరాం

పరిస్థితికి ఒక ముఖ్య కారణం భూగర్భ జలాల రీచార్జ్ లేకపోవడం. హైదరాబాద్ మహానగరంలో కురిసే ప్రతి వంద లీటర్ల నీటిలో భూమిలోకి ఇంకేది పది లీటర్లు మాత్రమే. మిగతాదంతా నాలాల ద్వారా నగరాన్ని విడిచివెళ్తున్నది. నగరీకరణలో భాగంగా కట్టడాలు, రహదారులతో వాననీళ్లు ఇంకే పరిస్థితే కనిపించడం లేదు. ప్రతిరోజూ బోర్లు వేస్తూ 24 గంటలూ లాగేస్తున్నారు. వాననీళ్లు భూమిలోకి వెళ్లేది వానలు కురిసే నాలుగునెలల కాలంలోనే.. పీల్చి పిప్పిచేసేది మాత్రం 12 నెలలు. ఎడారి దేశమైన తుర్క్‌మెనిస్థాన్ హైదరాబాద్‌లో 25 శాతమే ఉంటుంది. కానీ.. జనాభా మాత్రం రెట్టింపు. అయినా అక్కడి ప్రజలు నీటికి ఇబ్బంది పడటంలేదు. వర్షపు నీటిని అపురూపంగా పొదుపుచేస్తున్నారు. వాననీటి సంరక్షణ విషయంలో ఆ దేశ ప్రజలు 98 శాతం చైతన్యవంతులని సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకు విజయరాం 'నమస్తే తెలంగాణ'తో అన్నారు. ఆకాశంనుంచి జాలువారే ప్రతి నీటిబొట్టును భూగర్భంలో దాచిపెట్టి.. భూగర్భజలాలను రీచార్జ్ చేస్తున్నారు. ఇటువంటి పద్ధతులనే అనుసరిస్తే చెన్నైలో మాదిరిగా తాగునీటి సమస్య, ముంబై తరహా ముంపు, లాతూర్‌లా భూగర్భ జలాలు అంతరించిపోవడం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

### నీటి అవసరం ఎంత?

**ప్రతి మనిషికి రోజుకు : 120 లీటర్లు.**

**నలుగురుండే కుటుంబానికి : 600 లీటర్లు**

**ఒక్క కుటుంబానికి ఏడాదికి : 2,19,000 లీటర్లు**

**ఏటా ఒక్క చ.మీ. విస్తీర్ణంలో కురుస్తున్న వర్షం : 820 లీటర్లు**

సుమారు 250 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఇంటిపై ఏటా 2,45,000 లీటర్ల వర్షం కురుస్తున్నది. అంటే పట్టణప్రాంతాల్లో ఈ విస్తీర్ణం కలిగిన ఇండ్లు మూడు, నాలుగు అంతస్తుల్లో ఉంటున్నాయి. వాటిలో ఏడెనిమిది కుటుంబాలు నివసిస్తున్నాయి. దీన్నిబట్టి లోటును గుర్తించొచ్చు. అదికూడా పడిన పూర్తివర్షపు నీటిని సేకరిస్తే ఎంతమందికి సరిపోతుందో లెక్కించొచ్చు. కేవలం నలుగురికి సరిపోయే నీళ్లే. మరి మిగతా వాళ్లందరికి సరిపడా నీళ్లు ఎక్కడి నుంచి లాగేస్తున్నారో తెలుసు.

### సేవ్ సంస్థ సూచనలు

ప్రతి ఇంటిపై కురిసే వర్షపు నీటిని దాచిపెట్టాలి. తక్కువ నీటిని వినియోగించడం అలవాటు చేసుకోవాలి. బోర్లు, కుంటలు, చెరువులు కలుషితం కాకుండా కాపాడాలి.

స్నానానికి సబ్బులు, షాంపూలకు బదులు కుంకుడుకాయల రసం, బాత్‌పౌడర్లు వినియోగిస్తే భూగర్భ జలాలు కాలుష్యం బారినపడవు.

కూరగాయలు, పండ్లవ్యర్థాలనుంచి తయారుచేసిన బయో ఎంజైమ్స్‌ను ఇంటి, మరుగుదొడ్ల శుభ్రతకు వినియోగించాలి.

ప్రతి ఇంట్లో వర్షపు నీటి ట్యాంకులు, సంపులు తప్పనిసరి చేయాలి. వాననీటి సంరక్షణకు ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలి.

ప్రతి పొలంలో వర్షపు నీటి నిల్వకు చిన్న కుంటయినా ఉండాలి.

### వాననీటిని ఒడిసిపడుదాం

వాననీటిని ఒడిసిపడుదాం. భూగర్భ జలాలు పెంచుకుందాం. చెరువులను కాపాడుకుందాం. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరిచేద్దాం. ప్రతి పౌరుడు వాననీటిని పొదుపు చేయడాన్ని బాధ్యతగా గుర్తించాలి. అప్పుడే భూగర్భజలాల పెంపు సాధ్యం. భావితరాలకోసమేకాదు.. ఇప్పటితరానికి కూడా అనివార్యం. ఇంకుడుగుంతల అవసరంపై హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు దగ్గర నెలరోజులపాటు అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. రోజూ పదులసంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. వర్షపునీటిని సంరక్షించుకునే పద్ధతులను వివరిస్తున్నాం. వాననీటి పొదుపు, సంరక్షణలో తుర్క్‌మెనిస్థాన్ లాంటి ఎడారి దేశాలు అవలంబిస్తున్న విధానాలను, అక్కడి చైతన్యస్ఫూర్తిని మనం స్వీకరించాలి.

**- విజయరాం, వ్యవస్థాపకుడు, సేవ్ ఫౌండేషన్**

### వాననీటి సంరక్షణ మన బాధ్యతే



నీటిని వృథా చేయడం ప్రకృతిని ధ్వంసం చేయడమే. ఇంటింటికీ ఆర్వో ప్లాంట్లు పెట్టి 75% నీటిని డ్రైనేజీలో కలిపేస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి. నీటితోనే నాగరితక ఏర్పడింది. జీవనవిధానం విధ్వంసంకాక ముందే మేల్కొనాలి. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటుచేసుకోవాలి. ఉప్పల్‌లోని మా ఇంట్లో 2010లో బోరు ఎండిపోయింది. అదే ఏడాది దానిదగ్గరే ఇంకుడుగుంత ఏర్పాటుచేసినం. ఇప్పుడు ఉప్పల్‌లో చాలా బోర్లు ఎండిపోయినా మాకెలాంటి సమస్యరాలేదు. జీవరాశికి సరిపడా వర్షపు నీటిని ప్రకృతి ఇస్తుంది. దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనదే. ప్రతిపని ప్రభుత్వమే చేసేది కాదు. ప్రజలు బాధ్యతగా తీసుకోవాలి. ఇంటిపై పడిన ప్రతివర్షపు చుక్కను అక్కడే ఇంకేటట్లు చేసుకుంటే నీటికరువు ఉండదు. ఇంకుడుగుంతలను తప్పనిసరి చేస్తూ చట్టం తేవాలి.

**- రాజ్‌రెడ్డి మహాకళ, న్యాక్ డైరెక్టర్ (వాతావరణ మార్పు, సుస్థిర నగరాల పరిశోధన నిపుణుడు)**

ఐకార్, ఎన్డీఆర్ఐ ఎంట్రెన్స్ టెస్టుల్లో సిద్దిపేట వాసికి

## జాతీయస్థాయి ఫస్ట్ ర్యాంక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (భారత వ్యవసాయ పరిశోధన మండలి: ఐకార్ ) నిర్వహించిన నేషనల్ పీహెచ్‌డీ ఫుడ్ టెక్నాలజీ ప్రవేశ పరీక్ష, జాతీయ డెయిరీ పరిశోధన సంస్థ (ఎన్డీఆర్ఐ) నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో సిద్దిపేట జిల్లావాసి అచ్చిన పోశాద్రి సత్తాచాటారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన.. ఇటీవల విడుదలైన రెండు ప్రవేశ పరీక్షల్లోనూ జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. నంగునూర్ మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన పోశాద్రి.. 2007లో ఐకార్ నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలోనూ మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నారు. 2013లో ఐకార్‌లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పదేండ్లు వివిధ పరిశోధనలు చేశారు. పరిశోధనల ఫలితాలు అంతర్జాతీయ జర్నల్స్‌లోనూ ప్రచురితమయ్యాయి. పోశాద్రి ఇప్పటివరకు 25 పరిశోధన పత్రాలు, రెండు పుస్తకాలు రాశారు. ఆయన రాసిన 'హ్యాండ్ బుక్ ఫర్ ఫుడ్ టెక్నాలజీ'.. ఫుడ్ టెక్నాలజీ విభాగంలో ఎక్కువ విక్రయాలు జరిగిన పుస్తకంగా గుర్తింపు పొందింది. ఆహార శాస్త్రవేత్తగా 15 కొత్తతరహా ఆహార పదార్థాలను తయారు చేసిన ఘనత కూడా పోశాద్రి సొంతం. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించిన పోశాద్రిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. సిద్దిపేట వాసి మొదటి ర్యాంకు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్న ఆయన.. చంద్రయాన్-2లో సిద్దిపేటకు చెందిన సురేందర్ భాగస్వామి అయ్యారని గుర్తుచేశారు.



అచ్చిన పోశాద్రి (ఫైల్)

## కవ్వాల్‌లో జతకడుతున్న పెద్దపులులు

కలవరపడుతున్న అటవీశాఖ అధికారులు ● గాయపడిన కదంబ కోసం మళ్లీ అన్వేషణ

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పెద్దపులులు జతకడుతుండటం అటవీ అధికారులను కలవరానికి గురిచేస్తున్నది. వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి గాయపడిన పెద్దపులి కదంబకు మరో మగపులి దగ్గరవుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాగజ్‌నగర్‌లో ఫల్గుణ అనే పెద్దపులికి రెండేండ్ల కిందట జన్మించిన నాలుగు కూనల్లో ఒకటి కదంబ-4. ఏడాది క్రితం గాయపడిన దీనికి చికిత్స అందించడానికి ఏడాదిగా అటవీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు. చెన్నూరు అటవీ ప్రాంతంలో పులులు జతకడుతున్నట్టు వాటి గాండ్రింపుల ద్వారా అటవీ సిబ్బంది తెలుసుకొన్నారు. మగపులి చేరువ కాకముందే కదంబకు చికిత్స అందివ్వడానికి అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కదంబ-4 నడుం భాగంపై గాయమైనట్టు గత ఏడాది క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరా ట్రాప్‌ల ద్వారా చెన్నూర్ అటవీ డివిజన్ అధికారులు గుర్తించారు. పులిపై మత్తు మందు ప్రయోగించేందుకు అధునాతన ట్రాంక్విలైజర్ పరికరాలు, చెట్లపైనుంచి నిఘాకు ఫోల్డబుల్ మచాన్‌లు, వాకీటాకీలు తెప్పించారు. జంతువును ఎరగా వేసిన బోనులో ట్రాప్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవుతూ వచ్చాయి. చివరకు కెల్విన్ కెనిన్ అనే వలపు సెంట్‌ను ప్రయోగానికి కూడా అధికారులు సిద్ధపడ్డారు. ఇప్పుడు మగపులితో ప్రేమలో పడటంతో దాని ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న అధికారులు.. వీలైనంత త్వరగా దానిని బంధించి చికిత్స అందించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు.



కెమెరా ట్రాప్‌లో రికార్డయిన కదంబ-4 పెద్దపులి (ఫైల్)

## థర్మల్ పవర్ ప్లాంట్లలో భద్రత పెంచాలి

పరిశ్రమల యజమానులు, ప్రతినిధులకు అధికారుల సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** థర్మల్ పవర్ ప్లాంట్లలో భద్రతాచర్యలు చేపట్టాలని పరిశ్రమల యజమానులు, ప్రతినిధులకు అధికారులు సూచించారు. 'థర్మల్ పవర్‌ప్లాంట్లలో వృత్తిపరమైన ఆరోగ్యం - భద్రతాచర్యలు' అనే అంశంపై రెడ్‌హిల్స్‌లోని పెటాఫ్సీ భవనం సురానా ఆడిటోరియంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సమావేశంలో పరిశ్రమలు, ఉపాధి, కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శశాంక్, తెలంగాణ ఫ్యాక్టరీల డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్లు వై మోహన్‌బాబు, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, శశికుమార్, గంగాధర్‌రెడ్డితోపాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్లాంట్లలో ఎక్కువ వేడిని నియంత్రించడానికి, కార్మికుల ఆరోగ్యభద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తి అవగాహన కల్పించి వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు.



మార్కెట్లోకి డాక్టర్ నీమ్ అండ్ సెలోజియా, మిస్టర్ డార్లీ, మాకీ, డివైన్ కేర్ బ్రాండ్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అలయెన్జ్ ఎఫ్ఎంసీజీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్బీ ఠాకూర్, ఇంటర్‌కాంటినెంటల్ చైర్మన్ సీఎల్ రాజం తదితరులు

భారత మార్కెట్లోకి

## అలయెన్జ్ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు

తెలంగాణకు సూపర్ స్టాకిస్ట్‌గా 'ఇంటర్ కాంటినెంటల్'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేచురల్ పర్సనల్ కేర్, కాస్మెటిక్, ఫుడ్‌ప్రొడక్ట్స్ తయారీదారు అలయెన్జ్ ఎఫ్ఎంసీజీ.. భారత మార్కెట్లోకి డాక్టర్ నీమ్ అండ్ సెలోజియా, మిస్టర్ డార్లీ, మాకీ, డివైన్ కేర్ బ్రాండ్లను తీసుకొచ్చింది. మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో శనివారం రాత్రి వీటిని విడుదల చేసింది. తెలంగాణకు సూపర్ స్టాకిస్ట్‌గా 'ఇంటర్ కాంటినెంటల్'ను నియమించింది. ఈ సందర్భంగా అలయెన్జ్ ఎఫ్ఎంసీజీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్బీ ఠాకూర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన సహజసిద్ధ ఉత్పత్తులకు తెలంగాణలో డిమాండ్ పెరుగుతున్నదని, అందుకే సెలోజియా, డాక్టర్ నీమ్, మిస్టర్ డార్లీ, మాక్వి, డివైన్ కేర్ బ్రాండ్లను మార్కెట్లోకి తీసుకొచ్చామని అన్నారు. తమ ఉత్పత్తులను తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అలయెన్జ్ చైర్మన్ డాక్టర్ షకీబ్ ఎం రెహ్మాన్, డైరెక్టర్ ఆర్బీ ఠాకూర్, ఇంటర్‌కాంటినెంటల్ చైర్మన్ సీఎల్ రాజం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

## యూనియన్ అధ్యక్షురాలిగా భారతి

టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ప్రకటన



తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన నల్ల భారతిని అభినందిస్తున్న టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబు యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన నల్ల భారతిని నియమించినట్టు టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ చెప్పారు. శనివారం తెలంగాణభవన్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను గుర్తించి సీఎం కేసీఆర్ వేతనాలు పెంచారని గుర్తుచేశారు. సమావేశంలో టీఆర్ఎస్కేవీ ప్రధాన కార్యదర్శి నారాయణ, నాయకులు యువరాజు, లీలావతి, శిరీష, రజిత, పద్మావతి, సునీత, కల్యాణి, నజ్మా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ఉద్యోగ జాతర

లక్షా 28 వేల పైచిలుకు గ్రామ, వార్డు సచివాలయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు

నేటినుంచి ఆగస్టు పది వరకు దరఖాస్తుల స్వీకరణ

సెప్టెంబర్ ఒకటిన రాత పరీక్ష ● అక్టోబర్ రెండున విధుల్లోకి ఉద్యోగార్థులు

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూలేని విధంగా ఒకే విడుతలో లక్షా 28 వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన రెండు నోటిఫికేషన్లు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. గ్రామ సచివాలయాల్లో 13 విభాగాలల్లో 95,088 పోస్టులు, వార్డు సచివాలయాల్లో తొమ్మిది విభాగాలకు సంబంధించి 33,501 పోస్టులు భర్తీచేయనున్నారు. రాష్ట్రంలో కొత్తగా 11,114 గ్రామ సచివాలయాలు, 3,786 వార్డు సచివాలయాలు ఏర్పాటుకానున్నాయి. ఆయా ఉద్యోగాలకు అర్హులైన నిరుద్యోగుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేందుకు grama sachivalayam. ap. gov. in, vsws. ap. gov. in, ward sachivalayam. ap. gov. In అనే మూడు వెబ్‌సైట్లను సిద్ధంచేశారు. శనివారం నుంచి ఆగస్టు పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ ఒకటిన రాత పరీక్ష, సెప్టెంబర్ మూడోవారంలో ఫలితాల ప్రకటన, అదేనెల నాలుగోవారంలో నియామక పత్రాలు అందజేస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు అక్టోబర్ రెండున విధుల్లో చేరుతారు. వారికి రెండేండ్లపాటు ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. ఆ సమయంలో నెలకు రూ.15 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు. అనంతరం శాశ్వత పేస్కేలు వర్తింపజేస్తారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్లను చూడాల్సి ఉంటుంది.

సింగరేణి యువతకు

## ఉచిత ఆర్మీ నియామక శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి ప్రాంతానికి చెందిన 450 మంది యువతకు ఆర్మీ నియామకాల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అభ్యర్థులను ఎంపికచేసేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్‌రావు శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎంలను ఆదేశించారు. సింగరేణి ప్రాంతాల్లో మూడు ఉచిత కోచింగ్ శిబిరాలను ఏర్పాటు చేస్తామని చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఒక్కో శిబిరంలో 150 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. 29న బెల్లంపల్లి (గోలేటీ), రామగుండం, ఇల్లందులో, 30న మందమర్రి, రామగుండం-2, మణుగూరు ప్రాంతాలలో, 31న శ్రీరాంపూర్, భూపాలపల్లి, కార్పొరేట్, కొత్తగూడెం ప్రాంతాల్లో స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. 17 ఏండ్ల 6 నెలలు నిండి.. 23 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు, సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికుల పిల్లలు, సింగరేణి ప్రభావిత ప్రాంతాలవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎంలు, ఐఈడీలు, సివిల్, ఈఅండ్ఎం, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో 80 గ్రామాలకు రాకపోకలు బంద్

ఎడతెరిపి లేని వర్షాలతో కూలిన ప్రధాన వంతెన

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఏపీలోని విశాఖ జిల్లా ముంచుంగిపుట్టు మండలంలో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. శనివారం వర్షాలు మరింత ఎక్కువ కావడంతో కొండప్రాంతాల నుంచి నీరు ప్రవహించి లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదురు గ్రామ సమీపంలోని కాల్వ ఉప్పొంగింది. ఈ కాల్వపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. లక్ష్మీపురం, బుంగాపుట్టు రెండు పంచాయతీలకు చెందిన 30 గ్రామాలతోపాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన మరో 50 గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ఈ వంతెనే ప్రధాన ఆధారం. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



శనివారం బీఆర్కే భవన్ 8వ అంతస్తులో సచివాలయం ఏర్పాటుకు మరమ్మతు పనులు చేపడుతున్న కార్మికులు














నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం 28 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

రీల్‌లైఫ్‌లోనే కాదు రియల్‌లైఫ్‌లో రష్మిక మందన్న అల్లరి అమ్మాయే. గలగల జలపాతంలా సాగే ఆమె మాటల ప్రవాహంలో చిలిపితనం, హుషారుతో పాటు ఆత్మవిశ్వాసం కనిపిస్తాయి. చిరు మందహాసంలో సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే ధీమా గోచరిస్తుంది. చలాకీ తనంతోపాటు నటనపట్ల అంకితభావంతో అచిరకాలంలోనే దక్షిణాది ప్రేక్షకుల ఆరాధ్య కథానాయికగా మారిపోయిందీ సొగసరి. అల్లరి చేయడం తనకో వ్యసనంగా మారిపోయిందని అంటున్నది రష్మిక. ఆమె చెప్పిన మరిన్ని సరదా సంగతులివి.

# ఆ మాట ఎవరూ చెప్పలేదు



**'డియర్ కామ్రేడ్' చిత్రానికి ఎలాంటి స్పందన లభిస్తున్నది?**

తొలి నుంచి ఈ సినిమా విజయంపై నేను పూర్తి విశ్వాసంతో ఉన్నాను. నా కెరీర్‌లో ఇలాంటి గొప్ప సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఈ సినిమా రివ్యూస్ చదువుతూ హ్యాపీగా ఫీలవుతున్నాను. నేను పోషించిన లిల్లీ పాత్రతో బాగా కనెక్ట్ అయ్యామని ఎంతోమంది చెబుతున్నారు. తమ కథను తెరపై చూసుకున్న భావన కలిగిందనీ అంటున్నారు. మంచి మనుషులున్న గొప్ప టీమ్‌తో ప్రయాణం చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా విజయం నాపై మరింత బాధ్యత పెంచిందనుకుంటున్నాను.

**సెట్స్‌లో అల్లరి చేస్తుంటారా?**

అవునండీ. అల్లరి చేయడం వ్యసనంగా మారిపోయింది.

**అల్లరి తగ్గిస్తే మంచిదని ఎవరూ చెప్పలేదా?**

ఇప్పటివరకు ఆ మాట ఎవరూ చెప్పలేదు. ఎవరైనా అలా అంటారేమోనని నేనూ ఎదురు చూస్తున్నాను.

**తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. సినిమాల కారణంగా వ్యక్తిగత ఆనందాలకు దూరమవుతున్నాననే ఫీలింగ్ ఉందా?**

బిజీ లైఫ్ బాగుంది. విరామం లేకుండా పనిచేసే అవకాశం అందరికీ రాదు. షూటింగ్‌లో అడుగుపెడితే ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోతా. నా పాత్ర తప్ప ఏదీ గుర్తుకురాదు. అయితే సినిమాల వల్ల కుటుంబానికి దూరంగా ఉంటున్నాననే ఫీలింగ్ మాత్రం ఉంది. నా చెల్లెలి వయసు ఇప్పుడు ఏడేళ్లు. తనకు మూడేళ్లు ఉండగా నేను సినిమాల్లోకి వచ్చాను. షూటింగ్‌ల కారణంగా సోదరితో ఎక్కువ రోజులు గడిపే అవకాశం దొరకడం లేదు. చెల్లెలిని స్కూల్‌కు తీసుకెళ్లడం, తీసుకురావడం, పాఠశాల వార్షికోత్సవ వేడుకలు, అవార్డులు అందుకునే సందర్భాలు.. సోదరికి సంబంధించిన బాల్యపు మధుర జ్ఞాపకాలన్నింటినీ ప్రత్యక్షంగా చూడలేకపోతున్నాననే బాధ ఉంది. నా సినిమాలు బాగున్నాయని అమ్మానాన్నలతో సన్నిహితులు చెప్పినప్పుడు, 70 ఎం.ఎం. స్క్రీన్‌పై చెల్లెలు నా సినిమాల్ని చూస్తున్నప్పుడు వారి ముఖాల్లో కనిపించే సంతోషం ఆ బాధల్ని మరిపిస్తుంది.

> **స్క్రీన్‌పై చలాకీ అమ్మాయిగా కనిపించే రష్మిక రియల్‌లైఫ్‌లో ఎలా ఉంటుంది?**
>
> రీల్‌లైఫ్, రియల్‌లైఫ్‌లో ఒకేలా ఉంటాను. నాలో పెద్దగా తేడాలు కనిపించవు. నిజజీవితంలో నటించడం నాకు రాదు. ఇంట్లో ఉన్నప్పుడు సైలెంట్‌గా, బుద్ధిమంతురాలిగా ఉంటాను. గడపదాటి బయట అడుగుపెట్టగానే చిన్నపిల్లలా మారిపోతాను. స్నేహితులు, చుట్టుపక్కల మనుషులు ఉంటే నాలో తెలియని ఎనర్జీ వస్తుంది. సినిమాల్లో మాదిరిగానే అందరితో కలిసిపోయి సరదాగా ఉంటాను.

**షూటింగ్‌లలో హీరోలను ఆట పట్టిస్తుంటారా?**

సినిమా చిత్రీకరణల్లో హుషారుగా ఉంటాను. అసహనం, చిరాకు నాలో ఎప్పుడూ కనిపించవు. సెట్స్‌లో హీరోలతోపాటు ఇతర నటీనటుల్ని టీజ్ చేస్తుంటాను. నా అల్లరి భరించలేక ఏదో ఒకరోజు నన్ను ఎవరో ఒకరు కొడతారనే భయం ఉంది (నవ్వుతూ). నేను చేసే చిలిపి పనుల్ని అందరూ సరదాగానే తీసుకుంటారు.

**బాల్యంలోనూ ఇలాగే ఆట పట్టించేవారా?**

నా స్కూల్, కాలేజ్ డేస్ చాలా బోర్‌గా గడిచాయి. అప్పట్లో ముభావంగా ఉండేదాన్ని. ఇతరులతో పెద్దగా మాట్లాడేదాన్ని కాదు. అప్పుడు మిస్సయిన అల్లరంతా ఈ వయసులో ఇప్పుడే చేస్తున్నాను.

**మీరో పెద్ద హీరోయిన్ అని సోదరికి తెలుసా? మీ సినిమాలు చూస్తుంటుందా?**

చెల్లెలు నా సినిమాలకు పెద్ద అభిమాని. నేను నటించిన సినిమాలు, ట్రైలర్స్, సాంగ్స్ అన్నీ చూస్తుంటుంది. 'గీత గోవిందం'లోని 'ఏంటి, ఏంటి'.., 'వాట్ ద లైఫ్..', డియర్ కామ్రేడ్ లోని 'కడలల్లే..' పాటలంటే తనకు చాలా ఇష్టం. నాన్న గీతగోవిందం సినిమాలోని బ్రేకప్ సాంగ్ ఎక్కువగా వింటుంటారు.

**దక్షిణాది అత్యధిక పారితోషికం అందుకుంటున్న హీరోయిన్లలో మీరు ఒకరు కదా. ఆ డబ్బును సర్దుబాటు చేయడం ఎలాగో నేర్చుకున్నారా?**

డబ్బు ఎలా ఖర్చుపెట్టాలో, ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలియదు. అందుకే ఆర్థికపరమైన వ్యవహారాలన్నీ అమ్మానాన్నలకే అప్పగించాను. డబ్బుతో ముడిపడిన విషయాల్లో వారి సలహాలే తీసుకుంటాను. లగ్జరీల కంటే అత్యవసరాలకే నేను ఎక్కువ ప్రాముఖ్యమిస్తాను. హీరోయిన్‌గా డబ్బు, గుర్తింపు వచ్చాయని విలాసాల జోలికి వెళ్లను. పెద్ద కారు, ఖరీదైన బట్టల్లో కనిపించాలని అనుకోను. ఆడంబరాల కంటే కంఫర్టబుల్‌నెస్‌ను కోరుకుంటాను.

**హీరోయిన్‌గా మారిన తర్వాత మీ జీవనశైలిలో ఎలాంటి మార్పులు వచ్చాయి?**

నేను ఏం మారలేదు. స్నేహితులంతా అదే మాట చెబుతుంటారు. హీరోయిన్‌గా మారడానికి ముందు ఎలా ఉన్నానో ఇప్పటికీ అదే లైఫ్‌స్టయిల్ కొనసాగిస్తున్నాను. ఇంటికి వెళితే వెజిటెబుల్స్, స్నాక్స్ తీసుకురావడానికి షాప్‌కు వెళుతుంటాను.

**ఎక్కడికైనా వెళ్లినప్పుడు మిమ్మల్ని అందరూ గుర్తుపట్టి ఆటోగ్రాఫ్‌లు, ఫొటోగ్రాఫ్‌లు కావాలని అడుగుతుంటారు. అవన్నీ చూసినప్పుడు ఏమనిపిస్తుంది?**

చిత్రబృందం, బౌన్సర్స్ లేకుండా బయటకు వెళితే నన్ను ఎవరూ గుర్తుపట్టరు. తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో నటిస్తున్నాను, సినిమాల కోసం ఎంతో కష్టపడుతున్న నాకే ఎందుకు ఇలా జరుగుతుందోనని అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. ఆ సమయంలో ఎవరైనా దగ్గరకు వచ్చి మీరు రష్మిక మందన్న కదా అని అంటే హమ్మయ్య ఒక్కరైనా నన్ను గుర్తించారని సంతోషపడతాను. అయినా గుర్తింపు, పేరు కోసం ఆలోచించి నేను సినిమాల్లోకి రాలేదు. వాటిని పెద్దగా పట్టించుకోను.

**అందరూ మిమ్మల్ని బిజీ హీరోయిన్, స్టార్ కథానాయిక అని పిలుస్తున్నారు. అలాంటి మాటలు వింటున్నప్పుడు మీకు ఏమనిపిస్తుంది?**

నన్ను, నా నటనను ఇష్టపడుతున్నారు కాబట్టే అలా ప్రేమతో పిలుస్తున్నారు. అయితే స్టార్‌ననే భావన నాలో మాత్రం లేదు. ప్రతి సినిమాను తొలి చిత్రంగానే భావిస్తాను. కొత్తగా సినీ ప్రయాణం మొదలుపెట్టినట్లుగా సెట్స్‌లో అడుగుపెడతాను. సినిమాలు, నటన గురించి నాకు తెలిసింది తక్కువే. నేర్చుకోవాల్సిందే ఇంకా ఎంతో ఉంది. నంబర్‌వన్ స్థాయికి చేరుకోవడం సులభం కాదు. అందుకు ఎంతో కృషి, తపన అవసరం. ఆ ఆలోచన ప్రతిక్షణం నా మనసులో పెట్టుకొనే నటిస్తాను.

**'కిరిక్ పార్టీ' నుంచి 'డియర్ కామ్రేడ్' వరకు సినీ ప్రయాణంలో ఏం నేర్చుకున్నారు?**

ఈ ప్రయాణంలో నటిగా నాలో పరిణతి వచ్చింది. యాక్టింగ్ మెరుగుపరుచుకున్నాను. ఓ పాత్రకు తగినట్లుగా హావభావాలు, భావోద్వేగాల్ని ఎలా పలికించాలో, కెమెరా ముందు ఎలా ఉండాలో అర్థమైంది.

> **విరామం దొరికితే ఏం చేస్తారు?**
>
> షూటింగ్ లేకపోతే బోర్ కొడుతుంది. ఎవరో ఒకరు షూటింగ్‌కు రమ్మని పిలువవచ్చుగా.. ఒక రోజు వృథా అయిపోతుందే అని బాధపడుతుంటాను. షూటింగ్ ఉంటే ఆరు గంటలకే నా దినచర్య ప్రారంభమవుతుంది. షూటింగ్ లేని రోజు మాత్రం ఉదయం పదకొండు గంటల వరకు నిద్రపోతాను. ఆ తర్వాత కొద్దిసేపు జిమ్ చేసి మళ్లీ పడుకుంటాను. సమయం దొరికితే టీవీ చూస్తాను.
>
> **సినిమాల కోసం కష్టపడడం అవసరమా అని ఎప్పుడైనా అనిపిస్తుందా?**
>
> సినిమాల్లో ప్రతి రోజు కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు. విభిన్నమైన పాత్రలు, సన్నివేశాల్లో నటించే అవకాశం దొరుకుతుంది. రోజుకో కొత్త జీవితాన్ని దర్శించిన అనుభూతి కలుగుతుంది. అందుకే బోర్ అనే ఫీలింగ్ ఎప్పుడూ కలగదు.



**ఈమధ్య చాలా సినిమాల్ని తిరస్కరించారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఓ సినిమా చేయనని చెప్పడం సులభమని అనుకుంటున్నారా?**

నమ్మకంతో నన్ను వెతుక్కుంటూ వచ్చిన వారికి సినిమా చేయనని డైరెక్ట్‌గా చెప్పడం బాధాకరమే. కథ నచ్చకపోయినా మొహమాటం కోసం సినిమా చేస్తే నాతో పాటు దర్శకనిర్మాతలు నష్టపోతారు. అలాకాకుండా నటించనని చెప్పడం వల్ల ఎదుటి వారి డబ్బు, కాలం ఆదా అవుతాయి. వారితో పాటు నా కెరీర్‌కూ నష్టం జరగదు. అందుకే బాధ కలిగినా నాదగ్గరకు వచ్చే వారికి అర్థమయ్యేలా చెప్తా.

**సామాజిక సమస్యలపై స్పందిస్తుంటారా?**

సమాజంలో ఎన్నో సమస్యలున్నాయి. ప్రాణాల్ని కాపాడుకోవడానికి హాస్పిటల్స్ కోసం కిలోమీటర్లు ప్రయాణం చేసే పరిస్థితులున్నాయి. అలాంటి వార్తలు చదివినప్పుడు బాధ అనిపిస్తుంది. పదేండ్ల తర్వాత నీరు దొరకదనే మాటలు వింటున్నప్పుడు భయం కలుగుతుంది. వ్యవస్థలో మార్పు రావాలనే తలంపుతో సామాజిక సమస్యలపై నా వంతుగా స్పందిస్తాను.

... నరేష్ నెల్కి
సీఎం ప్రవీణ్‌కుమార్




## వంటింటి చిట్కాలు

- అరటికాయ కట్ చేసేటప్పుడు చేతులకు జిడ్డు అంటుకోకుండా ముందుగానే చేతికి నూనె రాసుకోవాలి.
- ఊరగాయలు ప్లాస్టిక్ డబ్బాలో స్టోర్ చేసే ముందు డబ్బాకు కొద్దిగా కాచి చల్లార్చిన నూనె పూసి భద్రపర్చుకోవాలి.
- పచ్చి బఠానీలు ఫ్రెష్‌గా ఉండాలంటే కవర్‌కు చిన్న చిన్న హోల్స్ చేసి ఫ్రిజ్‌లో దాచాలి.
- కొత్తమీర వేర్లు కట్ చేసి ఒక ప్లాస్టిక్ కవర్లో భద్రపర్చుకుంటే కుళ్లిపోకుండా ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.
- కాఫీ పౌడర్ కొద్దిగా వాడిన తర్వాత ఆ ప్యాకెట్‌ను ఒక ప్లాస్టిక్ బాక్స్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు గడ్డ కట్టకుండా ఉంటుంది.
- ఉప్పు డబ్బా మూతను తప్పక మూసి ఉంచాలి. లేదంటే అందులోని లవణాలు పోతాయి.
- బొద్దింకలు వచ్చే ప్రదేశంలో వెల్లుల్లి రెబ్బల్ని దంచి నీటిలో కలిపి పెట్టాలి. ముఖ్యంగా సింక్ పైప్ దగ్గర పెట్టండి.





## డిటెక్టివ్ భావన పలివాల్

**ఆడపిల్లలకు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనడానికి ఈ సాహస నారీ ఉదాహరణ. అత్యంత ధైర్య సాహసాలతో సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై పోరాడుతున్నదీ డిటెక్టివ్. తప్పు చేసిన వారికి శిక్షపడేలా చేస్తూ తన వంతుగా సమాజానికి మేలు చేస్తున్నది.**

ఆగ్రాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన భావన పలివాల్ ప్రైవేటు డిటెక్టివ్‌గా పనిచేస్తున్నది. ఆమె సోదరుడు ఐఏఎస్ ఆఫీసర్, మామయ్య సీబీఐ అధికారిగా పని చేస్తున్నారు. ఎంతో ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చిన భావనకు ఇంట్లోనే దురాచారాల బాధ తప్పలేదు. ఏదైనా సాధించి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచన ఆమెకు చిన్నప్పటి నుంచీ ఉండేది. దానిని నిజం చేసుకోవడానికి నిత్యం ప్రయత్నాలు చేసేది. ఆమె ప్రయత్నాలకు కుటుంబసభ్యులు ఆటంకం కలిగించేవారు. ఆడపిల్ల జీన్స్, టీ షర్ట్ వేసుకోకూడదంటూ ఆమెకు ఆంక్షలు విధించే వాళ్లు. కుటుంబసభ్యుల తీరు నచ్చక భావన 12 ఏండ్ల వయసులోనే ఇంట్లో నుంచి బయటకు వచ్చేసింది. ఢిల్లీ యూనివర్సిటీలో జర్నలిజం కోర్సు చేసి కొన్నాళ్లు ఓ దినపత్రికలో పాత్రికేయురాలిగా పని చేసింది. జర్నలిస్టుగా భావన ఎన్నో రహస్యాలను బట్టబయలు చేసింది. ఓ రోజు దినపత్రికలో డిటెక్టివ్ కావలెనని ప్రకటన ప్రచురితమయింది. భావన ఆ ప్రకటన చూసి ఇంటర్వ్యూ కోసం వెళ్లింది. జర్నలిస్టుగా పని చేసిన ఆమె అనుభవం అక్కడ బాగా పనికొచ్చింది. అప్పుడు జర్నలిస్టు ఉద్యోగాన్ని వదిలేసి డిటెక్టివ్‌గా బాధ్యతలు చేపట్టింది. పలు నగరాల్లో అమ్మాయిల అక్రమ రవాణా చేసే ముఠాను పోలీసులకు పట్టించి శిక్షపడేలా చేసింది. రౌడీ మూకలు ఆమెను ఎన్నోసార్లు చంపేస్తామని బెదిరించారు. అయినా సరే ఏమాత్రం భయపడకుండా ఎంతో ధైర్యంగా వారిని ఎదుర్కొన్నది. రహస్యాలను బట్టబయలు చేయడానికి భావన మారువేషాల్లోనూ తిరిగి అక్రమార్కుల దుర్మార్గాలను బహిర్గతం చేస్తున్నది. ప్రస్తుతం సొంతంగా డిటెక్టివ్ ఏజెన్సీని ఏర్పాటు చేసి, అక్రమార్కుల పాలిట యముడిలా మారింది.

II.
నమస్తే తెలంగాణ
సింగిడి
[ కరీంనగర్ ]
ఆదివారం 28 జూలై 2019

## ఈ వాచ్‌తో ఓ బ్యాచ్ సెటిలవుద్ది!




డాడీ వాచ్ కావాలి అంటే ఓ 500 రూపాయలు ఇస్తారు. అదే జాబ్ ఉంటే వెయ్యి రూపాయిలు పెట్టి కొనుక్కుంటాం. కొంచెం రిచ్ ఫ్యామిలీలో పుడితే రూ.5వేలు పెట్టి కొనుక్కుంటాం. కానీ అర్జున్ కపూర్ మాత్రం ఏకంగా రూ.27 లక్షల వాచ్ కొన్నాడు. ఇటీవల న్యూయార్క్ వెళ్లిన అర్జున్‌కపూర్ తన ఫొటోగ్రాఫ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఫొటోలో అర్జున్ లుక్ కంటే ఆయన చేతికి ఉన్న వాచీనే సోషల్ మీడియా ఎక్కువ ఫోకస్ చేసింది. అర్జున్ చేతికి ఉన్న రోలెక్స్ ట్రెండీ మోడల్ వాచ్ ధర రూ.27 లక్షలు. వాచ్ ధరించి అందరి దృష్టినీ తనవైపుకు తిప్పుకున్నాడు అర్జున్. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ఫొటో వైరల్ అయ్యింది. ఖరీదైన దుస్తులు, బ్యాగులతో ఆకట్టుకోవడంలో బాలీవుడ్ భామలే కాదు.. తామూ తీసిపోమని హీరోలు సైతం నిరూపిస్తున్నారు.

## మనసున్న డాక్టర్




ఉదయ్‌భాను రాణా.. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన డాక్టర్. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. పక్కవాడికి పది రూపాయలు ఇవ్వాలంటేనే ఆలోచించే ఈ రోజుల్లో.. డాక్టర్ రాణా రూ.10 లక్షల ఖర్చుతో టీఎల్‌హెచ్ సర్జరీల కోసం యంత్రాలను కొనుగోలు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలోని జోనల్ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు రాణా. ప్రభుత్వ డాక్టరే అయినా తన సొంత ఖర్చులతో ఆపరేషన్లకు కావాల్సిన వస్తు సామగ్రిని, యంత్రాలను తానే కొనుగోలు చేస్తున్నారు. రాణా దగ్గరకు వచ్చే రోగులు, ముఖ్యంగా మహిళలు నిరుపేదలే. వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే ఆపరేషన్ల పేరుతో లక్షల రూపాయలు గుంజుతున్నారు. దీంతో డాక్టర్ రాణానే సొంతంగా ఆపరేషన్ యంత్రాలను, పరికరాలను కొనుగోలు చేసి, ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. డాక్టర్ ఉదయ్‌భాను రాణా చేస్తున్న సేవలను పలువురు కొనియాడుతున్నారు.

## మురికి షూ రూ.3 కోట్లు!

ఇంతలా మురికిపట్టిన షూలు రూ.3 కోట్లా? ఇటీవల న్యూయార్క్‌లో సోథెబే సంస్థ నిర్వహించిన వేలం పాటలో ఈ షూలు 4,37,500 డాలర్ల (రూ.3.01 కోట్లు)కు అమ్ముడుపోయాయి. నైక్ సంస్థ తయారుచేసిన ఈ 'మూన్ షూ'లను కెనడాకు చెందిన వస్తుసేకరణ కర్త మిల్స్ నాదల్ కొనుగోలు చేశాడు. ఈ సందర్భంగా వేలం పాట నిర్వాహకులు మాట్లాడుతూ.. 'ఆన్‌లైన్ వేలంలో మూన్ షూస్ 1,60,000 డాలర్ల వరకు అమ్ముడవుతుందని భావించాం. అయితే, నాదల్ మూడింతల ధరతో ఆ షూలను దక్కించుకున్నారు. నైక్ షూ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్ బవర్‌మ్యాన్ 1972లో ఒలింపిక్ క్రీడాకారుల కోసం ప్రయోగాత్మకంగా 12 జతల మూన్ షూలను తయారు చేశారు. నాదల్ సొంతం చేసుకున్న షూలు కూడా వాటిలో ఒక జత. ఆ 12 జతల షూలలో ఇది మాత్రమే మిగిలింది' అని తెలిపారు. షూలు ఇంత ధరకు అమ్ముడుపోవడం ఇదే తొలిసారి కాదు. 1984 ఒలింపిక్ బాస్కెట్ బాల్ ఫైనల్స్‌లో పాల్గొన్న ఆటగాడు మైకెల్ జోర్డాన్ వేసుకున్న షూలను 2017లో వేలం వేయగా 1,90,373 డాలర్లు పలకడం గమనార్హం.



## అదిరిపోయే డిజిటల్ ఆర్ట్



కొన్నిసార్లు మనం ఎంత ఎక్కువ టైం తీసుకొని వర్క్ చేసినా పూర్తవ్వదు. కానీ ఒక్కోసారి తక్కువ టైంలోనే అదిరిపోయే అవుట్‌పుట్ వస్తుంది. ఇక చిత్రకారులైతే చాలా ఎక్కువ సమయం తీసుకుంటారు. అందుకే అద్భుతమైన బొమ్మలను గీస్తుంటారు. కానీ ఒంగోలుకు చెందిన డిజిటల్ ఆర్టిస్టు మాత్రం.. చాలా తక్కువ టైంలోనే అదిరిపోయే పెయింట్ గీసిస్తాడు. ఇతని పేరు నరేశ్ రావులపల్లి. నరేశ్ గీసే ఆర్టులు చాలా సింపుల్‌గా ఉంటాయి. కళకారులు కుంచెతో కుస్తీపడితే.. ఈ డిజిటల్ ఆర్టిస్టు మాత్రం మౌస్‌తో మజా చేస్తాడు. నరేశ్ గీసిన ధోనీ, వెంకీ మామా పోస్టర్, ఇస్మార్ట్ శంకర్, మహర్షి పోస్టర్, యూసుఫ్ పఠాన్ పోస్టర్లు చాలా ఫేమస్ అయ్యాయి. ఇక విరాట్ కోహ్లీ, రజనీ కాంత్, బాలకృష్ణ, రవితేజ వంటి ప్రముఖుల చిత్రాలు డిజిటల్ ఆర్ట్‌తో రూపొందించాడు. తన ప్రతిభతో అన్ని హిట్ చిత్రాల పోస్టర్లు, హీరోల బొమ్మలను మౌస్‌తో గీస్తూ.. నలుగురిలో ప్రత్యేకంగా నిలుస్తున్నాడు నరేశ్ రావులపల్లి.



## తల్లిలేని లోటు తీరింది..

తల్లిదండ్రుల ఎదుట గ్రాడ్యుయేషన్ పట్టా అందుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. తమ ఆనందంలో వారూ భాగస్వాములు కావాలని భావిస్తారు. ఓ యువకుడు ఇదే భావించాడు. అయితే, తల్లి చనిపోవడం వల్ల తనకు ఆ అదృష్టం లేదని భావించాడు. దీంతో తల్లి లైఫ్‌సైజ్ కటౌట్‌ను తన వెంట తెచ్చుకున్నాడు. ఆ కటౌట్‌తోనే గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నాడు. అలిసాంగ్ అనే విద్యార్థి ఈ విధంగా తల్లిలేని లోటును పూడ్చుకున్నాడు. ఫిలిప్పీన్స్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పట్టా అందుకొనేప్పుడు తన తల్లి పక్కన ఉండాలని కోరుకున్నాడు. అయితే, అతడి తల్లి 2016లో అనారోగ్యంతో చనిపోయింది. గ్రాడ్యుయేషన్ వేడుక రోజు అతని పిన తండ్రి కూడా అందుబాటులో లేడు. దీంతో అలిసాంగ్ తన తల్లి కటౌట్‌తోనే వేడుకలో పాల్గొన్నాడు. అనంతరం ఆ ఫొటోను ట్విట్టర్‌లో పోస్టు చేస్తూ 'అమ్మా, నువ్వు కోరుకున్నట్లే గ్రాడ్యుయేషన్ చేశాను. నువ్వు సంతోషిస్తావని భావిస్తున్నాను' అని తెలిపాడు. ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





నటుడు కావాలని ఆరో తరగతిలో పడిన బీజం అతనితో పాటే ఎదుగుతూ వచ్చింది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగిన బాల్యం.. తనలోని టాలెంట్‌ను నిరూపించుకోమని ప్రోత్సహించింది. రేడియో జాకీగా దేశం కానీ దేశంలో అడుగు పెట్టినా.. సిల్వర్‌స్క్రీన్‌పై కనపడాలనే కోరిక తిరిగి స్వదేశానికి రప్పించింది. ఇంటగెలిచి రచ్చగెలవాలని వినాయక మండప వేదికలపై పండించిన హాస్యం 'జబర్దస్త్'గా బుల్లితెరపై నవ్వుల పువ్వులు పూయించింది. కడుపుబ్బ నవ్వించే కామెడీ స్కిట్లతో 'రచ్చ' చేసి వెండితెర మీదా వెలిగేలా చేసింది. ఒక్కోమెట్టు ఎక్కుతూ విజయావకాశాలను అందిపుచ్చుకుంటూ జనం మెచ్చే నటుడిగా ఎదిగాడు రచ్చ రవి. సింగిడిలోని రంగుల్లా తనలోని భిన్న పార్శ్వాలను పంచుకున్నారు.



# ఇంటు గెలిచా.. రచ్చ గెలుస్తా!

"తన కళారంగ ప్రస్థానంలో అప్పుడప్పుడే ఎదుగుతున్న వేళ.. వినాయక చవితికి వరంగల్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు రవి. వందలాది మంది ప్రేక్షకులు ఉంటారని ఆశించాడు. కానీ ఆరోజు ఆ కార్యక్రమానికి వచ్చింది ఒకే ఒక ప్రేక్షకుడు. అయినా వెనకడుగు వేయలేదు. వచ్చిన ఒక్క ప్రేక్షకుడిని హాస్యంతో మెప్పించి, నవ్వించాడు. మరో కార్యక్రమంలో వేలాది మంది ప్రేక్షకుల మధ్య తన హాస్యచతురతను ప్రదర్శించి 'శెభాష్' అనిపించుకున్నాడు. ఒక్కడైనా, వేలాదిమందైనా.. ప్రేక్షకులను నవ్వించడమే కళాకారుడి విధి అంటాడు రచ్చ రవి. మిమిక్రీ ఆర్టిస్టుగా స్టేజీషోలు చేసేస్థాయి నుంచి వెండితెర మీద వెలిగే క్రమం వరకూ తాను చేసిన 'రచ్చ' అంతాఇంతా కాదంటాడు. ఆ విశేషాలేంటో అతని మాటల్లోనే తెలుసుకుందాం.

### వన్స్‌మోర్ ప్లీజ్‌తో..

మాది వరంగల్. చిన్నతనం నుండే వినాయకచవితి వస్తే మండపాల వేదికలపై మిమిక్రీ, ఇతర నటనలను ప్రదర్శించే అవకాశం కలిగింది. ఆరో తరగతి నుండే నటుడు కావాలన్న కోరిక బలంగా నాటుకుపోయింది. సినిమా అవకాశాల కోసం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన నేను.. అవకాశాల కోసం ఎక్కని ఆఫీసు మెట్టు లేదు, తిరగని స్టూడియో లేదు. అలా జెమినీ టీవీలో 'వన్స్‌మోర్ ప్లీజ్'లో చేసే అవకాశం వచ్చింది. అందులో మిమిక్రీ ప్రదర్శనకు మంచి గుర్తింపు వచ్చింది. సినిమాల్లోకి పోతే ఎక్కడ చెడిపోతానేమోనని మా నాన్న తిరిగి నన్ను వరంగల్ తీసుకెళ్లి.. మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగంలో పెట్టించాడు. పనిచేస్తున్నానే కానీ నా మనసంతా సినిమాల చుట్టే తిరుగుతూ ఉండేది. స్నేహితుల సలహా మేరకు ఉద్యోగం చేస్తూనే ప్రతి ఆదివారం హైదరాబాద్‌లో వాలిపోయే వాణ్ని. అందరిలా కాకుండా నెలల్ని గంటలుగా, రోజుల్ని నిమిషాలుగా, గంటల్ని సెకండ్లుగా విభజించుకుని అవకాశాల కోసం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను.

### దుబాయ్‌లో రేడియోజాకీ..

సినిమా అవకాశాల కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే దుబాయ్‌లో రేడియో జాకీగా అవకాశం వచ్చింది. మున్సిపల్ ఉద్యోగం వదిలేసి వెళ్లాను. 'నవ్వుల నల్లబాలు తెల్ల పాలలెక్క' తెల్లపాలు ఎంత స్వచ్ఛమైనవో, ఈ నల్లబాలు అంత మంచోడు' అంటూ తొలిసారి దుబాయ్ ప్రజలను పరిచయం చేసుకున్న. తక్కువ సమయంలోనే క్లిక్ అయ్యా. 'బెస్ట్ ఆర్‌జే' ఆవార్డు కూడా అందుకున్న. అదే సమయంలో షూటింగ్ కోసం ఓ సినిమా యూనిట్ అక్కడికి వచ్చింది. అవకాశం కోసం ప్రయత్నించా. అయితే 'రేడియోవారు సినిమాకు పనికి రారు' అన్నారు. దీంతో వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసి ఇండియా వచ్చా. తర్వాత చాలా స్ట్రగుల్ అయ్యా. నటుడిగా అవకాశం రాకపోయినా మిత్రుడి టెలివిజన్ షోలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. నటీనటులను చూసి ఏ సందర్భంలో ఎలా నటించాలో అబ్జర్వ్ చేశా.

### జబర్దస్త్‌లో అవకాశం

ఒక మిత్రుడు ఇచ్చిన సమాచారంతో ఈటీవీలో జబర్దస్త్ ప్రచారం అవుతుందని తెలుసుకుని టీం లీడర్ చంద్రను కలిశాను. అలా స్కిట్‌లో బ్లైండ్ ఆర్టిస్ట్‌గా చేసే తొలి అవకాశం వచ్చింది. 'సిరివెన్నెల హరి' అనే పాత్రలో గుడ్డివాడిగా చేసిన యాక్షన్.. నాకు ఎంతో గుర్తింపు తెచ్చింది. తొలి ప్రదర్శనలోనే నాగబాబు నన్ను నిజంగానే గుడ్డివాడే అనుకున్నారు. అలా లేడీ, ఇన్నోసెంట్.. అంటూ అన్నిరకాల క్యారెక్టర్లు చేయగలిగా. నాలోని నటనే నన్ను జబర్దస్త్ టీం లీడర్‌ను చేశాయి. నటుడు అనే ప్రయాణంలో 'జబర్దస్త్' కామెడీ షో ఓ చెట్టులా నీడనిచ్చింది.. సేదతీర్చింది. అంతేకాదు.. ఓ అమ్మలా ఆదరించింది. నటుడిగా అడుగులు ముందుకు సాగేలా వెన్నుతట్టి ప్రోత్సహించింది. నేను స్టేజీ ఆర్టిస్ట్, రేడియోజాకీ, టెలివిజన్, సినిమా ఇలా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చా. అయితే సినిమా, టీవీ రెండూ నాకు ముఖ్యమే. దేనికీ దూరం కాను.

### వెండితెరపై తొలి అడుగు

నా కలను నెరవేర్చుకోవాలంటే సరైన వేదిక సిల్వర్‌స్క్రీన్ అని నమ్మిన. అలా తేజ '1000 అబద్ధాలు' చిత్రంలో తొలి అవకాశాన్ని ఇచ్చి ప్రోత్సహించారు. తర్వాత శతమానం భవతి, ఖైదీ నెం.150, సర్దార్ గబ్బర్‌సింగ్, నాని ఎంసీఏ, ఒక్క క్షణం, నేనే రాజు నేనే మంత్రి, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, శ్రీనివాస కళ్యాణం. ఎఫ్-2 తదితర 50 సినిమాల వరకు చేశాను. ఇప్పుడు మహేష్‌బాబుతో ఓ చిత్రం, శ్రీకాంత్ హీరోగా కోతల రాయుడు సినిమాతో పాటు మరికొన్ని చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. కేవలం తెలుగే కాదు హిందీ, ఇంగ్లీష్‌లోనూ నటించాలన్నదే నా లక్ష్యం. నాకున్న అనుభవంతో బాలీవుడ్‌లో ప్రయత్నించాలనుకుంటున్న. ఎందుకంటే తెలుగోడి వాయిస్, తెలుగోడి బొమ్మ ప్రపంచానికి తెలియజేయాలన్నదే నా గోల్.

### ప్రభుత్వం గుర్తించింది

రాష్ట్ర ప్రభుత్వ స్ఫూర్తితో జమ్మి చెట్లను ఊరూరా పెట్టాను. ఈ ఏడాది కూడా అన్ని ప్రాంతాల్లో జమ్మిచెట్లను నాటడానికి నర్సరీలో మొక్కలు పెంచిస్తున్నాను. నా కార్యక్రమాలను చూసి బిగ్ ఎఫ్ఎం వాళ్లు 'తెలంగాణ ప్రైడ్ అవార్డు'ను అందజేసి నా బాధ్యతను మరింత పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించి, ప్రోత్సహించి నన్ను 'ఆయుష్షు బోర్డు'కు ప్రమోటర్‌ను చేసింది. మనవల్ల మంచి జరుగుతుందంటే నా వంతు సహకారాన్ని అందిస్తా.



### సామాజిక సేవలో...

సమాజంలో మార్పుకోసం అనేక మంది ప్రయత్నిస్తున్నారు. అయితే అది ఒక నటుడైతే ప్రజల్లోకి త్వరగా వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకే నాకు సాధ్యమైనంత వరకు సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్న. నేను రక్తదానం చేయమని నలుగురికి చెబుతున్నా. అలా వారికి చెప్పే ముందు నేను కూడా రక్తం ఇస్తున్నా. దాంతో వాళ్లలో చైతన్యం కలిగి ఇలాంటి విషయాల్లో ముందుకు వస్తూ భాగస్వాములు అవుతున్నారు. అలా సాయం అందించే చేతులకు నేనెప్పుడూ మొక్కుతూనే ఉంటా. మనం ఇచ్చే రక్తం ద్వారా ఓ పేషెంట్ బతుకుతున్నాడంటే అంతకంటే ఆనందం మరొకటి ఉంటుందా?

### చివరిగా..

అమ్మ.. హైదరాబాద్.. సినిమా. ఇవి మూడింటి మీద నాకు చాలా నమ్మకం. ఎందుకంటే ఆకలితో ఉంటే అమ్మ అన్నం పెడుతుంది. హైదరాబాద్‌కు ఎవరూ వచ్చిన ఏదో ఒక పని చూపించి ఆదరిస్తుంది. సినిమా కూడా అంతే! కష్టపడితే ఫలితం ఉంటుంది. నటుడికి ఎల్లలులేవు. ఎక్కడైనా తెలుగువాడి సత్తాచాటాలి. నటుడికి భాషా ప్రాంతీయ భేదాలు ఉండొద్దు. కామెడీ విలన్ కావాలన్నది నా లక్ష్యం. ఒకే క్యారెక్టర్‌తో ఒక లక్షమందిని నటనతో ఏడిపించాలన్నదే నా కోరిక. నన్ను బుల్లితెరపై కామెడీ షోతో ఎలా ఆదరించారో.. వెండితెరపై కూడా అలానే ఆదరించి ఆశీస్సులు అందజేస్తారని కోరుకుంటున్నా.

...మధుకర్ వైద్యుల
గడసంతల శ్రీనివాస్

## నవ్వే పరమౌషధం

తమ విచిత్ర వేషధారణతో ఎంతటి వారినైనా నవ్వించడమే వీరి పని. మొండి రోగాలతో అనునిత్యం సతమతమయ్యే వారి ముఖాల్లో ఓ క్షణమైనా ఆనందాన్ని కలిగించడమే వీరి ఆశయం. ఎందుకంటే నవ్వులోనే ఆనందం ఉంది. అలాంటి ఆనందమైన జీవితానికి దూరమైన వారి ముఖాల్లో నవ్వులు పూయిస్తున్నారు ఈ కొత్త డాక్టర్లు. అలాగని వీరు వైద్యులు కారు. నవ్వు అనే మందు వేసి రోగాన్ని నయం చేసే నయా డాక్టర్లు. ఆస్పత్రుల్లో బాధలతో ఉన్న వారిని నవ్విస్తుంటారు ఈ 'క్లౌన్ థెరపిస్టులు'. ఇలా నవ్వించడమే వృత్తిగా మార్చుకున్నారు. ఇది పూర్తిగా మానసికమైనదే. ఢిల్లీ, బెంగళూరులలో అనేక ఆసుపత్రులను సందర్శించే ఈ బృందం.. కొన్ని క్షణాలపాటైనా తమ హావభావాలతో, విచిత్ర వేషధారణతో రోగుల ముఖాల్లో ఎనలేని ఆనందాన్ని కలిగిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చిన్నారుల ముఖాల్లో నవ్వుల పువ్వులు పూయించారు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలతో నిస్సారమైన జీవితాన్ని గడిపే రోగులకు వీరి రాక సంతోషాన్నిస్తుంది. ఇది ఒక రకంగా చికిత్సే. ఆయితే మానసికమైంది. కొన్ని క్షణాలపాటైనా తాము రోగులం అన్న బాధ, భావన నుంచి వారికి ఉపశమనాన్ని కలిగించేదే క్లౌన్ థెరపీ. ఇటీవల ఢిల్లీలోని చాచా నెహ్రూ బాల చికిత్సాలయంలోని క్యాన్సర్ వార్డును ఈ బృందం సందర్శించింది. వారి రాకతో క్యాన్సర్ వార్డు స్వరూపమే మారిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకూ ఆనందంగా గడిపారు.



## సుడోకు

డైలీ సుడోకు 104 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 1 | 4 | 6 | 9 | 3 | 8 | 7 | 5 |
| 7 | 5 | 6 | 1 | 2 | 8 | 3 | 9 | 4 |
| 8 | 3 | 9 | 4 | 7 | 5 | 1 | 6 | 2 |
| 9 | 6 | 8 | 2 | 5 | 1 | 7 | 4 | 3 |
| 4 | 7 | 5 | 8 | 3 | 9 | 2 | 1 | 6 |
| 3 | 2 | 1 | 7 | 4 | 6 | 9 | 5 | 8 |
| 1 | 4 | 3 | 5 | 8 | 7 | 6 | 2 | 9 |
| 5 | 9 | 7 | 3 | 6 | 2 | 4 | 8 | 1 |
| 6 | 8 | 2 | 9 | 1 | 4 | 5 | 3 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -105

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | | 1 | 3 | | | 7 | 4 |
| | 9 | | | | | | | |
| 1 | 7 | | 5 | 9 | | | 8 | |
| | 5 | | | 7 | | 1 | | |
| 2 | | | | | | | | 8 |
| | | 8 | | 1 | | | 5 | |
| | 8 | | | 2 | 6 | | 9 | 5 |
| | | | | | | | 1 | |
| 6 | 2 | | | 5 | 1 | | | 7 |

## ట్వీట్



ఇషా కొప్పికర్
@ishakonnects



మంచిజట్టు.. మంచిమూడ్ ఉంటే చాలు, రోజు అలా గడిచిపోతుంది. నాతో ఆడవాళ్లు ఈ విషయాన్ని ఏకీభవిస్తారా?

ఇషాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,91,222

## కామన్‌మ్యాన్ వాయిస్

పెడితే తింటారు.. పడితే తిడుతారు. నేటి లోకం తీరు.. అస్సలు పట్టించుకోకు. దాని వైపే చూడకు.. పని చేసుకుంటూ మాత్రమే వెళ్లు..
– Sandhya Reddy

గొప్పోడివి అనిపించుకోవాలంటే.. మొదట ఎదుటోల్లని గొప్పగా చూసే ఆలోచనలుండాలి. నీ చుట్టూ ఉండెటోల్లను చులకనగా చూడడం మానిన రోజున.. నువ్వు అనిపించుకోవాల్సిన అవసరం లేదు. నిజంగా ఆ రోజు గొప్పోడివే ఐతవ్..!
– Ram Kishanji

నీ జీవితం అమూల్యం. నీకు విలువ ఇవ్వని వారికి అందులో క్షణం కూడా ఇవ్వకు.
– Indravelli Ramesh

## వైరల్ వీడియో



త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్నది. ఇందులో టబూ కూడా ఒక కీ రోల్ చేస్తున్నట్లు తెలిసింది. దాన్ని నిజం చేస్తూ ఆమె లుక్‌ని ఒక వీడియో చేసి యూట్యూబ్‌లో పెట్టారు. ఇప్పుడది ట్రెండింగ్ అవుతున్నది.

Welcome Aboard Tabu Garu – #AA19 Team | Allu Arjun, Pooja Hegde | Trivikram
Total views : 406,928+
Published on 23 Jul 2019

# 'డబుల్ ఇస్మార్ట్'కు రెడీగా ఉన్నా!


ఛార్మి, పూరి జగన్నాథ్, నిధి అగర్వాల్

''ఇస్మార్ట్ శంకర్' సినిమా సక్సెస్ విషయంలో నేను ఎంతో టెన్షన్ పడ్డాను. విజయం వచ్చి మూడేళ్లయింది. జీవితంలో ఎప్పుడు విజయం కోసం తపించని నేను ఫస్ట్‌టైమ్ హిట్ కొట్టాలని నిర్ణయించుకున్నాను' అన్నారు పూరి జగన్నాథ్. ఆయన దర్శకత్వంలో రామ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. నిధి అగర్వాల్, నభానటేష్ కథానాయికలు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ ' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయింది. ఇటీవల చేసిన ఆంధ్రా టూర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి ఒక్కరు ఇస్మార్ట్–2 ఎప్పుడని అడుగుతున్నారు. వెంటనే స్క్రిప్ట్‌వర్క్ స్టార్ట్ చేసి ఇస్మార్ట్–2 తీయాలని కోరికగా ఉంది. ఆ సినిమా కోసం 'డబుల్ ఇస్మార్ట్' అని టైటిల్ రిజిస్టర్ చేసి పెట్టాను. భవిష్యత్తులో కూడా మళ్లీ ఇలాంటి సీటీ వేసే సినిమాలే తీయాలని డిసైడ్ అయిపోయాను. 29 నుంచి తెలంగాణ టూర్ చేపట్టబోతున్నాం' అన్నారు. 'ఒక్కొక్కరు మూడునాలుగుసార్లు సినిమా చూశామని టిక్కెట్లు చూపిస్తున్నారు. 9రోజుల్లో 63కోట్ల వసూళ్లు సాధించింది. భవిష్యత్తులో మేము అనుకున్న కలెక్షన్ల మైలురాయిని చేరుతామనే నమ్మకం ఉంది ' అని ఛార్మి చెప్పింది. సత్యదేవ్ మాట్లాడుతూ 'పూరి సర్ ఓ డ్రగ్‌లాంటోడు. ఒక్కసారి ఆయనకు అడిక్ట్ అయిపోతే విడిచిపెట్టలేం. పూరి గారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అన్నారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన చిత్రమిదని, ఈ సినిమా విషయంలో విజయం పూరిగారి కోసం ఎదురుచూసిందని కథానాయిక నిధి అగర్వాల్ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# జాక్‌పాట్ గీతాలు


శివకుమార్, విశాల్ చంద్రశేఖర్, జ్యోతిక, సూర్య

జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'జాక్‌పాట్'. కల్యాణ్ దర్శకుడు. తెలుగులోనూ ఇదే పేరుతో విడుదల కానుంది. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హీరో సూర్య నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్ర గీతాల్ని, ట్రైలర్‌ని చెన్నైలో హీరో సూర్య విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా నాకు, జ్యోతికకు చాలా ప్రత్యేకం. ఈ చిత్రాన్ని వేరే నిర్మాతలు తీస్తే అంత బాగా రాదేమోననే భయంతో మా సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మించాను. ఇందులో జ్యోతికతో కలిసి రేవతి నటించింది. వీళ్లని చూస్తుంటే ఇద్దరు స్టార్ హీరోలు కలిసి మల్టీస్టారర్ సినిమా చేశారా అనిపించింది. ఈ ఇద్దరూ యాక్షన్ సన్నివేశాలతో పాటు కామెడీని కూడా అద్భుతంగా చేశారు. త్వరలో తెలుగులో ఓ భారీ ఈవెంట్‌ని ఏర్పాటు చేయబోతున్నాం' అన్నారు. జ్యోతిక మాట్లాడుతూ 'చాలా రోజుల తరువాత మా సొంత సంస్థలో ఈ సినిమా చేశాను. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. ముందు కాస్త భయపడినా మా ఇంట్లోనే ఓ యాక్షన్ హీరో వుండటంతో ఆయనే నన్ను ప్రోత్సహించారు. రేవతితో కలిసి నటించడం ఆనందంగా వుంది. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను' అన్నారు.

# ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా నారాయణదాస్ కె.నారంగ్



తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు శనివారం జరిగాయి. అధ్యక్షుడిగా ఎగ్జిబిటర్ సెక్టార్ నుంచి ఏషియన్ ఫిల్మ్స్ అధినేత నారాయణదాస్ కె. నారంగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటరమణారెడ్డి(దిల్‌రాజు), ముత్యాల రాందాస్, కొల్లి రామకృష్ణ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కె.ఎల్. దామోదరప్రసాద్, ముత్యాల రమేష్‌లు గెలుపొందారు. సంయుక్త కార్యదర్శులుగా భరత్ చౌదరి, నట్టికుమార్, వీర నారాయణ బాబు, జె. మోహన్‌రెడ్డి, పి. భరత్‌భూషణ్, ఎన్. నాగార్జున, కోశాధికారిగా ఎం. విజయేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ప్రొడ్యూసర్ సెక్టార్‌కు ఏలూరు సురేందర్‌రెడ్డి, డిస్ట్రిబ్యూటర్ సెక్టార్‌కు వెంకట్ అభిషేక్, స్టూడియో సెక్టార్‌కు వై.సుప్రియ, ఎగ్జిబిటర్ సెక్టార్‌కు టీఎస్ రాంప్రసాద్ లు ఛైర్మన్‌లుగా వ్యవహరిస్తారు.


దిల్‌రాజు

# చిరస్మరణీయమైన సినిమా ఇది


విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

''డియర్ కామ్రేడ్' సినిమా తర్వాత నేను పూర్తి ఎమోషనల్ పర్సన్‌గా మారిపోయాను. ప్రచార కార్యక్రమాల సందర్భంలో ఎక్కడ మాట్లాడినా ఏడుపు వచ్చేది. 'ఊరికే ఎందుకేడుస్తున్నానిట్లు' అని స్నేహితుల్ని అడిగేవాడిని. నా తమ్ముడి సినిమా ప్రీరిలీజ్ వేడుకలో కూడా ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయాను. గత ఏడాదికాలంగా ఈ సినిమా నాలోని భావోద్వేగ పార్శ్వాల్ని బహిర్గతం చేసింది' అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. యష్ రంగినేని, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, మోహన్ చెరుకూరి నిర్మాతలు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. బాబీ, లిల్లీల అనుబంధాన్ని, కలల సాఫల్యం కోసం వారిద్దరు చేసిన ప్రయాణాన్ని, సంఘర్షణను ఈ సినిమా ఆవిష్కరించింది. తొలిసారి నాలుగు భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నందున ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించడం నా బాధ్యతగా భావించాను. నేను చేయగలిగినదంతా చేశాను. నా కెరీర్‌లోనే గర్వించదగ్గ సినిమా ఇది. నా హృదయంలో చిరస్మరణీయంగా మిగిపోతుందీ చిత్రం. ఈ సినిమా కథాగమనం నెమ్మదిగా ఉందని కొందరు రివ్యూస్‌లో రాశారు. సమీక్షకులు వెలిబుచ్చిన అభిప్రాయాలన్నింటిని నేను గౌరవిస్తాను. బాబీ, లిల్లీల నాలుగేళ్ల అందమైన ప్రయాణమిది. ఈ కథను మేము నమ్మిన పంథాలోనే చెప్పాలనుకున్నాం. ది జర్నీ ఆఫ్ డియర్ కామ్రేడ్‌ను నేను ఎంతగానో మిస్ అవుతున్నాను' అన్నారు. నవీన్ ఎర్నేని మాట్లాడుతూ ' విజయ్ కెరీర్‌లోనే బెస్ట్ ఓపెనింగ్స్ వచ్చాయి. తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా 11.2కోట్ల షేర్ వసూలు చేసింది. రాబోవు నాలుగురోజుల్లో లాభాల్లో ఉంటామని పంపిణీదారులు నమ్మకంగా చెబుతున్నారు' అని తెలిపారు. 'విదేశాల్లో కూడా రెస్పాన్స్ చాలా బాగుంది. యూకే నుంచి నాకు చాలా మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు' అని యష్ రంగినేని పేర్కొన్నారు. భరత్‌కమ్మ మాట్లాడుతూ 'సినిమాలోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులందరూ సహానుభూతి చెందుతున్నారు. సంధ్య థియేటర్‌లో సినిమా చూశాం. క్లైమాక్స్‌లో అందరూ స్టాండింగ్ ఓవేషన్‌తో తమ అభిమానాన్ని చాటుకున్నారు' అని అన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ప్రేక్షకులు అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారని మైత్రీ మూవీమేకర్స్ సీఈఓ చెర్రి చెప్పారు. కెరీర్ తొలినాళ్లలోనే ఇలాంటి అద్భుతమైన సినిమాలో భాగమైనందుకు గర్వపడుతున్నానని కథానాయిక రష్మిక మందన్న ఆనందం వ్యక్తం చేసింది.

# గర్వపడేలా 'గుణ 369'

**'టెలివిజయ్ రంగంలో విజయవంతంగా ప్రయాణం కొనసాగిస్తున్న మేము అభిరుచితో కూడిన ఉత్తమ చిత్రాల్ని అందించాలనే లక్ష్యంతో సినీరంగంలోకి అడుగుపెట్టాం. తొలి ప్రయత్నంగా 'గుణ 369' చిత్రాన్ని రూపొందించే అవకాశం దక్కింది' అని అన్నారు నిర్మాతలు ప్రవీణ కడియాల, అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి. ఈ చిత్రంలో కార్తికేయ, అనఘ జంటగా నటిస్తున్నారు. అర్జున్ జంధ్యాల దర్శకుడు. ఆగస్ట్ 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర నిర్మాతలు పాత్రికేయులతో ముచ్చటించారు.**


ప్రవీణ, అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి

**యథార్థ సంఘటనల ఆధారంగా...**

యథార్థ సంఘటనల ఆధారంగా ఈ స్క్రిప్ట్‌ను తయారుచేయడం జరిగింది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల కలబోతగా సాగుతుంది. మధ్యతరగతికి చెందిన ఓ యువకుడు ప్రేమలో పడతాడు. అతని జీవితంలో చోటుచేసుకున్న అనూహ్య సంఘటనతో ఖైదీగా మారతాడు. అందుకు కారణమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. వినోద ప్రధానంగా సాగుతూనే సందేశం మిళితమై ఉంటుంది. యాక్షన్ ఘట్టాలు రొమాంచితంగా సాగుతాయి.

**తల్లిదండ్రులు గర్వపడేలా..**

ఈ సినిమా కోసం ముగ్గురం నిర్మాతలం చక్కటి అవగాహనతో ముందుకుసాగాం. మంచి అవుట్‌పుట్ కోసం కృషి చేశాం. మధ్యతరగతి జీవితాల్లోని అనుబంధాలకు దర్పణంలా ఈ సినిమా ఉంటుంది. ఆడపిల్లల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. తల్లిదండ్రులందరూ గర్వపడేలా ఉంటుంది. మన జీవితాల్ని తెరపై చూసుకున్న అనుభూతి కలుగుతుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది.

**కార్తికేయ ఇమేజ్ మార్చుతుంది..**

ఈ సినిమా విషయంలో మేము ఎంతో కసరత్తు చేశాం. మంచి సబ్జెక్ట్‌తో అరంగేట్రం చేయాలనుకొని దాదాపు ఎనిమిది కథలు విన్నాం. ఈ కథ బాగా నచ్చింది. భావోద్వేగాలతో పాటు నేటి యువతకు సందేశం ఉంటుంది. సినిమాను దర్శకుడు అర్జున్ జంధ్యాల అద్భుతంగా తెరకెక్కించాడు. హీరో కార్తికేయను కొత్త పంథాలో ప్రజెంట్ చేశాడు. ఆయన ఇమేజ్‌ను మార్చే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది. చైతన్ భరద్వాజ్ అందించిన పాటలు శ్రోతల్ని అలరిస్తున్నాయి. మా సంస్థలో తదుపరి సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నాం. మణిరత్నం దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన దర్శకుడితో ఓ సినిమా చేయాలనే ఆలోచన ఉంది. ఆ వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం.





